నవభారతి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

డిసెంబరు 1958

మూల్యం : రూపాయి

నవభారతి కార్యాలయం

గాంధీనగరం ★ విజయవాడ-2

విషయసూచిక

చిత్రములు



అన్వేషణ

★

చిత్రశిల్పి :

శ్రీ అంకాల వెంకటసుబ్బారావు.

★



ఏకాంతంగా యెంకి

★

చిత్రశిల్పి:
శ్రీ కె. బాబు

★

న వ భా ర తి

సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక

సంపుటి 1 | విజయవాడ ★ డిసెంబరు 1958 | సంచిక 7

ప్ర జా స్వా మ్యం లో ....

ప్రజాస్వామ్యంలో న్యాయశాస్త్ర నిర్ణయానికి ఉన్నతమైన గౌరవం కలదని, న్యాయనిర్ణయమే ఉత్తమ పరిపాలనకు ప్రాతిపదిక అవుతుందని ప్రజాభిప్రాయంగా స్థిరపడిపోవాలి ఈ అభిప్రాయం మన్నించబడి నప్పుడే ఏ దేశంలో అయినా పజాస్వామ్యం పురోభివృద్ధి చెందేది ఉత్తమ ప్రజాస్వామ్యానికి ఉన్నతమైన మానవ ప్రతిపత్తికి న్యాయనిర్ణయమే ప్రాధాన్యత వహిస్తుంది. ఇది ప్రజాస్వామ్య రాజ్యపరిపాలకులకు శిరోధార్యం కావాలి పాశ్చాత్య రాజ్యాలలో ఇంగ్లండు, అమెరికా మొదలయిన దేశాలు ఈ విధానాన్ని అనుసరిస్తున్నాయి. ఇది ప్రజాస్వామ్య పరిపాలకులందరికీ వరవడిగా ఉంది మనం నూతనంగా ప్రజాస్వామ్య పరిపాలనను రూపొందించుకున్నాం మన పరిపాలనలో కూడా న్యాయశాస్త్ర నిర్ణయమే ఉత్తమమైనదనే భావం మన ప్రజలలో కలిగించాలి ప్రజాస్వామ్య పరిపాలనలో న్యాయస్థానానికి ఉత్తమ అర్హతకలదనే విశ్వాసం మన ప్రజలలో స్థిరపడిపోవాలి. అప్పుడే మన ప్రజాస్వామ్యం పురోభివృద్ధి చెందుతుంది.

మన రాజ్యాంగంలో పౌరులకు ఏ హక్కులైతే కల్పించబడి ఉన్నాయో ఆ హక్కులను సంరక్షించడమే న్యాయనిర్ణయం. ఇది ఈనాడు మనదేశంలో, న్యాయనిర్ణయంలో, విధిగా పాటించ బడవలసినది. ఇది పాటించబడుతున్నదీ లేనిదీ యీనాడు మనం పరిశీలించుకోవాలి.

ప్రాంతీయ పరిపాలన, కేంద్రపరిపాలన అను రెండు భిన్నవ్యవస్థలను మన రాజ్యాంగ నిర్మాణకారులు ఏర్పాటుచేశారు. కేంద్రపరిపాలనకూ ప్రాంతీయ పరిపాలనకూ వైరుధ్యం ఏర్పడకుండా ఉండాలని రాజ్యాంగ చట్టంలో కొన్ని సూత్రాలను పొందుపరిచారు ఈ సూత్రాలలో పౌరుని హక్కులు, బాధ్యతలు నిర్వచించారు ఇవి నిర్వర్తించడంలో,, ఏ ఏ ప్రతిబంధకాలు ఏర్పడితే ఏ ఏ పద్ధతులు అనుసరించాలో న్యాయ నిర్వహణాధికారులు నిర్ణయం చేయవలసి ఉంది. చట్టబద్ధమైన న్యాయం ప్రతిఒక్క పౌరునికీ కలిగించే అర్హత న్యాయ

శాస్త్రానికీ, న్యాయమూర్తికీ ఉంది. న్యాయమూర్తి నిర్ణయాన్ని పాలకులు, పాలితులు విధిగా అనుసరించితీరాలి. ఇది ఈనాడు మన దేశంలో ఉన్నతస్థాయిలో అనుసరించ బడుతున్నదా, లేదా ? అన్న ప్రశ్నకు సమాధానం చెప్పుకోవాలి.

ప్రజాస్వామ్య వ్యవస్థలో భిన్న భిన్న రాజకీయపక్షాలు అధికార స్వీకారం చేయగల స్థితిలో ఉంటాయి. అధికార స్వీకారం చేసిన రాజకీయ పక్షం చట్టబద్ధమైన న్యాయానికి కట్టుబడి ఉండే యోగ్యతను సంపాదించుకోవాలి ప్రజాస్వామ్య పరిపాలనలో న్యాయమూర్తుల నిర్ణయం ఉత్తమమైన నిర్ణయం అనే భావం కలిగించడానికి పార్టీలే దోహదం చెయ్యాలి. ఇది ఏ స్థాయిలో నిర్వహించ బడుతుందో, ఆ స్థాయిలోనే న్యాయనిర్ణయం ఉంటుంది.

మనం పౌరధర్మం నిర్వర్తించడంలోను, చట్టబద్ధమైన న్యాయాన్ని కలిగించడంలోను నేర్చుకోవలసింది ఎంతో ఉన్నది. మనం సామాన్యమైన స్థితిలో ఉన్నాం. నూతన రాజ్యాంగాన్ని ఏర్పరచుకున్నాం. పరిపాలన చేయడంలోను, న్యాయనిర్ణయం చేయడంలోను, వివేకంతో కూడిన విజ్ఞాతాపూర్వకమైన నిర్ణయం చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం. ప్రపంచంలో ఉన్న ప్రజాస్వామ్య దేశాలలో న్యాయనిర్ణయం చేయడానికి ఏ ఉన్నతమైన ప్రమాణాలు అనుసరించ బడుతున్నాయో వాటి స్థాయికి మనం చేరడానికి ఎంతకాలం పడుతుందో యోచించి నిర్ణయించగల శక్తికూడా మనకు తక్కువగా ఉంది అయినా ప్రపంచానికి ధర్మం చెప్పడానికీ, 'న్యాయనిర్ణయం ఇది' అని నిరూపించి ఇతరులను అనుసరించమని ప్రబోధించడానికి మనకే శక్తిఉన్నదని హితబోధ మాత్రం చేస్తున్నాం. ఇందులో ఔచిత్యం లేదని చెప్పక తప్పడంలేదు.

మన ప్రజాస్వామ్యం బాల్యావస్థలో ఉంది. మన ఆచరణ బాల్యాచరణగానే ఉంది. మనం కబుర్లు చెప్పడం తగ్గించి, జీవితధర్మాన్ని అనుసరించడంలో ఉత్తమ ప్రవర్తన కలిగి పౌరులహక్కులను బాధ్యతలను గుర్తించి నడుచుకుంటే దేశానికీ, జాతికీ, న్యాయశాస్త్ర నిర్వహణకూ న్యాయం చేయడంలో సహకరించి ఉత్తమ ప్రజాస్వామ్యానికి దోహదం చేసినట్లవుతుంది.

చట్టసమ్మతమైన న్యాయానికీ, పార్టీ అధికార న్యాయానికీ తారతమ్యం ఉంది. ఈనాడు మన దేశంలో ఈ రెండింటికీ ఉన్న వ్యత్యాసం గ్రహించడానికి శక్తి చాలకుండా ఉంది. పార్టీ న్యాయం అనుసరించ బడుతుందా, చట్టసమ్మతమైన న్యాయ నిర్ణయం చేయబడుతుందా? అన్న ప్రశ్నకు సమాధానం చెప్పడం అంత సునాధ్యంకాదు. అయినా మనం కొన్ని విషయాలు గమనించడం మంచి

దనిపిస్తుంది. ప్రాంతీయ పరిపాలనకూ కేంద్ర పరిపాలనకూ ప్రాంతీయ న్యాయస్థానానికీ, కేంద్రీయ న్యాయస్థానానికీ మధ్య వైరుధ్యం ఏర్పడి కొన్ని విచిత్రమైన పరిస్థితులు సమకూరడంకూడా జరిగింది. ఈ విచిత్రమైన పరిస్థితులవల్ల న్యాయ నిర్వహణాధికారులపై పరిపాలకులకు ఆగ్రహంకూడా కలిగింది. ఇది ఇలా కలిగిందని ప్రజలందరకూ తెలిసింది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయమూర్తులకు న్యాయనిర్ణయం చేయడంలో కొంత ప్రతిబంధకాన్ని ఏర్పరిచిందనే చెప్పవచ్చు ఇది ప్రజా స్వామ్యానికీ, ప్రజాస్వామ్యంలో న్యాయమూర్తుల విధి నిర్వహణకూ తోడ్పడదని ప్రతి ఒక్కరూ గమనించాలి. ఇది గమనించి, గ్రహించి సక్రమ నిర్వహణకు తోడ్పడితేనే ప్రజాస్వామ్యమూ, న్యాయనిర్ణయమూ ఉత్తమ పద్ధతిలో నిర్వహించబడతాయి

సోషలిస్టు సమాజపద్ధతికీ, భారత రాజ్యాంగంలో నిర్వచించిన పౌర హక్కులు - బాధ్యతలకూ వైరుధ్యం ఉంది ఈ వైరుధ్యమే ఈనాడు పరిపాలకులు న్యాయశాస్త్ర నిర్ణయంలో జోక్యం కల్పించుకుంటున్నారన్న అపవాదుకు కారణంగా ఉంది ప్రజాస్వామ్య పద్ధతిలో సోషలిస్టువ్యవస్థ రూపొందాలని మన పరిపాలకులు నిర్ణయం చేశారు రాజ్యాంగ రచనా నిర్వచనా కాలంనాటికి ఈ అభిప్రాయం మనకూ, మన పరిపాలకులకూ లేదు. సోషలిస్టు వ్యవస్థలో న్యాయశాస్త్ర నిర్ణయానికి ఏ సూత్రం అనుసరించబడేదీ, ఇంతవరకూ నిర్ణయం లేదు. ప్రజాస్వామ్య పరిపాలనలో న్యాయసూత్ర నిర్ణయానికి ఇంగ్లండు, అమెరికా మొదలయిన దేశాలు ఉదాహరణగా తీసుకోవడం జరుగుతుంది. న్యాయసూత్ర నిర్వచనలో సోషలిస్టు విధానం ఇంతవరకూ రూపొందించబడిలేదు. మన పరిపాలకుల ఆలోచనలకూ, నిర్ణయాలకూ ఆధారంలేని కారణంగా న్యాయస్థానాలు తమతమ విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించలేక పోతున్నాయి. ఇందువల్లనే మన న్యాయమూర్తులూ, న్యాయస్థానాలూ రాజకీయ పక్షాలకు ఆశ్రితమైపోయి న్యాయనిర్ణయం చేయడంలో పొరపడుతున్నాయనే భావం దేశంలో వ్యాపించి ఉంది. ఇది మన ప్రజాస్వామ్య పురోభివృద్ధికి దోహదం చెయ్యదు మన రాజ్యాంగచట్టాన్ని మార్చి సోషలిస్టు రాజ్యాంగ చట్టాన్ని రూపొందించి చట్టబద్ధమైన న్యాయం చెయ్యడానికి దోహదం చేస్తేనే మనదేశంలో న్యాయస్థానాలకు గౌరవం ఏర్పడుతుంది. న్యాయస్థానాలపై గౌరవం ఏర్పడితేనే ప్రజాస్వామ్యం పురోగమిస్తుంది. మన పాలకులు మన పాలితులయెడల కారుణ్యం ఉంచి, ద్వంద్వ నిర్ణయాన్ని మార్చుకుని సోషలిస్టు పద్ధతిలో న్యాయనిర్ణయం చేయడానికి చట్టబద్ధమైన సోషలిస్టు పరిపాలనా రాజ్యాంగ రచనా నిర్మాణం చేస్తే, ఉత్తమ పౌరధర్మ నిర్వహణ సోషలిస్టు పద్ధతిలో ఏర్పడి ప్రజాస్వామ్యం పురోగమిస్తుందని విశ్వసించడానికి అవకాశం ఏర్పడుతుంది. ఇది మన రాజ్యాంగ

వేత్తల మనోవికాసంపై ఆధారపడి ఉంది. ప్రజాస్వామ్య పద్ధతిలో సోషలిజం పురోగమిస్తుందో, సోషలిస్టు పద్ధతిలో ప్రజాస్వామ్యం పురోగమిస్తుందో మన న్యాయస్థానాలకు తెలియపరచి, మన ప్రజలకు మన ప్రజాస్వామ్యవాదులు సమాధానం చెప్పవలసిఉంది. ప్రజాస్వామ్యంలో ఏది న్యాయమో, ఏది సక్రమమో, ఏది ధర్మ వర్తనమో, నిర్ణయించుకొనడానికి మన రాజ్యాంగం మన ప్రజలకు చట్టబద్ధమైన సూత్ర నిర్వచన చేస్తే అన్ని సమస్యలకూ పరిష్కారం ఏర్పడుతుంది. భవిష్యత్తులో మనపాలకులు ఏ నిర్ణయం చేస్తారో మన పాలితులు మన న్యాయమూర్తులు ఎదురుచూస్తూండవలసినదేనా? ప్రజాస్వామ్య పురోభివృద్ధికి పరిష్కార మార్గం లేదా?

★

యోగదర్శనము

శ్రీ వేలూరి శివరామశాస్త్రి

౩

ముక్తిభూమికలో పురుషుని వ్యక్తిత్వము లయము చెందదు. వ్యక్తిత్వము నిత్యము వ్యక్తిత్వము= అవిభాజ్యమగు ఏకత్వము, మఱియు అద్వితీయాత్వము (1) ఇది చిదాత్మకమేకాని చిత్ శక్తి కాశ్రయము కాదు ఏ సంబంధమును ఏ ధర్మమును లేని దీవ్యక్తిత్వము. ఇది నిత్యసిద్ధము ముక్తిభూమికయందును ముక్తపురుషుల పార్థక్యము పోదు. ఉపాధి పోవునుగాని వ్యక్తిత్వము పోదు ఈ వ్యక్తిత్వ ముపాధివలన వచ్చినదికాదు. ఒకొక్కబుద్ధిలో ఒకొక్కపురుషుని యను ప్రవేశము.

ముక్తులలో ఒండొకళ్ళకు భేదకమేది? స్వరూపభేదము లేని పెక్కువస్తువులు ఒకటి యనిన నొకటిగనే ఉండవలయునను నియమము ఉన్నదా? అట్టివెన్నియో విడివిడిగనే ఉండవచ్చును కొన్ని ఏకత్వములున్నవి వానిలో సమష్టిగతమగు ఏకత్వము సాంఖ్యయోగుల కభిమతముకాని వ్యష్టిసమష్ట్యతీతమగు ఏకత్వ మభిమతము కాదు.

ఇది బుద్ధికతీతమే! కావున పురుషబహుత్వ మెటులు తెలియును?

బుద్ధికతీతము కావుననే ఏకత్వము మాత్ర మెటులు తెలియును? ఒకఁడనుటగాని పలువు రనుటగాని బుద్ధి. సాంఖ్యయోగుల మతమున ఒకొక బుద్ధిలో నొకొక పురుషుఁడు. ముక్తిభూమికలో బుద్ధితో సంయోగ మెడయు నెడల పురుషుని వ్యక్తిత్వమున కపాయము లేదు.

పురుషుఁడు సమ్మిళిత ద్రవ్యముకాదు. ఇతఁడు దేని సంయోగముచేతను పుట్టినవాఁడు కాఁడు. కావున నీరు మొదలగువానివలె ఇతనిలో ఔపాదానిక పరిణామములేదు, ఏ కాధికో పాదాన సంయోగమువలన గలుగునది ఔపాదానిక పరిణామము.

పురుషుఁడు అసీముడు. కాన గతియులేదు. మఱి ఆకారాది రూప పరిణామమును లేదు గతితో లాక్షణిక పరిణామమున కెక్కుడు చుట్టరికము. కాలము, గతియు అవలంబముగా ఒక అవస్థనుండి మఱియొక యవస్థ సంభవించును. బంగారము గతి యవలంబముగా మురుగగును గతి కాలమునందే. పురుషునిలో పరిణామమున కాస్కారమేదియు లేదుగాన నతనిలో గతిగాని కాలముగాని లేదు. ఈ రెండును అతని అసీమత్వమునకు సాక్షులు. ఏరికి నిది విషయము కాదుగాన అసీమము స్వాతిరిక్తమేదేని యిందు లేదుగాన దేనిచేతను ఇది సీమాబద్ధము కాదు. విషయమునకు సీమ కలదుగాని పురుషునకు లేదు.

---

(1) Uniqueness.

'చితిశక్తి అపరిణామిని శుద్ధఅనంత, అని భాష్యము. ఇటనున్న అనంత పదము దేశకాలసీమాభావము చెప్పును ధర్మహీనుఁడు కాన కాలమువలన సంభవించు నేక్రియయు అతనిలోనుండదు. కావుననే కాలహీనతా రూపమగు అనంతత్వము నిత్యావస్థాయిత్వమును జెప్పదు దేశవ్యాప్యత్వము విషయధర్మము దేశముఁ గున్నది సావయవము పురుషుఁడో నిరవయవుఁడు. చేతనావ్యాపకత కర్థము దేశరాహిత్యము. చేతనకు సంకోచ వికాసములు లేవు. ఇవి జన్యపదార్థమున కుండును

పెక్కువిషయము లొండొకటికి బాధకము లయినటులు పెక్కురు పురుషు లొకళ్ళ కొకళ్ళు బాధకులు కారా? అటులగుదురేని పురుషులకు ససీమత్వము సంభవించునే అని యనుచో దేశాశ్రయులుకాని పురుషులయెడ నిది సంభవింపదు. దేశకాలముల కంటని పురుషు లొకళ్లొకళ్లకు సాధకులుగాని బాధకులు గాని కారు వీరిలో నొకరి కొకరికి ఎట్టిసంబంధమును లేదు దేశకాలతీతమగు దానిలో సంబంధకల్పన అసంగతము వీరిలో నెవరికిని వ్యాప్యవ్యాపకత్వములు లేవు పురుషుని ఏకత్వము ఏకజాతికి సంబంధించినదికాని ఏకసంఖ్యకు సంబంధించినది కాదు. (2)

వ్యుత్థానదశలో విషయములు బుద్ధియందు ప్రతిబింబించును కావున బుద్ధి తత్త్వమువఱకే క్రియాసంచారము. వృత్తి, ప్రతిబింబ పురుషుని దాఁటి పురుషునికడకు పోదు. బుద్ధిలో వృత్తి పొడమును తెలియనిదానిని తెలుపుట దానిపని ఇంద్రియములు విషయములను గ్రహించును ఆవిషయబోధ బుద్ధిలో పర్యవసించును ఇది ఆత్మను లేక పురుషుని పొంతకు పోదు. 'నేను' అనుకొను ప్రతిబింబ పురుషునిలో 'నే నెఱుఁగువాఁడను' అను ప్రకాశశీలమగు వృత్తి సంచరించును కాని పురుషునిలో ఏవృత్తియు లేదు, ఆతఁడు బుద్ధి భాసకుఁడు. వ్యుత్థానమునందును నిరోధము నందును అతఁడు నిష్క్రియుఁడు.

నిరోధ మనఁగా వృత్తిలయము వృత్తితోపాటు చిత్తేంద్రియ విలయము పూర్ణనిరోధము కలుగుచో సమాధి సమాధిగాని విక్షేపముగాని చిత్తమునకు. పురుషునకు నిరోధముగాని విక్షేపముగాని లేదు. చిత్తావస్థ యేదియు పురుషు నంటదు నిరోధము నలవాటు చేసికొనుచో క్రమముగా విషయములకు ఇంద్రియ

(2) 'ఏవ మేకత్వేన పరివర్తమానస్య న విరుద్ధ ధర్మాధ్యాసః' (1-152) సాంఖ్య సూత్ర, చూ.

పురుషైకత్వము చెప్పువారు-'ఏకమే వాద్వితీయమ్' ఇత్యాది శ్రుతుల నుదాహరింతురు. ఆశ్రుతులు సంఖ్యాపరములు కావు. మఱియు 'అగ్నిర్యథైకో భువనం ప్రవిటః వాయుర్యథైకో భువనం ప్రవిష్టః, సూర్యో యథాసర్వలోకస్య చక్షుః' అను కఠ-2-2-9, 10 11 ఉపనిషదాదుల నుదహరింతురు అవి ఉపమలు. ఉదాహరణములు కావు; హిరణ్యగర్భుఁ డిచట నుపమేయము. పురుషుఁడు కాఁడు.

సంచారమునకు పిదప అభ్యంతర వృత్తులకు విలయము. పిదప 'నేను' కు మాత్రము మిగులు. ఇంకను అభ్యాసబలముచే ఆ భూమికకును ప్రలయము.

'నేను నేను' అను బోధమాత్రము బుద్ధిసత్త్వము. ఇది స్వచ్ఛజ్ఞానవృత్తి. పురుషుని కేసి ఆ వృత్తి తిరుగఁగనే అది పురుషావబోధమున లయమగును. ఈ దెస పురుషుఁడు వ్యుత్థానమునకు నిరోధమునను బెల్లముకొట్టిన రాయి. ఇటులు చిత్తధర్మమేదియు పురుషు నాక్రమింపకున్నను 'నేను సుఖిని, నేను దుఃఖిని' అని లోకము భావనాక్లిన్నమగుచునే యుండును ఇది అవిద్య.

భోగాపవర్గములు

అస్మత్ ప్రత్యయమును అనఁగా 'నేను' అను బుద్ధి నాశ్రయించి పురుషుఁడు భుజించును లేదా త్యజించును. ఈ దెస పురుషునకు భోగసంపర్కముగాని ముక్తిసంపర్కముగాని అసలు పురుషునకో భోగాపవర్గములు జూటా. 'నేను' అను బోధ మింద్రియములతోఁగూడి విషయముల వేఁటాడి సుఖమేని దుఃఖమేని భుజించును. గ్రహణరూపమగు ఇంద్రియములయు, విషయములయు సంచారమీ భోక్తయగు 'నేను' కడకు లేక ప్రతిబింబపురుషుని కడకు బుద్ధియే 'గ్రహీత'. బుద్ధిలో పడిన నీడ అనఁగా ప్రతిబింబము లేక వ్యావహారిక పురుషుడు భోక్త (3) పురుషావభాసము లేక భోక్తృత్వము ఉపపన్నము కాదుగదా!

ఇంద్రియ సంపర్కము ఇంచుకయు లేని బుద్ధిలో పురుషావభాసమే 'నేను'. నిర్వితర్క సమాపత్తిలో (4) ఈ 'విడి-నేను-' ఎఱుక. ఈ 'నేనును' వివిక్తముగా నెఱఁగికొన్నచో ఎఱుకను కొంత కొల్లగొన్నట్లే ఈ యెఱుక పోను పోను వివేకము. దాన వైరాగ్యము. దాన గుణత్రయోపసంహృతి. అదియ అపవర్గము.

వివేకమునందు నెలకొనిన సాధకుల బుద్ధి సత్త్వమునందు సకల విషయములయు సకల చిత్తములయు భావము ప్రతిఫలించును. ఈ సాధకుల బుద్ధిసత్త్వమునందు శక్తులును విభూతులును అంకురించును. వారి సంకల్పములకు వ్యాహతి లేదు. క్రమక్రమముగా వారికి సర్వజ్ఞత్వమును సర్వచిత్తాధిష్ఠాతృత్వమును కలుగును. వారు జ్యోతిష్మత్యాది సిద్ధులు అనఁగా వారు సానంద సాఽస్మిత సమాధులు బడసినవారు. ఇట్టి సిద్ధులు కలిగినను వీరు పరమవైరాగ్యముచే వృత్తి నిరోధముచేసి ముక్తులయిన వారు మాత్రము కారు విశోకా భూమికలో అకమమగు జ్ఞానము కలుగును ఈ భూమికలో నున్నవారికి పాపపుణ్యములంటవు. వీరీశ్వరునితోపాటు జ్ఞానమునకును సిద్ధులకును కల్యాణమునకును ఆశ్రయమే కాని ఈశ్వరులు మాత్రము కారు.

---

(3) 'ఆత్మేంద్రియ మనోయుక్తం భోక్తే త్యాహు ర్మనీషిణః_ (కర

(4) 'ఏతయైవ సవిచారా నిర్విచారా చ సూక్ష్మవిషయా వ్యాఖ్యాతా- (1-44. యో.ద)

పురుష విశేషుఁడు లేక ఈశ్వరుఁడు

పురుషులందఱును అవిద్య మొదలగు క్లేశములతోడను అవి చేయించు శుభాశుభకర్మలతోడను వానివలన కలుగు సుఖదుఃఖముల తోడను వాని సంస్కారములతోడను గ్రుచ్చి యెత్తఁబడినవారే. ఇవి యేవియు ఎన్నఁడును అంటని ఒకానొక పురుషుఁ డున్నాఁడు ఈ మహాపురుషుఁ డీశ్వరుఁడు. ఇతఁడు నిత్యముక్తుఁడే కాక నిత్యేశ్వరుఁడు.

ఇతఁడు ప్రధానతత్త్వమూ కాదు, పురుషతత్త్వమూ కాదు. ఇతఁడును ప్రధాన పురుషతత్త్వ సంకలితుఁడే కాని పురుషవిశేషుఁడు ఇతని ఐశ్వరికోపాధి ప్రాకృతము. ఈయుపాధి అనాదికాలమునుండియు పురుషోపదృష్టమై నిరతిశయోత్కర్ష సంపన్నము అనాదివివేక ఖ్యాతికతన అనాది సర్వజ్ఞతా సర్వభావాధిష్ఠాతృత్వయుక్త మీ యుపాధి

జగతి కుపాదాన నిమిత్తములు ప్రకృతి పురుషులు ఇతఁ డీ రెంటిలో నేదియు కాని పురుషవిశేషుఁడు తత్త్వములలోనితనికి ప్రవేశము లేదు (5) ఈ పురుషవిశేషుఁడు పురుషతత్త్వము కాదు. నిత్యముక్తుఁడగుటజేసి ఇతఁడొక పెడ నిర్గుణుఁడు, ఐశ్వరికోపాధికలిమి ఇంకొక పెడ సగుణుఁడు. ఇట్టిఁడు సిద్ధించునా?

అనుమాన ప్రమాణముచే ఈశ్వర సత్తామాత్రము సిద్ధించును. (కల్పము యొక్క ఆద్యంతములందు) ఇతని ప్రయోజనము ఆగమముచే సిద్ధించును

అనుమానముచే ఇతఁడు సిద్ధించుఁగాక! ఉపాధి సర్వోత్కృష్ట మయినను సృష్టిస్థితి లయములతో ఇంచుకయేని సంబంధము లేని యీ పురుషునివల్ల నేమి (6) యుపయోగము?

---

(5) 'ఇంద్రియేభ్యః పరాహ్యర్థా అర్థేభ్యశ్చ పరంమనః
మనసస్తు పరా బుద్ధిర్ బుద్ధేరాత్మా మహాన్‌పరః
మహతఃపరమవ్యక్త మవ్యక్తా త్పురుషః పరః
పురుషాన్నపరం కించిత్ సాకాష్ఠా సాపరాగతిః - కఠ)

(6) ప్రొఫెసర్ శ్రీ రాధాకృష్ణులు ఇట్లు అభిప్రాయపడుచున్నారు · God is only a Particular self (Purusavisesa), and not the Creator and Preserver of the Universe He does not reward or punish the actions of men But some work had to be devised for him When once he was on the scene. He is said to aid those who are devoted to him in removing the Obstacles to their upward progress by Pranidhana, or disinterested devotion or bhakti, we become eligible for the grace of God. Isvara facilitates the attainment of liberation, but does not directly grant it. We connot help saying that the yoga Philosophy introduced the conception of God just to be in the fashion and catch the mind of the Public. (Indian Philosophy-vol 11-P-371

కల్ప ప్రలయ మహాప్రలయములందు నిర్మాణచిత్తము వికసింపఁజేసికొని సంసారులకు జ్ఞానధర్మమితఁ డుపదేశించును. ఇంతియకాక కర్మమార్గమున పయనించువారికి (7) ఇతఁడు పరమగతి. కర్మయోగులు ఈశ్వర ప్రణిధానముచే సమాధి (8) బడయుదురు.

జ్ఞానమునకు ఐశ్వర్యమునకు నిత్యాశ్రయుఁడు కాన ఈశ్వరుఁడు, ఈశ్వరులకు నీశ్వరుఁడు, (9) మఱిపూర్వగురువులందఱకునూ గురువు ప్రతి సృష్టికిని మొదట ఈశ్వరుఁడు జ్ఞానోపదేష్ట, యోగాచార్యుఁడు. కర్మయోగుల చిత్తములలో నతఁడు జ్ఞానైశ్వర్య ధర్మముల సంచరింపఁజేయును. కర్మయోగులు ఈశ్వర ప్రణిధానముచే సమాధిఁబడసి క్రమముగా నిర్గుణపురుషు నెఱిఁగి కొందురు.

ఈశ్వరుఁడు సాక్షాన్ముక్తి హేతువుకాఁడు ప్రకృతిపురుష వివేకమే ముక్తికి సాక్షాత్కారణము ఈశ్వరప్రణిధానము పరంపరా సంబంధముచే ముక్తికారణము జ్ఞానము వినా ముక్తిలేదు ఈశ్వరుఁడు శాంతసమాహిత పురుషుఁడు. అతఁడు భూతములను ప్రకృతి బంధమునుండి సాక్షాత్తు విమోచనము చేయింపఁజాలఁడు. ఆయన కా యధికారములేదు. ఈశ్వరభక్తిచే ధ్యానము, ధ్యానముచే సత్త్వశుద్ధి, సత్త్వశుద్ధిచే వివేకము, వివేకముచే విరక్తి, దాన పురుషావబోధము. అదియ ముక్తి

---

(7) తపః స్వాధ్యాయ ఈశ్వరప్రణిధానాని క్రియాయోగః 2. 1 2 32 45, 49.

'శౌచ సంతోష తపః స్వాధ్యాయేశ్వర ప్రణిధానాని నియమాః ' 2-32.

'సమాధి సిద్ధి రీశ్వరప్రణిధానాత్.' 2-45.

'సత్త్వపురుషాన్యతా ఖ్యాతిమాత్రస్య సర్వభావాధిష్ఠాతృత్వం సర్వజ్ఞాతృత్వంచ' 3-49 యో. ద.

(8) ఈశ్వర ప్రణిధానాద్వా 1,23 యో,ద

'యో బ్రహ్మాణం విదధాతి పూర్వమ్
యో వై వేదాంశ్చప్రహిణోతి తస్మై
తమ్ హ దేవ మాత్మబుద్ధి ప్రకాశమ్
ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే.' -శ్వేతాశ్వతర-

(9) 'స పూర్వేషా మపిగురుః కాలే నానవచ్ఛేదాత్ - 1-26 యో. ద.

★

తెలుఁగు తల్లి

విద్వాన్, శ్రీ బి. భావనారాయణ. ఎం. ఏ. బి. ఓ. యల్.

కమ్మని పల్కులెల్ల వడిగట్టియుఁ గూర్చె నమేయ మాధురిన్
కొమ్మన పుత్త్రుఁడమ్మ, మునుఁ గూరిమి మీఱఁగ భారతమ్మునన్,
ఇమ్మహి ధన్య వీవు తగ నేవిధిఁజూచిన అమ్మరో, మదిన్
నమ్మితి మాతృదేవి నిను, నా కలమందు వసింప వేడెదన్.

పసితనమందె నీ జనని పాలునఁ జక్కఁగ రంగరించి, యా
యసిత సరోరుహాక్షి భరతావని పావనవాణి, యా దివౌ
కసుల ప్రశస్త వాఙ్మయపు గాదిలిరాణి, నయించె నీకునై
పొసఁగఁగ నీదు నోట, సురపూజిత వాఙ్మయ ఖండశర్కరన్.

ఎందఱు బిడ్డలో కలిగి రిందఱిలో నినుఁగూర్చి పల్కు వా
రందఱు, తెల్గుబిడ్డ నుడి యందలి సొంపును నింపు సంపదల్
అందఱి కేల గల్గునని యబ్బురమై వచియించుచుండ, నా
డెందము తామరై వికచ లీలల నాట్యము సల్పునమ్మరో!

కమ్మని గీతమాలికలు గాయకు లొప్పుగఁ బాడుచుండగా
ఇమ్ముగఁ దేలుచుండు, వరనిద్ధపుఁ బల్కుల తేట యూటలున్,
అమ్మరో, దేవవాణి కిల నాత్మజవై తగితమ్మ, మేలుగా
నిమ్మహి నాకుఁ గూర్చు కడు నీప్సిత భాగ్యముఁ బల్కు సంపదన్.

మును పాశ్చాత్యులు రాజ్యపాలనకు నీ భూదేవిఁ బాలించుచో
జన సామాన్యపు బాసలన్ వినుచు, నీ శబ్దావళీ మాధురిన్
మన మారంగను గ్రోలుచున్, బలికి రంబా, ధాత్రిలో నిన్ సదా
ప్రణుతిన్ దేల్చుచు, గర్వకారణము మా భాగ్యమ్మ సామాన్యమే!

శ్రీ మద్రామాయణ కల్పవృక్షము - శిల్పదృష్టి
విశ్వామిత్రుని వాత్సల్యము

విశ్వామిత్రుఁడు రామలక్ష్మణులను దనవెంటఁ బంపుమని యడిగినాడు. దశరథుఁడు తటపటాయించఁగా తాను కోపముతో నడిచిపోయి ప్రథమ కక్ష్యాంతరమునఁ బెడమొగముగాఁ గూర్చుండినాడు వెళ్లిపోక అక్కడఁ గూర్చుండుట యెందులకు? దశరథుఁడు తన కొడుకులను బంపునని యాయనకుఁ దెలియును. కొంతసేపటికి వారు వచ్చిరి. ఆయన వారివంకఁ జూడకుండగనే నడువ నారంభించెను సరయువు దాక వచ్చెను. అప్పటికి వెనుకకుఁ దిరిగి 'రామ రఘుపతీ' యని పిలచెను. ఆ 'రామ' యని పిలుచుట యెట్లున్నది·

"రామ యను నక్షరముల్ చలితాధరంబునం
దునన్ కవుంగలించి కొనునో యన మెల్లన నవ్వళించి"

'రామ' యన్న రెండక్షరములు ఆయన పెదవులను కౌగిలించు కొన్నట్లున్నవఁట. విశ్వామిత్రునకు రాముఁ డన్న నంత ప్రేమ

ముని బలాబల లను విద్యలను రామునకిచ్చెను. తరువాత నడచిపోవుచుండెను. నడచుచుండిరి.

నడచువేళ మౌని నాథుండు కొంత సే
పిరువురకును నడుమ నేగుచుండుఁ
గొంతసేపు ముందుకుం దూఁగి నడచును
గొంతసేపు వెనుకఁ గూడివచ్చు.

ఇరువురకు నడుమఁ జనుచో
నిరువురి కేల్దమ్ములంది యిట్టటు కదుపున్
ఇరువురకు వెనుకఁ జనుచో
నిరువురి గమనముల శోభ నెంచుచునుండున్·

ఇన్ని రకములుగా నడచినఁగాని ఆయనకుఁ దృప్తిలేదు.

తరువాత అంగదేశమును జేరినాడు. ఇది యే దేశమని రాముఁ డడిగినాడు. విశ్వామిత్రుఁడు నవ్వుచు—

'నన విలుకాఁడటంచు వినినారు గదయ్య' అని మొదలుపెట్టినాడు. రామలక్ష్మణు లిద్దరు పిన్నవారలు. వీరికి తన యస్త్రము లుపదేశించి. వీరిచే తన యజ్ఞము రక్షింపఁజేసికొని మిథిలకుఁ దీసికొనిపోయి, శివధనుర్భంగ మీయనచేతఁ జేయించవలెనని ముని కోరిక. రామునకును సీతకును బెండ్లి కావలయును. రాముఁడొక యింటివాఁడు కావలయును. ఆ యుద్దేశ్యముతో పసివాఁడైన రామునితో నిది పరాచికమాడుట. మన్మథుఁడని విన్నారుకదా? వారు విన్నారో లేదో; సీతాపతి తప్పకుండ వినవలయును. ఇందులోని రహస్యమిది.

అక్కడ నొకపల్లెలో వారారాత్రికి విశ్రమించిరి. వారిని తండ్రి దగ్గరనుంచి తీసికొని వచ్చినాడు. వారే రీతిగను దిగులుపడఁగూడదు. ఇంటి బెంగపెట్టి కొనఁగూడదు అంత జాగ్రత్తగాఁ జూడవలయును. అందుచేత వారికి తెల్లవారులు కథలే చెప్పుచుండెను. ఆ కథలమీద వారికెంత మమకారము పుట్టవలయునో అంత పుట్టునట్లు చెప్పవలయును. ఇది యంతయు వట్టికథలు చెప్పుటయే కాదు. వారికి బోలెడంత జ్ఞానము కలుగవలయును.

ఆరేయెల్లను గాధిసూతి పరిహాసాశ్చర్యభీరౌద్ర శృం
గార స్థానములౌ కథానకములన్ గాకుత్థ్సులన్ సమ్మదాం
భోరాశిన్ మునుఁగంగఁజేసె శిశువుల్ ముగ్ధాత్ములై తత్కథా
ధారాయోగ్యము గాఁగ నుద్ధతిని దత్తద్భావముల్ పొందఁగన్.

విశ్వామిత్ర యాగరక్షణమయినది. మిథిలానగరమునకు బయలుదేరినారు రామునకును మునియందు చనవేర్పడినది. పూర్వము కథ యడిగెడుతీరు వేఱు. ఇప్పుడడిగెడితీరు వేఱు. రాముఁడిట్లడుగుచున్నాడు

తపములు కల్గునేమొ! యరుదారమహాత్ములు కల్గునేమొ! యా
కృపయును గల్గునేమొ! మఱి యేఋషులందుననో రసోల్బణా
నుపమముగాఁ గథా కథనముండదు మీవలె, మాకుఁ జెప్పఁడా
యిపుడన రామచంద్రుఁడు చనవెంచి హసించుచు మౌని యిట్లనెన్.

చిన్ని కథఁజెప్పి నీకు నీచేత నొక్క యే మహాకార్యమేను జేయింతు నింత
యల్ప సంతోషివేమి రామా! యటంచు నవ్వె ఋషి, యెల్ల ఋషులును నవ్వినారు.

అందఱు నవ్వఁగా రాముడు తలవంచికొనియెను ఇచ్చటి నుండి చెప్పెడి కథలలో రామచంద్రునకు శిక్షా వీధియన్నట్లు శృంగారరసము జోడించి ముని కథలు చెప్పుచుండును మఱియు రామచంద్రుని రకరకములుగా పిలుచును

ఉషసుతమ్మి మోము నొప్పెడు రఘురామ ఇందు రోచి నవ్వులేచు తండ్రి

అని మఱియు ప్రొద్దుపోవు వరకు కథలు చెప్పి—

'మీ యారోగ్యము చూచుకో వలెనయా మీతండ్రి కష్టమ్ముతో
నాయెంబో మిమ్ముఁబంప నన్నుఁబడి'

అని వారిని నిద్ర పొమ్మనును. వారికి నిద్రపట్టునా! ఆకథలన్నియు రాముని యెడఁదలో గిరగిర తిరుగ నారంభించినవి. మఱియింకొక కథ రాముఁడట్లే యడుగును. పైఁగా

నీ • యాశ్వీ నాక్రమణంబులో యను కథాత్తానంత విజ్ఞానమే
విశ్వంబుల్ వెలిగించు నాయెడఁద, నే విందున్ వచింపంగదే!

గుఱ్ఱమొక్క దినములో నెంతదూరము పోఁగలదో అంతదూరమునకు ఆశ్వీనమని పేరు. విశ్వామిత్రుని కథ గుఱ్ఱపు నడకవలె నడుచునని రాముని యుద్దేశ్యము.

విశ్వామిత్రుఁడు పిల్లలకు కథలెట్లుచెప్ప వలయునో తెలిసిన వాఁడు. గంగ కథచెప్పుచు-

ఒగి ముల్లోకము త్రాగ నీరడుచు లేకున్నన్ మహాఘంబులున్
పొగలై జీబులు కట్టి దమ్మిన నిలింపుల్ దేవ కార్యార్థమై
నగరాజున్ దమ పెద్దకూతు నడుగన్ నాకావనీ భోగిరా
డ్జగతీ వాహిని గాగ నిచ్చెను మహాక్ష్మాభృత్తు రాహుత్తునై.

మూఁడు లోకాలకును త్రాగుటకు నీళ్లులేవు పాపాలు జీబులుకట్టి దమ్మకొన్నవి. ఈ మాటలు పిల్లల యెదలకు హత్తుకొనుటకై చెప్పినవి. మహాక్ష్మాభృత్తు రాహుత్తు అన్నయీ యంత్యప్రాస కథ వినెడు పిల్లలకు మాట పసందుచేత సంతోషము కలుగుటకు—

తోణికసల గంగ చేతులు మూసికొనుచు
మణిసిరుల గంగ బుజములు మార్చుకొనుచు
మోసికొని పోయిరిని నిలింపులు తలంపు
లానకొసలంట గంగ స్వర్గాభిముఖులు.

దేవతలు గంగను మోసికొనిపోవుచు మాటిమాటికి గంగలో చేతులు తడుపుకొనుచున్నారట. బుజాలు బుజాలు మార్చుకొనుచున్నారట. ఈ మాటలు పిల్లలకెంత రమ్యముగానుండును! గాధేయునివెంట వచ్చుచు రామలక్ష్మణులు నదులు దాటినప్పుడెల్ల తమచేతులు మాటిమాటికి నీళ్ళలోముంచిన వారేకదా!

'మోసికొనిపోయిరిని నిలింపులు'

ఇక్కడనున్న సముచ్చయము కథచెప్పెడు నేర్పులోని భాగము వాడుకగా మనము "మోసికొని వెళ్ళారున్నూ" అందుము ఈ లక్షణమా సముచ్చయము

ఇట్లు రామలక్ష్మణులకు గాధేయుఁడు చెప్పిన కథలన్నియు వారిగుండెలకా కథలలోని రమ్యత పట్టునట్లే చెప్పబడినవి గంగా పార్వతులకథ చెప్పిచెప్పి ముని "ఆ తల్లియట్లయ్యె. ఈ తల్లి యిట్లయ్యె ఇది వారికథ" అనును గంగ అట్లైనదఁట, పార్వతి ఇట్లైనదఁట!

ఆ రామలక్ష్మణులన్నచో విశ్వామిత్రుని కెంతప్రేమయో! వారికా కథలన్నియు నట్లు చెప్పినాడు ఆరాత్రి కొంతకథ చెప్పి కథ ముగించినట్లు చెప్పినాడు రామునకు తృప్తియెక్కడ?

"అనినన్ రాముఁడు మీకిదిన్ శ్రమముగా నొనేమొ రేయెల్ల ప్రొ
ద్దును నట్లే కథ చెప్పుటైనయది యెందున్ మేము సౌఖ్యమ్ముగా
వినుటో కష్టము కాదనన్ మునియు నవ్వెను"

ఇది ఆయన చెప్పెడు లక్షణము. ఈయన వినియెడి లక్షణము

గంగ భూమికి వచ్చిన కథ రాముఁడడిగెను గాధేయుఁడు 'కుమారస్వామిపుట్టుక' కథచెప్పెను. చెప్పి, తనకు కథలు చెప్పుటలోనున్న నేర్పును గుఱించి వినెడి ఆ పిల్లలకు విసుగు కలుగకుంటకుఁగూడ నిట్లనెను.

అడిగినదేమొ చెప్పకుపె యాయితరమ్ముఖలంబు చెప్పు మా
యుడుగక యిట్లె వించుఁబడి యుందురు శ్రోతలు నిద్దియే సుమీ
గడుసరియౌ కథాకథన కౌశలమేమి యటందు రన్న రా
బుడుతలు రామలక్ష్మణుల మోమున నవ్వులుప్రోసె మువ్వలై.

అసలుకథ చెప్పెదను వినుఁడంచు మౌని
పుడమి పడఁతికిఁ బెట్టిన పునుగుబొట్టు
కలదయోధ్యయటన్న చక్కని పురంబు
మీ రెఱుంగుదు రేయన వా-రు నగుచు

మే మెఱుంగుదుమన మౌని మేలు మేలు
మీ రెఱింగినఁ గథలోని మేలి సగము
నెఱుఁగుదురె యంట యప్పుర మేలుఁ దొల్లి
యనఁగ ననఁగను సగరుఁడన్నట్టి రాజు.

రామలక్ష్మణులది యయోధ్య. చెప్పుచున్న కథలోని నగరునిది యయోధ్యయే "అయోధ్యయను నొక పట్టణమున్నది మీ రెఱుఁగుదురా?" అని వారి నడిగినాడు వారు "మేమెఱుఁగుదుము ఎఱుఁగుదు"మన్నారు నిజముగా నవ్వవలయును. ఆప్రశ్నలో అర్థమేమున్నది? ఆయయోధ్యాయకులైన పిల్లలు మేమెరుఁగుదు మన్నారు. తర్వాత కథ వినవలెనన్న కోరికలో ఇది యసంగతమైన ప్రశ్నయని వారికి తోచదు. 'మేమెఱుఁగుదు మనఁగా 'ఐనచో కథలో సగము మీకు తెలిసినట్లే!' అని వారితో పరాచికము లాడును.

ఈ కథలలో నున్న బహ్వంశములు ఈ దృష్టితోడనే చూడవలయును. విశ్వామిత్రుఁడు తన ప్రేమయంతయు రామచంద్రుని మీఁద నొలుకఁబోయుచుండును. వందలచోట్ల ఆ పిల్లలకు నచ్చునట్లు కథను మఱచుచుండును

గంగానదిని దాటవలమును. రాముఁడు మునితో 'స్వామీ నీకోసము నౌక సిద్ధముగా నున్న' దని, 'భాగీరథి తన కథను నీకు చెప్పుటమూలముగా నీయందు ప్రసన్నురాలై యెదురు చూచుచున్నది ఆమెయొక్క-

"... పాలార్ఘ్య ప్రదానక్రియా
స్వీకారమ్మును గాంచవే ముని శిరస్సీమంత ముక్తామణీ!
అనినన్ నవ్వుచు గాధిసూతి బళిరయ్యా బాలకాకుత్స్థ! మా
ముని మూర్ధంబుల నట్టకట్టిన జడల్ పోఁద్రోచి సీమంతముల్
తనుకన్ బాపటఁ దీర్చి యాపయిని ముక్తారత్నముల్ పెట్టె దీ
వను లెట్టె నాతలపైని ముత్యములునై యాముక్తమయ్యెన్ శిశూ!

భగవంతుఁడైన యా బాలుఁడు రాముఁడు తన్ను 'ముని శిరస్సీమంత ముక్తామణీ' యని పిలచినాడని యా మునికెంత యానందము! 'ఔనోయి నాయనా! మా తలలమీఁది జడలట్టలు కట్టినవి. నీవాజడలు దువ్వి పాపటతీసి దానిపైని ముత్యాలుపెట్టుదువు' అని పరమ వేదాంతము ఆ పిల్లవానిని లాలించినట్లు చెప్పుచున్నాడు.

అన్ని కథలిట్లు చూచికొనవలయునని వ్రాసితిమిగదా! అన్నిటికంటె తలమానికముగా నిది చూడవలయును. మిథిలానగరములో జనకుడు 'ఈ పిల్లవాండ్రెవ్వరు?' అని అడిగినాడు. దానికి విశ్వామిత్రుఁడిట్లనెను.

వీరా! వీరు విదేహరాజ! మిథిలావృద్ధశ్రవా! యాజ్ఞ్యవ
ల్క్యారూఢోజ్జ్వల శిష్యతాజలధి! బ్రహ్మజ్ఞాని! సీరధ్వజా!
ఈ రాజన్య కుమారులున్ దొరకినా రెచ్చోటనో నాకు నా
తో రా నే నొకచోట వెన్దిరిగి చూతున్ వీరు గన్పించినన్.

"వీరా? వీరెవరోనయ్యా! నాకెక్కడో దొరికినారు. నే నొకచోట కూర్చుంటిని. నేనిట్లు వెనుకకుఁదిరిగి చూచితిని వీరు కనిపించిరి." అని చెప్పెను ఇది నిజమేకదా? తానుఅయోధ్య వెలిగడపవద్దఁ గూర్చుండఁగా రామలక్ష్మణులు వచ్చిరి వారివంక చూడకుండనే సరయువుదాక నడచివెళ్లెను. అప్పుడు వెనుదిరిగి చూచినాడు వారు కనిపించిరి. విశ్వామిత్రునిది యేమిప్రేమ! ఎందుకుకాదు? తాను భగవంతుని వెంటఁ దెచ్చికొనెను ఎన్నివిధములుగానైన నాభగవంతునితో నాడుకొనుటకు వీలుగానైన వయస్సులో నా భగవంతుడుండెను, ఈ ప్రేమ ఇంక నెన్నెన్నివిధములుగానో యున్నది. పాఠకులు చూచుకోవలయును.

మనుస్మృతి - కొన్ని సమాధానములు

శ్రీ జటావల్లభుల పురుషోత్తము, ఎం. ఏ.

మనుస్మృతి యెవరికొఱకు?

మనుస్మృతిలో ననేక సందర్భములలో "బ్రాహ్మణుడిట్లు చేయవలయును" "బ్రాహ్మణుడిట్లు చేయరాదు" మున్నగు విధినిషేధము లుండును. అవి బ్రాహ్మణుడు మాత్రమే పాటింపదగినవా? ఇతరులు కూడ పాటింపదగినవా యనునది ప్రశ్న. దీనికి సమాధానము దశమాధ్యాయములో నున్నది

యథాయథా హి సద్వృత్త మాతిష్ఠత్యనసూయకః
తథాతథేమం చాముం చ లోకం ప్రాప్నోత్య
నిందితః (10-128)

శూద్రులు ఇతరులను నిందింపనివారై మంచి యాచారములను అనుష్ఠింపవచ్చును. అట్లనుష్ఠించుచో వారు నిందార్హులు కారు, పైగా ఇహపర సౌఖ్యములను పొందగల్గుదురు.

ధర్మేప్సవస్తు ధర్మజ్ఞాస్సతాంవృత్త మనుష్ఠితాః
మంత్రవర్జ్యం నదుష్యంతి ప్రశంసాం
ప్రాప్నువన్తిచ. (10_127)

ఏ శూద్రులు ధర్మమును తెలిసికొన్నవారై తమకు ప్రత్యేకముగా నిషేధింపబడనట్టియు, ద్విజులకు విధింపబడినట్టియు కర్మల నాచరింపగోరుదురో అట్టివారు దోషమునుపొందరు, పైగా స్తుతింపబడుదురు. ఉదాహరణమునకు శూద్రులుకూడ పంచమహాయజ్ఞములను చేయవలయును; కాని యితరమంత్ర ప్రయోగము లేకుండ నమస్కార మంత్రప్రయోగమునే చేయవలయును.

వ్యవస్థిత విభాషచే కాని, ప్రత్యేక వర్ణ ప్రయుక్త విధులచే కాని బాధింపబడని ధర్మములన్నియు-శిష్టాచారము, ఇంద్రియ నిగ్రహము, ఈశ్వరారాధనము, నిత్యనైమిత్తిక కర్మలు మున్నగు బహుశత సంఖ్యాకధర్మములు - బ్రాహ్మణులకు మాత్రమేకాక యెల్లరకును అనుష్ఠేయములేయని యిట్లు మనువే స్పష్టపఱచియున్నాడు.

భారతేతర దేశ నివాసమువలన హానియేమి?

మనువు మతములో భారతదేశము పవిత్ర భూమియనియు, ఇతరదేశ నివాసము చాతుర్వర్ణ్యమువారికి మంచిదికాదనియు ద్విజులకు విశేషముగా నిషిద్ధమనియు "ధర్మవివేక"మను వ్యాసములో నిరూపించియుంటిని. ఇతరదేశ వాసమువలన క్రమముగా వైదిక ధర్మము నుండి చాతుర్వర్ణమువారు భ్రష్టులై పోవుదురను నది యీ క్రింది మనువాక్యముల వలన తెలియుచున్నది.

శనకైస్తు క్రియాలోపాదిమాః క్షత్రియ జాతయః
వృషలత్వం గతాలోకే బ్రాహ్మణాదర్శనేనచ.
పౌండ్రకాశ్చౌడ్రద్రవిడాః కాంభోజాయవనాశ్శకా
పారదాపహ్లవాశ్చీనాః కిరాతాదరదాఃఖశాః
(10-43,44)

పౌండ్రక,ఔడ్ర ద్రవిడ,కాంభోజ, యవన శక, పారద, పహ్లవ, చీన, కిరాత, దరదఖశ దేశములకేగి యటస్థిరపడిన క్షత్రియులు క్రమముగా క్షత్రియత్వమును కోల్పోయి వృషలురైరి. కారణమేమనగా- ఈ ప్రదేశములలో వారికి ఉపనయనాది సంస్కారములను కాని ప్రాయశ్చిత్తములను కాని చేయించగల బ్రాహ్మణులు లేకుండిరి.

పైని తెలిపినదేశములు కొన్ని భారతదేశములో నంతర్భూతములు; కొన్ని భారతదేశమునకు వెలుపలనుండినవి ఈ రెండు విధములైన దేశములకును సామాన్యలక్షణము విద్వాంసులయిన బ్రాహ్మణులు లేకుండుట. అట్టి ప్రదేశములలో స్థిరపడిన వారికి కర్మకలాపము జరిగించు యాజ్ఞికులు లభింపనందున క్రమముగా వీరు కర్మభ్రష్టులైపోయిరి.

ఇది క్షత్రియ సందర్భముగానే చెప్పబడినను వైదిక సంప్రదాయమునకు సంబంధించిన

చాతుర్వర్ణ్యమువారెవరైనను విదేశములలో స్థిర పడిపోవుటవలన క్రమముగా సంస్కార రహితులగుటయేకాక అనేక సదాచారములను సత్సంప్రదాయములను కోల్పోయి, వైదిక పౌరాణిక విజ్ఞానమునుకూడ విస్మరించి కొన్ని తరములు గడచునప్పటికి పూర్తిగా వేదధర్మ బాహ్యులయిపోవు ప్రమాద మున్నందున విదేశ స్థిరనివాసము తగదని సిద్ధమగుచున్నది.

హింసలేకుండ జీవింపవచ్చునా ?

సర్వధర్మములలోను సత్యహింసలకు మనువు అగ్రస్థానము నిచ్చుచున్నాడని యిది వఱకుచూచియుంటిమి "హింసలేకుండ బ్రదుక గలమా? నడచునపుడు క్రిమికీటకాదులు చని పోవుటలేదా? శాకములలో ప్రాణములేదా ?" ఇత్యాది తర్కములకు మనుస్మృతిలో సమాధానము కలదు. ఈ ప్రశ్నలకు వెనుకనున్న భావము "ఈ హింసను చేయునపు డాహింస నెందులకు చేయరాదు?" అనునది. మనువు చెప్పున దేమన: హింస నెంతతక్కువగా చేసిన నంతమంచిది, బొత్తిగా చేయకుండుట సర్వోత్తమము.

అద్రోహే ణైవభూతానా మల్పద్రోహేణ వాపునః
యావృత్తిస్తాం సమాస్థాయ విప్రోజీవేదనాపది.

బ్రాహ్మణుడు ఏ ప్రాణికిని హింసను గల్గింపకుండ జీవింపవలయును. అది సాధ్యము కానిచో వీలైనంత తక్కువ హింసతో జీవింపవలయును ఆపత్కాలమున కిది వర్తింపదు

కావున ధార్మికుడు "ఇంతకంటె తక్కువ హింసతో జీవింపజాలనా?" యను చింతతో నుండవలయును. కాని "కొంతహింస అనివార్యముగా జరుగుచున్నందున మరికొంత హింసను ఎందులకు చేయకూడదు?" అను దృష్టితో విచారింపకూడదు

మనుస్మృతిలో భక్తిమార్గమునకు తావులేదా ?

మనుస్మృతి ధర్మబోధక గ్రంథము; ఎక్కడ పట్టినను ధర్మములు కన్పట్టును. కర్మ భక్తి జ్ఞానమార్గములలో కర్మమార్గము మాత్రమే మనువునకు సమ్మతమని తలంపరాదు. మూడు మార్గములును సమ్మతములే యనుటకు మనుస్మృతిలో ననేకాధారము లున్నవి జ్ఞానము, మోక్షదృష్టి మనువులో నెట్టి స్థానము నాక్రమించుచున్నవో "ఆధ్యాత్మిక సాధనలు" అను వ్యాసములో నిరూపించియుంటిని, భక్తిమార్గము మనువులో నెట్లు వ్యక్తమగుచున్నదో చూతము.

సృష్టిస్థితిలయములకు పరమేశ్వరుడే కారణమనియు, పరమేశ్వర సంకల్పానుసారమే సర్వము నడచుచున్నదనియు మనుస్మృతి ప్రథమాధ్యాయములో విపులముగా తెలుపబడినది. స్వధర్మానుష్ఠాన రూపముగా పరమేశ్వరు నారాధింపవలయుననియు, అది మోక్షసాధనమనియు మనువు తెలిపినట్లుచూచియున్నాము. భక్తిమార్గములో ప్రముఖ స్థానము నుపొందు విగ్రహారాధనము కూడ మనువు విధించుచున్నాడు, పర్వదినములలో దేవాలయమునకేగి దేవతా దర్శనము చేయవలయునని మనువాదేశించుచున్నాడు

దైవతాన్యభిగచ్ఛేత్తుధార్మికాంశ్చద్విజోత్తమాన్
ఈశ్వరం చైవరక్షార్థం గురూనేవచ పర్వసు.

దేవతా విగ్రహములకు కానుక లర్పించు పద్ధతికూడ మనుస్మృతిలో కన్పట్టుచున్నది. దేవాలయాదులలో దేవతల కర్పింపబడిన ధనమును హరించినవాడు పాపాత్ముడని మనువు నిందించుచున్నాడు.,

దేవస్వం బ్రాహ్మణ స్వంవా లోభేనోప హినస్తియః
సపాపాత్మా పరంలోకే గృధ్రోచ్ఛిష్టేన జీవతి.

దేవాలయములో దేవునకు సువర్ణాది దానము కూడ కొన్ని సందర్భములలో విధింపబడినది. (7-20)

మనువు దేవతారాధనమును విధించినట్లే దేవతానిందను నిషేధించుచున్నాడు.

నాస్తిక్యం వేదనిందాంచ దేవతానాంచకుత్సనం
ద్వేషం దంభంచ మానం చ క్రోధంతైక్ష్యంచ వర్జయేత్.

పరలోకము లేదనుభావమును పొందరాదు; వేదమును నిందింపరాదు, దేవతలను దూషింపరాదు, ద్వేషమును, దంభమును, దురభిమానమును, కోపమును, ఇతరులపై మండిపడుటను విడచిపెట్టవలయును. ఇట్లు మనుస్మృతిప్రధానముగా కర్మమార్గప్రతిపాదకమేయైనను అందందు వికీర్ణములైయున్న భక్తివిధాయకవచనములు భక్తి మార్గముయొక్క శ్రేయస్సాధనతను నిరూపించుచున్నవి.

★

ఆంధ్రతర్క సంగ్రహము

శ్రీ కుప్పా బైరాగి శాస్త్రి

3

మూ॥ చక్షుర్మాత్రగ్రాహ్యోగుణోరూపం। తచ్చ శుక్ల,నీల, పీతర క్తహరిత కపిశచిత్రభేదాత్ స ప్తవిధం । పృధివీజలతేజోవృ త్తి । తత్ర పృధివ్యాంస ప్తవిధం। అభాస్వరశుక్లంజలే । భాస్వరశుక్లం తేజసి-

ద్రవ్యముల లక్షణముచెప్పి గుణముల లక్షణములు చెప్పబడుచున్నవి - మొదట రూపమునకు లక్షణము చెప్పుచున్నారు.

చక్షురింద్రియ మ న గా (కన్ను) నేత్రము. నేత్రముచేతనే గ్రహించబడిన దై గుణము గూడా అగుట రూపము యొక్క లక్షణము. నేత్రముచే గ్రహించబడుట అనగా నేత్రమనే ఇంద్రియము వల్ల కలిగిన ప్రత్యక్షములో విషయమగుట. నేత్రమువలన కలిగిన ప్రత్యక్షమనగా ఇది తెల్లగా ఉన్నది, ఇది నల్లగా ఉన్నది అను ప్రత్యక్షము. ఆ ప్రత్యక్షములో తెలుపు నలుపు విషయములు ఆ ప్రత్యక్షములో విషయమై గుణముగూడా అయినదిగాన రూపమందు లక్షణసమన్వయము అయినది ఈలక్షణములో నేత్రేంద్రియము చేతనేకలిగినప్రత్యక్షములోవిషయమగుట అనగా నేత్రేంద్రియము వలనకల్గిన ప్రత్యక్షములో విషయమగుట, నేత్రేంద్రియము కంటెఇతరమైన ఇంద్రియము వలన కలిగిన ప్రత్యక్షములో విషయము కాకపోవుట అని అర్థము. ఇప్పుడు చక్షురింద్రియ లక్షణములో మూడు దళములు వచ్చినవి. కేవలము గుణమగుటయే లక్షణముగా చెప్పిన, రసాదిగుణముల యందు అతివ్యాప్తి. నేత్రేంద్రియముచే కలిగిన ప్రత్యక్షములో విషయమగు అను విశేషణమును గూడా లక్షణములో ఉంచిన రసమందు అతివ్యాప్తి వారించినప్పటికీ,సంఖ్యయందుఅతివ్యాప్తి.సంఖ్య గూడా నేత్రేంద్రియ గ్రాహ్యముగాన, నేత్రేంద్రియముకంటె ఇతర ఇంద్రియము వలన కలిగిన ప్రత్యక్షములో విషయము కాకపోవుట అను విశేషణము వలన సంఖ్యయందు అతివ్యాప్తి వారించును సంఖ్య త్వగింద్రియము (స్పర్శనేంద్రియము) చేతగ్రహించ బడునుగాన ఆ ప్రత్యక్షములో విషయము అగును. విషయము కాకపోవుటలేదు. అంత మాత్రముచేతనే సరిపోవుచో నేత్రేంద్రియము వలన కలిగిన ప్రత్యక్షములో విషయమగుట అను విశేషణమెందుకనగా అతీంద్రియములయిన గురుత్వాదుల యందు అతివ్యాప్తి వారించుటకు. గురుత్వము అతీంద్రియము అనగా యేఇంద్రియము చేతను గ్రహింబడదు అని అప్పుడు నేత్రేంద్రియము కంటె యితరమైన ఇంద్రియము వలన కలిగిన ప్రత్యక్షములో గూడా విషయముగాదు, గుణముగూడా అయినదిగాన అతివ్యాప్తివచ్చును. దాని నివారణ కొరకు మొదటి విశేషణమైన నేత్రేంద్రియము వలన కలిగిన ప్రత్యక్షములో విషయమగుట అనునది ఆవశ్యకము. ఇప్పుడు మొదటి రెండు విశేషణముల చేతనే లక్షణము సరిపోయిన, విశేష్యమయిన గుణము అగుట అను విశేష్య

మెందుకన, రూపత్వమను జాతియందు అతివ్యాప్తివారణకు అనిచెప్పవలయును. రూపమందు రూపత్వమను ధర్మము కలదు. అది జాతియనియు,నిత్యమనియు తార్కికులసంకేతము. యేగుణము యే యింద్రియముచే గ్రహింపబడునో ఆగుణ మందలి జాతి, ఆ గుణము యొక్క అభావము ఆ యింద్రియముచే గ్రహించ బడును.గాన రూపత్వజాతికూడా నేత్రేంద్రియము చేతనే కలిగిన ప్రత్యక్షములో విషయమగుటచేత రూపత్వజాతియందు అతివ్యాప్తి గుణముఅగుట అను విశేష్యము రూపత్వమందు లేదు. రూపత్వము జాతిగుణము కాదుగాన అతి వ్యాప్తి వారించినది.

నేత్రేంద్రియము వల్ల కలిగిన ప్రత్యక్షములో విషయమై, నేత్రేంద్రియము కంటె యితరమైన ఇంద్రియమువల్ల కలిగిన ప్రత్యక్షములో విషయము కాకయు గుణమగుట రూపముయొక్క లక్షణమని నిష్కర్ష ఆ రూపము శుక్లత్వ, నీలత్వ, పీతత్వ, రక్తత్వ, హరితత్వ, కపిశత్వ, చిత్రత్వరూప ఏడురకములయిన విభాజక ధర్మములలో ఏదియో ఒక ధర్మముకలది.

పృథివియందు (భూమియందు) జలమందు తేజస్సునందు రూపముఉండును. పృథివియందు ఏడురకములయిన రూపములు ఉండును. జలమందు అభాస్వరమను తెలుపు రూపము, తేజస్సునందు భాస్వరమను తెలుపురూపము ఉండును. భాస్వరమనగా తనుప్రకాశించుచూ ఇతరమును ప్రకాశింపజేయుట అభాస్వరమనగా తను ప్రకాశించుచూ ఇతరముల ప్రకాశింపజేయక పోవుట అని అర్థము

మూ॥ రసనగ్రాహ్యో గుణోరసః । సచ మధురామ్ల లవణ, కటు, కషాయ, తిక్త భేదాత్షడ్విధః । పృథివీజల వృత్తి పృథివ్యాంషడ్విధః । జలేతుమధుర ఏవ.

రసనేంద్రియము వలన గలిగిన ప్రత్యక్షములో విషయమై గుణముగుట రసము యొక్క లక్షణము. రసనేంద్రియము వలన కలిగిన ప్రత్యక్షము ఏదియన ఇదితియ్యగా ఉన్నది, ఇదిపుల్లగా ఉన్నది, అను ప్రత్యక్షములు ఆప్రత్యక్షములలోతీపి పులుపు అను రసము విషయమై గుణముగూడా అయినదిగాన లక్ష్యమైన రసమందు లక్షణము సమన్వయమైనది

విశేష్యము మాత్రమే లక్షణముగా చెప్పిన రూపాదులయందు అతివ్యాప్తి. విశేషణమైన రసనేంద్రియమువలన కలిగిన ప్రత్యక్షములో విషయమగుట అని మాత్రమే చెప్పిన రసత్వ జాతిలోను అతివ్యాప్తి వచ్చునుగాన ఉభయము అవసరమైనవి ఆ రసము మధురత్వ, ఆమ్లత్వ, లవణత్వ, కటుత్వ, కషాయత్వ, తిక్తత్వరూపమైన ఆరువిభాజక ధర్మములలో యేదియో ఒక ధర్మముకలది

పృథివియందు జలమందు మాత్రమే రసముఉన్నది పృథివియందు ఆరువిధములయిన రసమున్నూ, జలమందు మధుర రసము మాత్రమే యున్నది

మూ॥ ఘ్రాణగ్రాహ్యోగుణోగంధః సద్వివిధః సురభిరసుర భిశ్చేతి పృథివీమాత్రవృత్తిః.

ఘ్రాణేంద్రియమువలనకలిగిన ప్రత్యక్షములో విషయమైగుణమగుట,గంధము యొక్క లక్షణము ఘ్రాణేంద్రియము వలన కలిగిన ప్రత్యక్ష మేదనగా ఇది మంచి గంధము ఇదిచెడు గంధము అను ప్రత్యక్షము. అందులో గంధము విషయ

ముగాన ప్రత్యక్ష విషయమై గంధము అయినందున లక్షణ సమన్వయమైనది. గంధత్వజాతి యందు అతివ్యాప్తి వారణ కొరకు విశేష్యము, ఇతరగుణములయందు అతివ్యాప్తి వారణకు విశేషణము ఆవశ్యకములు—ఆ గంధము సురభిత్వ అసురభిత్వ రూపమైన విభాజక ధర్మద్వయములో ఏదియో ఒక ధర్మముకలది, పృథివి (భూమి) యందు మాత్రమే యుండును.

మూ॥ త్వగింద్రియ మాత్ర గ్రాహ్యో గుణ
స్స్పర్శః సత్రివిధః శీతోష్ణానుష్ణా శీతభేదాత్
పృథివీజల తేజోవాయువృత్తిః। శీతంజలె।
ఉష్ణస్తేజసి. అనుష్ణాశీతః పృథివీవాయ్వోః.

త్వగింద్రియము వలన కలిగినప్రత్యక్షములో విషయమై గుణమగుట స్పర్శ యొక్క లక్షణము త్వగింద్రియమువలన కలిగిన ప్రత్యక్షము ఏదియన ఇది శీత స్పర్శ, ఇది ఉష్ణస్పర్శ అను ప్రత్యక్షము. ఆ ప్రత్యక్షములో శీతము ఉష్ణము అను స్పర్శలు విషయములుగాన ప్రత్యక్షములో విషయమగుటయు, గుణ మగుటయు స్పర్శయందు ఉన్నవిగాన లక్షణ సమన్వయము అయినది. విశేష్య మాత్రము లక్షణముగా చెప్పిన ఇతర గుణములయందు, విశేషణ మాత్రము లక్షణముగా చెప్పిన స్పర్శత్వ జాతి స్పర్శాభావముల యందు అతివ్యాప్తి వచ్చును. అందుకుగాను విశేషణ విశేష్యములయిన త్వగింద్రియము వలన కలిగిన ప్రత్యక్షములో విషయమగుచూ గుణ మగుట స్పర్శలక్షణమని చెప్పబడినది. ఆస్పర్శ శీతత్వ ఉష్ణత్వ అనుష్ణా శీతత్వ రూపములైన మూడు విభాజక ధర్మము లలో ఏదియో ఒక ధర్మముకలది

పృథివియందు జలమందు, తేజస్సు యందు గాలియందు యీ స్పర్శయుండును. శీతస్పర్శ జలమందు, ఉష్ణస్పర్శ తేజస్సు నందు అనుష్ణా శీతస్పర్శ భూమి యందు. వాయువు నందున యుండును.

మూ॥ ఏకత్వాది వ్యవహారహేతుఃసంఖ్యా ఏక
త్వాదిపరార్థ పర్యంతా. సర్వద్రవ్యవృత్తిః

ఏకత్వాది వ్యవహారమందున్న కార్యతచే నిరూపితమైన కారణతకు ఆశ్రయమగుట సంఖ్యకు లక్షణము ఏకత్వాదివ్యవహారమనగా ఇది ఒకటి ఇవి రెండు ఇవి మూడు అను వ్యవహారములు ఆ వ్యవహారములలో, వ్యవహారములో వ్యవహర్తవ్యము కారణము అను న్యాయముచే ఒకటి, రెండు, మూడు, అను సంఖ్యలకు కారణత్వము ఉండును. గాన అవ్యవహారమందలి కార్యతచే నిరూపితమైన కారణత కలిగియుండుట సంఖ్యయందు కలదుగాన లక్షణ సమన్వయము అయినది ఆ సంఖ్య ఒకటి మొదలు పరార్థము వరకు ఉండును దేనితరువాత ఇతర సంఖ్యలేదో అది పరార్థము అని చెప్పబడును. ఈ సంఖ్య తొమ్మిది ద్రవ్యముల యందు ఉండును.

మూ॥ మాన వ్యవహారాసాధారణ కారణం
పరిమాణం। చతుర్విధం అణు మహద్దీర్ఘ
హ్రస్వంచేతి । నవద్రవ్యవృత్తి

మానవ్యవహారమునకు అసాధారణ కారణము పరిమాణము మానవ్యవహారమనగా ఇది పొడుగు, ఇదిపొట్టి, ఇది చిన్నది, ఇది పెద్దది, అనువ్యవహారము. దీనికి అసాధారణ కారణము పరిమాణము. ప్రతి కార్యమునకు సాధారణ కారణము అసాధారణ కారణము ఉండును. కాలము, ఈశ్వరుడు, అదృష్టము సాధారణ కారణములు. ప్రత్యేకముగా

ఒక కార్యమునకు అనగా కలశము అను కార్యమునకు దండము అనునది అసాధారణ కారణము. కలశమును గురించి కాలము సాధారణ కారణమనగా కలశము కార్యము, ఈశ్వరుడు కారణము. కలశమందు కార్యతా ఈశ్వరుని యందు కారణతా, కలశమందు కార్యము గనుక కార్యత్వము ఉన్నది ఆధర్మావచ్ఛిన్నము కార్యత అగును ఆ కార్యత్వావచ్ఛిన్నమైన కార్యతచే నిరూపితమైన కారణత కాలమందు, ఈశ్వరునియందు గలదు. అదియే సాధారణ కారణత. అట్లులనే కలశమందు కలశత్వము గూడాగలదు. ఆకలశత్వము కార్యత్వము కంటె భిన్నమైన ధర్మము. కార్యత్వము కంటె అతిరిక్త ధర్మమైన యే కలశత్వము గలదో ఆ కలశత్వావచ్ఛిన్నమైన కార్యతచే నిరూపితకారణత కలిగి యుండుట అసాధారణ కారణత్వము ప్రస్తుతము మానవ్యవహార మందలి కార్యత్వము కంటె అతిరిక్తమైన యే మానవ్యవహారత్వము కలదో ఆమానవ్యవహారత్వావచ్ఛిన్నమైన కార్యతచే నిరూపితమైన కారణతకు ఆశ్రయమగుట పరిమాణము నందున్న అసాధారణ కారత్వము- మానవ్యవహారమందున్న కార్యత్వాతిరిక్త ధర్మావచ్ఛిన్నమైన కార్యత ఏదియన- మానవ్యవహారమందలి మానవ్యవహారత్వావచ్ఛిన్న కార్యత, మానవ్యవహార మందలి కార్యత్వా వచ్ఛిన్న కార్యతమాత్రము గాదు మానవ్యవహారత్వమే కార్యత్వాతిరిక్త ధర్మము తదవచ్ఛిన్న కార్యతానిరూపితమైన కారణత పరిమాణమునందు ఉన్నదిగాన లక్ష్యమైనపరిమాణమందులక్షణమైనమానవ్యవహారమందలి మానవ్యవహారత్వ రూప కార్యత్వాతిరిక్త ధర్మావచ్ఛిన్నమైన కార్యతచే నిరూపితమైన కారణతాశ్రయత్వము ఉండుటచేత లక్షణసమన్వయము అయినది ఈ పరిమాణము అణుత్వమహత్వ దీర్ఘత్వహ్రస్వత్వరూప విభాజకధర్మ చతుష్టయములో ఏదియోఒక ధర్మము కలది సర్వద్రవ్యములయందు ఉండును

మూ॥ పృథగ్వ్యవహారాసాధారణ కారణం పృథక్త్వం సర్వద్రవ్యవృత్తి.

పృథగ్వ్యవహారమందున్న కార్యత్వాతిరిక్త ధర్మావచ్ఛిన్నమైన కార్యతచే నిరూపితమైన కారణతాశ్రయమగుట పృథక్త్వమునకు లక్షణము. పృథగ్వ్యవహారమనగా ఇది దీనికంటె పృథక్ (వేరయినది) అను వ్యవహారము అవ్యవహారము ఆవ్యవహారమందున్న కార్యత్వాతిరిక్త ధర్మావచ్ఛిన్నమైన కార్యత ఏదియన పృథగ్వ్యవహారత్వా వచ్ఛిన్న కార్యతా, దానిచే నిరూపితమైన కారణత పృథక్త్వమందు ఉన్నదిగాన ఆకారణతాశ్రయమగుట పృథక్త్వ మందు ఉన్నదని లక్షణ సమన్వయము

ఈ పృథక్త్వము అన్ని ద్రవ్యముల యందు ఉండును

మూ॥ సంయుక్త వ్యవహార హేతుస్సంయోగః సర్వద్రవ్యవృత్తిః

సంయుక్తవ్యవహారమందున్న కార్యతచే నిరూపితమైన కారణతకు ఆశ్రయమగుట సంయోగమునకు లక్షణము సంయుక్త వ్యవహారమనగా ఇవి కలసినటువంటివి, అనగా సంయోగము కలవి అను వ్యవహారము. ఆవ్యవహారమందున్న కార్యతచే నిరూపితమైన కారణతకు

ఆశ్రయమగుట సంయోగమందు కలదు గాన లక్షణసమన్వయము అయినది. ఆ సంయోగము సర్వద్రవ్యముల యందు ఉండును

మూ॥ సంయోగనాశకో గుణోవిభాగః సర్వ ద్రవ్య వృత్తిః-

సంయోగము పోవుటకు కారణమైనది విభాగము. ఒక వస్తువు యందు మొదట క్రియకలుగును, ఆ క్రియవలన విభాగము కలుగును. ఆ విభాగమువలన పూర్వదేశముతో ఆవస్తువుకుఉన్న సంయోగము నశించును. తరువాత ఉత్తరదేశముతో సంయోగము తరువాత కలశము యొక్క ఉత్పత్తి కలుగును ఆక్రమములో విభాగము కలిగిన తరువాత సంయోగ నాశనమునకు (సంయోగధ్వంసకు)-కారణము విభాగము అగుచున్నది సంయోగధ్వంస అనగా సంయోగ ప్రతియోగిక ధ్వంస. సంయోగ ప్రతియోగిక ధ్వంసను పుట్టించునదై గుణమగుట విభాగమునకు లక్షణము. గుణమగుట అను విశేష్యములేనిచో, క్రియవలన విభాగము, విభాగము వలన సంయోగ నాశము కలుగును అని చెప్పియుండుటచేత సంయోగ నాశమునకు విభాగము కారణమైనట్లు క్రియగూడా పరంపరగా కారణమగుచున్నది గాన, క్రియయందు అతివ్యాప్తి. కేవలగుణమగుటయే లక్షణమని చెప్పిన ఇతర గుణముల యందు అతివ్యాప్తి వచ్చును. అందుచేత మొత్తము లక్షణముగా చెప్పబడినది విభాగము సర్వద్రవ్యముల యందు ఉండును

మూ॥ పరాపర వ్యవహారా సాధారణ కారణే పరాత్వాపరత్వే। తేద్వివిధేదిక్ కృతేకాల కృతేతితే। దూరస్థే దిక్కృతం పరత్వం। సమీపస్థేదిక్కృతమపర్వత్వం. జ్యేష్టే కాల కృతం పరత్వం, కనిష్టేకాలకృతమ పరత్వం.

పరత్వ అపరత్వములను కలపి లక్షణము చెప్పినారు. పరత్వమునకు పరవ్యవహార నిష్ఠకార్యతావతిరిక్తధర్మ వచ్చిన్న కార్యతా నిరూపిత కారణతకు ఆశ్రయమగుట లక్షణము పరవ్యవహారమనగా ఇతను ఇతనికంటె పరుడు, అనగా దూరమందు ఉన్నవాడు లేక పెద్దవాడు, అనువ్యవహారము. ఆ వ్యవహారమందున్న కార్వతచే నిరూపితకారణతకు ఆశ్రయమగుట పరత్వమందున్నందున పరత్వమందు సమన్వయమైనది

ఈటులనే అపరవ్యవహారమనగా ఇతనికంటె ఇతను అపరుడు. అనగా దగ్గిరగా ఉన్నవాడు. లేక చిన్నవాడు అని అర్థము ఆ వ్యవహారనిష్ఠకార్యతచే నిరూపితమైన కారణతకు ఆశ్రయమగుట అపరత్వమందున్నందున లక్షణసమన్వయము అయినది.

ఈపరత్వము, అపరత్వము-దిక్కృతమనియు కాలకృతమనియు రెండు రెండు విధములు. దిక్కృతపరత్వము దూరమందు ఉండుటచేవచ్చును దిక్కృత అపరత్వము సమీపమందు ఉండుటచే వచ్చును. అటులనే పెద్దవానియందు కాలకృతమైన పరత్వము, చిన్నవానియందు కాలకృతమైన అపరత్వము వచ్చును. సర్వ ద్రవ్యములయందు ఉండును.

మూ॥ అద్యపతనా సమవాయకారణంగురుత్వం పృధివీ జలతేజో వాయువృత్తి-

ప్రతి కార్యమునకు మూడుకారణములుండును. ఒకకుండ చేయవలయుననిన, కుమ్మరి, చక్రము, చక్రముత్రిప్పు

టకు కఱ్ఱ అవసరము. ఇవి నిమిత్తకారణములని పిలువబడును కపాలములు (కుండ పెంకులు) సమవాయి కారణములు. రెండు కపాలములు కలసినగాని ఘటము కాదుగాన ఆ కపాలసంయోగము అసమవాయకారణమని పిలువబడును. గురుత్వము ఆద్యపతనమునకు అసమవాయకారణము. అద్యపతనము అనగా చెట్టునుంచి క్రిందపడునప్పుడు మొదటి పతనము (పడుట) పతనము క్రియ శబ్దము, బుద్ధి, క్రియ, రెండుక్షణములు మాత్రమే ఉండును తరువాత యింకొక శబ్దము, బుద్ధి, క్రియ పుట్టుచుండును. అటులనే ఒకపండు చెట్టునుండి క్రిందకు జేరుటకు చాలా పతనములుండును అందులో మొదటి పతనమునకు అసమవాయకారణము గురుత్వము.

ఒక కార్యము కలుగుటకు, కారణమునకు కార్యమునకు ఒకచోట స్థితియుండవలయును దీనినే సామానాధికరణ్యమందురు. ప్రస్తుతము పతనమను కార్యమునకు గురుత్వమను కారణమునకు పండునందేస్థితి చూపబడును.

అనగా పతనమను కార్యము గురుత్వమను కారణము పండుయందు ఉండుట చేత, కార్యము ఏ సంబంధముచే పండుయందుఉన్నదో ఆ సంబంధావచ్ఛిన్నము కార్యత అగును పతనమను కార్యము పండునందు సమవాయ సంబంధముచే ఉండును గాన కార్యము సమవాయ సంబంధావచ్ఛిన్నము అటులనే కారణమైన గురుత్వముగూడ పండునందే సమవాయ సంబంధముచే ఉండును గాన కారణతగూడా సమవాయ సంబంధావచ్ఛిన్నము. కార్యతకు కారణతకు నిరూప్య నిరూపక భావముగాన సమవాయ సంబంధావచ్ఛిన్న ఆద్యపతనమందలి యే కార్యతగలదో ఆ కార్యతచే నిరూపితమైన సమవాయ సంబంధావచ్ఛిన్న కారణత గురుత్వమందు గలదు ఆకారణత కలిగియుండుటయే, అనగా సమవాయ సంబంధావచ్ఛిన్నమైన ఆద్యపతన మందలి కార్యతచే నిరూపితమైన సమవాయ సంబంధావచ్ఛిన్నమైన యేకారణత గలదో ఆకారణత కలిగియుండుట, గురుత్వమునకు లక్షణము ఇచ్చట ఆద్యపదము లేనిచో ద్వితీయాది పతనముల గురించి, వేగము అసమవాయ కారణముగాన వేగమందు అతివ్యాప్తి వచ్చును అందుకొరకు ఆద్యపదము అవసరము ఆద్యపతనములో గురుత్వమే అసమవాయ కారణము గాన గురుత్వమందు లక్షణ సమన్వయము అయినది అతి వ్యాప్తివారించినది.

పృథివీ జలతేజోవాయువు లందు ఉండును

మూ॥ ఆద్యస్యందనా సమవాయి కారణం ద్రవత్వం తద్ద్వివిధం సాంసిద్ధికం నైమిదికం చేతిపృథివీజల తేజోఽవృత్తి తత్రసాంసిద్ధికం జలె నైమిత్తికం పృథివీ తేజసోః। తత్ర పృథివ్యాంఘృతా దావాగ్ని సంయోగజం ద్రవత్వం। తేజసి సువర్ణాదౌ.

స్యందనము అనగా ప్రవహించుట, మొదటప్రవహించుటకు అసమవాయ కారణము ద్రవత్వము మొదట ప్రవహించుట యందలి సమవాయసంబంధావచ్ఛిన్నమైన యేకార్యతగలదో ఆకార్యతచే నిరూపితమైన సమవాయసంబంధావచ్ఛిన్నమైన యేకారణతగలదో ఆకారణత కలిగియుండుట ద్రవత్వమునకు లక్షణము. జలమందు కార్యమైన ప్రవ

హించుట, కారణమైన ద్రవత్వము సమవాయసంబంధము చేతనేఉన్నందున సమవాయసంబంధా వచ్ఛిన్నమైన మొదట ప్రవహించుట యందలి కార్యతచేనిరూపితమైన సమవాయసంబంధా వచ్ఛిన్నతయే కార్యతకలదో ఆ కార్యతకు ఆశ్రయమగుట ద్రవత్వమందు గలదు గనుక లక్షణ సమన్వయము అయినది

ఆ ద్రవత్వము సాంసిద్ధికమని నైమిత్తికమని రెండువిధములు, పృథివీ, జల, తెజస్సులందుండును. జలమందు సాంసిద్ధిక ద్రవత్వము, పృథివి యయిన ఘృతమందు నిప్పు సంయోగమువలన గలిగిన నైమిత్తిక ద్రవత్వము, తేజస్సు అయిన బంగారమందుగూడా నిప్పు సంయోగమువలన గలిగిననైమిత్తికద్రవత్యముఉన్నది.

మూ॥ చూర్ణాది పిండీభావ హేతుర్గుణస్స్నేహః, జలమాత్ర వృత్తి.

పిండీభావమనగా ముద్ద కట్టుటకు హేతువయిన విలక్షణ సంయోగము. చూర్ణాదుల పిండీభావ నిష్ఠ కార్యతా నిరూపిత కారణత కలిగియుండుట స్నేహము నకు లక్షణము యీ స్నేహము జలమందు మాత్రమే ఉండును.

మూ॥ శ్రోత్రగ్రాహ్యో గుణశ్శబ్దః। సద్వివిధః ధ్వన్యాత్మకో వర్ణాత్మకశ్చేతి, వర్ణాత్మకస్సంస్కృతభాషాదిరూపః, ధ్వన్యాత్మకో భేరీమృదంగాదిశబ్దః,

శ్రోత్రేణగ్రాహ్యః శ్రోత్రగ్రాహ్యః, అని సంస్కృతములో సమాసము చెప్పవలయును. ఆ వ్యస్తపదముల యొక్క అర్థము ఏమిటన శ్రోత్రేణ అనుచోట శ్రోత్రశబ్దమునకు శ్రోత్రేంద్రియము అర్థము.తృతీయావిభక్తి ప్రత్యయమునకు పుట్టుట అని అర్థము గ్రాహ్యః అను చోట గ్రహధాతువుకు ప్రత్యక్షము. ధాతువు తరువాత ఉన్న ప్రత్యయము నకు విషయత్వము అర్థము. అందుచేత శ్రోత్రేంద్రియము వలన పుట్టిన ప్రత్యక్షములోవిషయమైనది శబ్దము అను అర్థము వచ్చును. శ్రోత్రేంద్రియమువలన గలిగిన ప్రత్యక్షములో విషయమగుట శబ్దమునకు లక్షణము, శ్రోత్రేంద్రియమువలన గలిగిన ప్రత్యక్షమేది యనగా ఇది భేరీశబ్దము, ఇది సంస్కృత శబ్దము అను ప్రత్యక్షము. ఆ ప్రత్యక్షములో విషయము శబ్దముగాన సమన్వయమైనది, ఆ శబ్దము ధ్వనిరూపమని, వర్ణరూపమని రెండువిధములు సంస్కృతభాషా రూపమైనది వర్ణాత్మక శబ్దము. భేరీమృదంగాది శబ్దము ధ్వన్యాత్మకమైనది- ఆకాశమందు మాత్రమే యుండును.

చందాదారులకు వినతి

"నవభారతి" ప్రారంభించబడి అర్ధ సంవత్సరము పూర్తి అయినది ఇంతవరకు మాకు అన్నివిధాలా సహాయ, సహకారాలు ఇస్తూవస్తున్న పాఠకులకు, అభిమానులకు కృతజ్ఞతను తెలియ జేస్తున్నాము.

ఇంతవరకూ తమ చందాలను పంపటం పడనివారు, వెంటనే తమ చందాసొమ్మును పంపి, యధాతధంగా తమ సహాయ, సహకారము లిచ్చి, అన్ని విధాలా తోడ్పడ వలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

మేనేజరు, నవభారతి

నిజమైన చదువు

శ్రీ మధునాపంతుల వేంకట పరమయ్య

వేదశాస్త్రముల్ చదివి గంభీర ఫణితి భాగవత పుణ్యగాథ లుపన్యసించు
ధారుణీ సుపర్వుండొక ధారుణీశుఁ జేరనేగి యిట్లనియె నాశీర్వదించి.

భూవర! మానవత్వమును బొందుట దుర్లభ, మట్టిదబ్బుటన్
భావనభక్తి సంపద నపాయతఁగాంచి పునర్భవైక బా
ధా వికృతుల్ తొలంచుకొని ధన్యుఁడు గావలె మానవుండు, లే
దా వృథకాదె వాని బ్రతుకంతయు? జంతువుతో సమానమై!

భాగవతమును వినక సద్భక్తిరాదు, భక్తిలేకున్న మానవత్వమ్ము లేదు
మానవతలేక ముక్తిసంప్రాప్తిలేదు, కాన భాగవతము ముక్తికారణమ్ము.

గురువుల పాదపద్మములకున్ బరిచర్యలు సేసి పెక్కు వ
త్సరములు దీక్షతోఁ జదివి చక్కఁగ. భాగవత ప్రబంధ బం
ధురతర సత్కథా కథన ధోరణి సర్వము నాకళించితిన్
నరవర! వ్యాఖ్యసేయుదు వినన్ దలపోయుదువేని నావుడున్.

పరమవివేకవంతుఁడును బ్రాభవవంతుఁడు, పుణ్యవంతుఁడా
ధరణిధవుండు భూసురుఁడు తద్దయుఁ బెద్ద యుపన్యసించు తీ
రరసి యితండు భాగవతమందలి పైపయి యందచందముల్
నెఱిగ్రహియించెఁగాని గమనింపడు తద్గతగూఢ భావముల్.

భాగవతంబునందుఁ బ్రతిపాదితమైన యఖండభక్తియున్
యోగము నెట్టివో యెఱిఁగియుండిన రాజుల నాశ్రయింపఁగా
నీగతిరాఁదలంచునె మహీసురవర్యుఁడు కృష్ణభావనా
సాగర వీచికావిహృతి సౌఖ్యవశుండయి తేలియాడఁడే!

శ్రీకృష్ణపదార్చన సుశ్లోకత గనినట్టి మనసు లోకవ్యవహా
రాకృష్టమగునె? యమృతము చేకుర నెవఁడైన విషము చేకొనునొక్కో!

అని యెడఁదం దలంచి వసుధామరుఁ గన్గొని యో మహాత్మ! నిన్
గనుటఁ గృతార్థమయ్యె జననమ్ము మదీయము, త్వన్ముఖమ్మునన్
వినుటయు భాగ్యరేఖ యనిపించును వేదచతుష్టయోక్త పా
వనతర ధర్మసంభరిత భాగవతోజ్జ్వల పుణ్యగాథలన్

కాని మఱియొకమాఱు భాగవతకృతిని శ్రద్ధమైఁ బరిశీలించి రాఁగదయ్య
యాలకించి కృతార్థుఁడనగుదు ననుచు వినయమున దోయిలించి భూవిభుఁడువలుక
చేయునదిలేక సెలవు తీసికొని యేగి భూపతి రసజ్ఞుఁడని మోసపోయినాఁడ,
సరసతాశూన్యుఁడేను గ్రమ్మఱఁ బఠింప వలయునట భాగవతము రావలయునంట!

అని మనసులోనె దిగ్భ్రమింగుకొనుచుఁ గినుక తనకు జనపతికిని నడచినది యెల్ల
వినిచె బ్రాహ్మణుఁ డిల్లాలి,కనుపమాన వినయసౌశీల్యవతి యామెయునియె నిటులు.

'క్రమ్మఱ లెస్సగాఁ జదివిర' మ్మని మిమ్మనఁ బాడిగాదు, భా
వమ్మున నేమియెంచి నరపాలుఁడిటుల్ వచియించినాఁడొ, గ
ర్వమ్మున నిట్లుచేసె ననరా దెటులేయది యైన కా
ర్యమ్ము మఱొక్క మాఱరసి యప్పుడె యేగుఁడు నష్టమున్నదే!

అని యయ్యంగన పల్కు వాక్యముల యాథార్థ్యమ్ము చింతించి, తా
ననుమోదించి, పఠించి భాగవత మాద్యంతంబు భూదేవుఁడ
జ్జన నాథుం గన నేగి 'చెప్పుదునె రాజా!' యన్న వేఱొక్క మా
ఱనఘా! రమ్ము పఠించి విందును, మహీయః ప్రీతి మిన్నంటుదున్.

అని పేడనిచిన విప్రుఁడు చని, భార్యకు జరిగినట్టి సంగతి వివరిం
చిన నామె 'మరలఁ జదువుం' డని యుత్సాహంబు గొలిపె, నాతం డంతన్.

తనకనుకూలమైన యొకతావుగనుంగొని, యొంటిపాటునన్
బనిగొని దీక్షతోఁ జదివె భాగవతంబును, శ్రద్ధమైఁబఠిం
చిన విషయంబు లన్నియును జిత్తము హత్తఁగ నెన్నిమాఱులో
మననముచేసె, పీడకణుమాత్రము తద్విధమైన ధారణన్

తలఁపు చలింపనీక మహితమ్మగు దీక్షనిటుల్ పఠించు న
య్యలఘు నెడంద డక్కగొనె నద్భుతరీతిగఁ గృష్ణలీల, లు
జ్జ్వలమయి గాఢమైన దృఢభక్తిజనించెను దైలధారగాఁ
దొలియొనరించు పున్నెముల తోరపుఁబంట యనంగనయ్యెడన్.

హృదయముపొంగ,గళముగద్గదికదాల్ప, గన్నుదోయినానందాశ్రుకణములురల
భావనముసేయు శ్రీకృష్ణదేవమూర్తి నగ్గలంబగు భక్తితో నవనిసురుఁడు

నల్లనిరూపుదాల్చి చిఱునవ్వులఁ జిందుచుఁ గృష్ణమూర్తి, ఘల్
ఘల్లున మ్రోయునందియలు గజ్జెలు పాదములందు నొప్పఁగా
నల్లనవచ్చి ముందునిలుగాఁ గనినట్టులుగాఁగ, నాతఁడు
త్ఫుల్లహృదబ్జుఁడై మఱచిపోవును దన్మయతన్ సమస్తమున్.

మురళీధరఁడు తన్నుమురిపించి పరువెత్తి నటులొక్కమాఱు ప్రహర్షమందు
వసుదేవ తనయుఁ డింపెసలారఁ దనతోడఁ బలికి నట్లొకమాఱు పలుకుచుండు

గిరిధారి తనకు సంగీతమ్ము వినిపించి నటులొక్కమాఱెదో యాలకించు
నందాత్మజుఁడు దర్శనంబిచ్చి, తనుమెచ్చి పిలిచినట్లొక్కమా ఱులికిలేచు

పవలురేయియు నెఱుఁగక పరమభక్తి మధు రసాస్వాద సంప్రాప్త మహిత పార
వశ్య విస్మృతబాహ్య సర్వప్రపంచ విషయలాలసుఁడయిన పృథ్వీసురుండు.

నిదురలోనున్న, మేల్కొన్న, నిలిచియున్న, గూర్చున్న నేపనిచేసికొనుచునున్న వదలఁడాతఁడు శ్రీకృష్ణపాదపద్మ చింతనాసక్తి క్షణమైనఁ జిత్తమందు.

మగని ప్రవర్తనమ్మిటులు మాఱఁగ బ్రాహ్మణి నెమ్మనంబునన్
దిగులువహించి యయ్యది మతిభ్రమ కాదు గదా యటంచుఁ జా
లఁగ భయమందెఁ మిమ్ముల నిలాపతి క్రమ్మఱ రమ్మనెన్ గదా
యొగినటకేగరొక్కొ? యిటులుండిన కారణమేమి తెల్పరే!

వెనుకటి విధాన నోరారఁ బ్రియముమీఱ మంచిచెడ్డలు మాటాడ మానినారు, మాఱినారు, సంసారము మఱచినారొ, యనుచు దుఃఖింప నామె కిట్లనియె నతఁడు.

ధనమును ధాన్యమున్ బహువిధమ్ముల భోగము లింపుగావు నా,
కనుపమ వాక్చమత్కృతి వెలార్చి యఖండయశంబు గాంచఁగా
మనసున లేదు కోర్కె, యిఁక క్ష్మాపతితోఁ బనియేమి? యైహిక
మ్మునె కడునమ్మి యెట్లు పరమున్ విడనాడుకొనంగఁ జాలుదున్!

అమలిన భక్తిఁ దన్ను హృదయమ్మున నిల్పి భజించువారి భా
రమును వహించువాఁ డిహపరమ్ములు రెండు నొసంగువాఁడు, దు
ర్గమ బహులోర్మిఘోర భవవారిధి కవ్వలియొడ్డు చేర్చు వాఁ
డమృతరస స్వరూపుఁడగు నచ్యుతు పాదము లాశ్రయించెదన్.

తనపయి నిండుభక్తి యెడఁదన్ నెలకొల్పి దరిద్ర తా భరా
వనత శరీరుఁడై దిగులుపాటున వచ్చిన యా కుచేలుఁ డి
మ్మనకయె లో దలంపెఱిఁగి యచ్యుతుఁ డాతని కింద్రసంపదల్
ఘనముగ నీయఁడే? యటులు కావక పోవునె నన్ను సత్కృపన్!

'ఎల్లధర్మంబులను ద్యజియించివైచి, భారమంతయు నాపయి వదలివైచి, శరణు పొందుము, నీపాప సంచయంబు నణఁచి ముక్తియిచ్చెద'నని యనఁడె శౌరి!

హరిని భజించుచున్న సమయమ్మున లౌకికగాథ లన్నియున్
దెరమఱుఁగై యఖండమగు తృప్తియు దీప్తియుఁగల్గు, దివ్యసా
గరమున గాంగనిర్ఝరము కైవడి భక్తిలయించిపోదుఁ, ద
త్పరమ సుఖానుభూతి విడువన్ మనసొప్పదు నాకొకప్పుడున్.

అనుచువచియించు నతనివాక్యముల లోని యున్నతినెఱుంగలేని యయ్యువిద మిగులఁగళవళంపడి ఱేని చెంగటికినేగి మగనివర్తనమెల్లఁ దెల్పఁగనతండు.

'వెఱవకుమమ్మ! నీమగఁడు వీఱిడిగాఁడు, మహానుభావుఁడె
వ్వారికిని బొందరాని భగవంతుని ప్రేమకుఁ బాత్రుఁడయ్యె, వం
దుర'కని ధైర్యమున్ గఱపి తోడనె మంత్రిపురోహితాళితో
నరిగె మహీసుపర్వుని గృహంబున కంచితభక్తి సంపదన్.

అటుచని భూసురోత్తముని యంఘ్రులు మౌళికిరీటరత్న వి
స్ఫుటరమణీయకాంతి పరిశోభితముల్ పొనరించి మ్రొక్కి మ
త్పటుతర పూర్వపుణ్య పరిపాకవశంబున మీదుదర్శనం
బిటులు ఘటిల్లె, భాగవత మిప్పుడు చెప్పుదురా పురాణమున్.

వినితరించెద' మంచును విన్నవించి వినుతవినయంబు మూర్తీభవించి నటులు నృపతిమణి దోయిలింగట్టి నిలిచెఁజెంత, భక్తమణి యుదాసీనుఁడై పలికెనంత 'భాగవత గాథలను జెప్ప పనికిఁబూని కాలమును వ్యర్థమొనరింపఁగాదు నాకు నమలిన మ్మద్వితీయ మ్మనంతమైన ధ్యాననిష్ఠా సుఖంబెట్లు మానుకొందు. కేవలము పొట్టకూటికిఁ ద్రోవచూపు నట్టిదావిద్య? కాదిందు నందుఁగూడ హాయి గాంచుట కుపయుక్తమైన దేవొ యరయఁగా నట్టిదే 'నిజమైన చదువు'.

"ఉత్తరే రామచరితే భవభూతిర్విశిష్యతే"

శ్రీ వెల్దండ ప్రభాకరరావు

౨

భవభూతి ప్రతిభా వ్యుత్పన్నత

భవభూతి ప్రతిభావ్యుత్పన్నతపై ప్రశంసా లేశము-భవభూతి యుద్ధతుడు! 'ప్రౌఢత్వం ఉదారతాచవచసాం' యాతని నాటక మందభివ్యక్తమగుచున్నది. భవభూతి పాండిత్యప్రకర్ష కల్గియున్నను తగు రాజసభాగౌరవము కలుగమి యాతని రచనలో కన్పట్టును.

సర్వథావ్యవహర్తవ్యంకుతో హ్యావచనీయతా?
యథాస్త్రీణాం తథావాచాం సాధుత్వేదుర్జనోజనః

వాచాంసాధుత్వే దుర్జనోజనః యను వాక్యార్థమువల్ల భవభూతి ప్రజాదరము పొందజాలకుండెనని ధ్వనించుచున్నది. అంతేగాక మఱొక్క చోట 'తదలంస్మృత్వాదహాతియద పస్కందహ్యాదయమ్' యనివ్రాసెను. తనకింతపాండిత్యముండియునిష్ప్రయోజనమయ్యెనని మళ్లీవాటిని జ్ఞప్తికి తెచ్చుకొనుట సమంజసమని పరితపించినాడు,

భవభూతి కాళిదాసు సమకాలికుడా యను విషయము వివాదాస్పదమైనను నొక్కవిషయము చెప్పక తప్పదు. భవభూతి తన నాటకమును రచించి తన శిష్యులకిచ్చి కాళిదాస మహాకవికి విన్పించి యతని యభిప్రాయము గొనిరండిని యాదేశించెను భోగలాలసుడైన కాళిదాసుకవివరుడు వేశ్యాగృహమందుండ వారచ్చటనే నుత్తర రామచరిత్రమును విన్పించిరి. అందులకాతడు "కిమపికిమపి"శ్లోకముం జదువునపుడు తాంబూలచర్వణము చేయుచు భోగకాంతతో నున్న మెక్కువయ్యెననిమాత్రమనెను. దానిని శిష్యులు భవభూతి కెఱింగించిరి భవభూతి మొదట "రాత్త్రిరేవం వ్యరంసీత్" యని వ్రాసియుండెననియు, కాళిదాసు సూచన ప్రకారము "రాత్రిరేవవ్యరం సీత్" యని మార్పుచేసెననియు ప్రతీతికలదు.

అంతేగాక భోజప్రబంధములో భవభూతి కవిత్వమునకు నిరుందేవి తనచెవి యందు విలాసముగ ధరించిన యెఱ్ఱగలువ యందలి మకరందమును రసపరిపూర్తికై చిలుకుచున్నదని కలదు

"నిరాందేవి సద్యః శ్రుతికలిత కహ్లార
మాలికా
మధూళీమాధుర్యం క్షిపతి వరిపూర్త్యైభగ
వతీ."

అందుకే భవభూతి వశ్యవాక్కని ప్రసిద్ధి జెందినాడు భవభూతిమొదటిపేరుశ్రీకంఠుడు. ఇతని బిరుదుభవభూతి, ఈతడుతాను పదవాక్య ప్రమాణజ్ఞుడనని కూడ చెప్పుకొనినాడు, చాందాకు దక్షిణముగా గోదావరికి దగ్గఱగా నితని జన్మస్థానము. భవభూతి కుమారిల భట్టు శిష్యుడు. భవభూతి యుత్తరరామ చరిత్రమున.

"యంబ్రాహ్మణ మియందేవీ వాగ్వశ్యైవాన్వవర్తత" యని తన వశ్యవాక్త్వమును వెల్లడించినాడు. అతడు వశ్యవాక్కయిన విధమును తాను ప్రతినిత్యము పారాయణముచేసినా వాల్మీకి రామాయణము నిట్లు వర్ణించి వాల్మీకికి తన పరోక్ష శిష్యత్వము నీగతి ప్రకటించుకొనెను.

"చిత్రమామ్నాయా దన్యత్రనూతన శ్ఛన్దసామవతారః"
అధభగవాన్ ప్రాచేతసః ప్రధమంమనుషేషశబ్ద
బ్రహ్మణ స్తాదృశం వివర్త మితిహాసం
రామాయణమృషిః ప్రణినాయ".

అందులకే రామాయావతరణ గాధ నుత్తర రామచరిత్రలో పొందుపరచి లవకుశుల విద్యాభ్యాసమునకు పుత్రవాయ మేర్పడెనని తెలిపియున్నాడు.

పదవాక్య ప్రమాణజ్ఞుడనిన వ్యాకరణ న్యాయ మీమాంసా శాస్త్రములందు యందె వేసిన హస్తము. భవభూతి పాత్రపోషణ

యందును ప్రకృతి వర్ణనయందును. కథాకథన మందును తన చతురత వ్యక్తీకరించినాడు. రాముని పాత్రను యేకపత్నీవ్రతునిగా పోషించినాడు అష్టావక్రుడు వసిష్ఠాశ్రమము నుండి వచ్చి ప్రజాపాలనమే రాజధర్మమనియు నందును నిక్ష్వాకులకు తనువుకన్న యశమే పరమధనమనియు చెప్పగానే శ్రీరాము డిట్లు ప్రత్యుత్తరమిచ్చెను.

స్నేహం దయాంచ సౌఖ్యంచయదివా
జానకీమపి
ఆరాధనాయ లోకస్యముంచతో నాస్తి
మేవ్యథా.

స్నేహమునుగాని. దయనుగాని. సౌఖ్యమునుగాని. తుదకు జానకినిగూడ ప్రజాపాలన మందు విడువవలసివచ్చినను తనకు వ్యథ లేదని చెప్పినాడు. ఈ శ్లోకమునుండియే మరల జానకీవియోగము ధ్వనించుచున్నది. అంతేగాక సత్పురుషులకు యేవిధముగనైనను లోకారాధనమే వారి పరమధర్మము. దానికై దశరథుడు రాముని నడవికి పంపివేసెను. చివరకు తన జీవితమునుగూడ నర్పించెను. అందులకే నిక్ష్వాకు లాడి తప్పరను నానుడి వచ్చినది. ఈ మాటకై వేచియున్న యష్టావక్రుడు శ్రీరాముని నాశీర్వదించి యథేచ్ఛం జనియెను. చిత్రపట సందర్శనముకూడ శ్రీరాముని హృదయమును పరీక్షించుటకై ప్రవేశ పెట్టబడినది. అవతారపురుషుడగు శ్రీరామచంద్రుడు కూడ సామాన్య ప్రాకృతమానవునివలె సుఖదుఃఖముల కతీతుడుగాడని భవభూతి నిరూపించినాడు. జనకుడు బ్రహ్మవిద్యా సంపన్నుడు. శుకయోగీంద్రునకు బ్రహ్మవిద్య నుపదేశించిన ఘనుడు. అట్టి వజ్రహృదయుని కూడ భవభూతి పరీక్షించి తుదకాతనిని తన యకై విలపింపజేసినాడు. చిత్రపట సందర్శనమున నాయాఘట్టములను పరిశీలించు చున్నప్పుడు శ్రీరాముని విచిత్రానుభూతుల నవగతము చేయవలయునని భవభూతియూహ. ఈ సందర్భమందే భవభూతి నత్యుత్తమ భావ ప్రపూరితములగు శ్లోకములు రచించినాడు. "జీవత్సుతాత పాదేషు" "అలసలలిత" "ఏతానిగిరి నిర్ఝరిణీతటేషు" మొదలగునవి జాలువారినవి.

కిమపి కిమపి మంద మందమాసక్తి యోగా
దవిరళితం కపోలం జల్పతోరక్రమేణ
అశిథిల పరిరంభవ్యాపృతైకైక దోష్ణో
రవిదితగతయామా రాత్రి రేవవ్యరంసీత్.

భవభూతి ప్రతిభావ్యుత్పన్నతను వ్యక్తీకరించుటకీ శ్లోక మొక్కటేచాలు. జనస్థానమందు ప్రస్రవణగిరి చెంతగడిపిన యొకానొక రాత్రిని రాముడు సీతకు జ్ఞాపకము చేయుచున్నాడు. చీకుచింతలేకుండ రామానుజుడు కోదండపాణియై సీతారాములను రక్షించుచుండ వారు పొందిన యనుభూతి, యానంద మౌచిత్య భంగముగాకుండ వర్ణింపబడినది. దీనితర్వాత నేలక్ష్మణస్వామి "ఏషపంచవట్యాం శూర్పణఖాసంవాదః" యని వేతొకచిత్రమును చూపించును. చిత్రదర్శన మాత్రముననే సీత భయవిహ్వలయగును. ఇది ప్రకృతి సిద్ధము గదా. దుర్జనులెల్లప్పుడు నాపదలనే కల్గింతురు. దానికిశ్రీరాముడు సీతనుద్దేశించి "అయి విప్రయోగత్రస్తే చిత్రమేతత్"- విప్రయోగమునకు భయపడినదానా!యిది చిత్తరువని మరువవద్దని హెచ్చరించెను. సీత నోదార్చిన శ్రీరాముడు "హంతవర్తమాన ఇవమే జనస్థాన వృత్తాంతః" యని చకితుడైనాడు. అందుకు సీత ముద్దుల మఱది లక్ష్మణస్వామి.

అథేదం రక్షోభిః కనకహరిణచ్ఛద్మ విధినా
తథావృత్తం పాపైర్వ్యథయతి యథాక్షిళిత
మపి
జనస్థానే వికలకరణైరార్య చరితై
రపిగ్రావారోదిత్యపి దళతివజ్రస్య
హృదయం.

యని సమర్థించినాడు. జనస్థానంబున మాయలేడి నెపమున రాక్షసులు సీతనపహరించినప్పుడు శ్రీరాముడు పొందిన వ్యథ దుర్భరమైనది. దానికి రాళ్ళుకూడ విలపించినవి. వజ్రహృదయము కూడ ద్రవ్యమైనది. ఆ విషయము మాసిపోయినను యిప్పుడు మరల వ్యధను కల్గించుచున్నది.

భవభూతి మహావీరచరిత్రమున జనస్థాన వృత్తాంతమును సీత బంగారు లేడికై ముచ్చట పడుట యిత్యాది విషయములను వర్ణించి తనివితీఱక మఱలదానినే నుత్తరరామచరిత్రమున చిత్రపట దర్శన వ్యాజమున పునశ్చరణ మొనర్చినాడు. ఆదర్శదాంపత్యము భవభూతి చక్కగా నిర్వచించినాడు.

అద్వైతం సుఖదుఃఖయో రనుగతం
సర్వాస్వవస్థాసుయ
ద్విశ్రామోహృదయస్య యత్ర రజసా
యస్మిన్నహార్యోరసః
కాలేనా వరణాత్యయా పరిణతే యత్స్నేహ
సారేస్థితం
భద్రం తస్యసుమానుషస్య కథ మప్యేకం
హితత్ప్రార్థ్యతే.

ఏది సర్వకాల సర్వావస్థలయందేకమై సుఖదుఃఖములను సహించునో, వికలమైన మనస్సునకు వికాసమునొందుట కుపకరించునో, వార్ధక్యమందు గూడ కోరిక కల్గించునో జననము మొదలు మరణాంతము వరకు ప్రేమను సార్థకము చేయునో యదియే యాదర్శ దాంపత్యము ఇట్టియాదర్శదాంపత్యము సీతారాముల యందు భవభూతికి గోచరించినది అంతేగాక యిది స్వానుభవమై యుండనోపు భవభూతి సన్యసించిన పిదప మండన మిశ్రుడయ్యెను శ్రీమచ్ఛంకర భగవత్పాదులు మండన మిశ్రుని యోడించినపుడు యాతని సహధర్మచారిణి 'కలాభారతి' యాతని నోడించి తనభర్త గౌరవమును కాపాడెను, అట్టి యాదర్శదాంపత్యము నిత్య కల్యాణము పచ్చతోరణముగా వెల్గొందినది ఇందు సుమానుషమను శబ్దము సౌజన్యభావమును స్ఫురింపజేయుచున్నది దుర్ముఖుడు వచ్చి చిత్రపట సందర్శనమందు నిమగ్నుడైన శ్రీరామునకు వాగ్వజ్రమువంటి దుర్వార్తవినిపించగానే యంతకుపూర్వమే నిద్రించిన జానకితోసహా శ్రీరాముడు మూర్ఛిల్లెను. ఈ సందర్భమున శ్రీరాముని వాక్కున వెలువడవలసిన ప్రమాణమున పదమూడు శ్లోకములు భవభూతిలేఖిని నుండి వెలువడినవి ఇవన్నియు కరుణరసోత్కర్షకే యని యతని తలంపు.

అపూర్వకర్మ చండాలము యి ముగ్ధేవి
ముంచమాం
శ్రితాసిచందన భ్రాంత్యాదుర్విపాకం విష
ద్రుమమ్
శైశవాత్ప్రభృతి పోషితాంప్రియాం
సౌహదాద పృథగాశ్రయామిమాం
ఛద్మనాపరి దదామి మృత్యవే
సౌనికేగృహం శకుంతికామివ

ఓ యమాయకురాలా! అపూర్వ కర్మ చండాలుడయిన నన్ను వదిలిపెట్టుము చందన వృక్షమను భ్రాంతిచే దుర్విపాకమైన విష వృక్షము నాశ్రయించినావు.

చిన్నప్పటినుండి మఱి వేరాశ్రయములేని ప్రియురాలిని యిప్పుడొక లోకాపవాదమిషతో మృత్యువున కర్పించుచున్నాను ఇట్లు మృత్యువున కర్పించుట తన పెంపుడు చిలుకను బోయవాని కర్పించినట్లున్నది

సీతా పరిత్యాగము చేయవలసి వచ్చినపుడు మరల వసిష్ఠుని సందేశము జ్ఞప్తికి తెచ్చుకొనియెను ధర్మము తప్పక ప్రజాపాలనమొనర్చు నృపాలురకు యెవ్విధముగనైను లోకారాధనమే పరమధర్మము ఇతఃపూర్వమే రాముడవసరమైనప్పుడు జానకినికూడ వదలిపెట్టుటలో వ్యథలేదని చెప్పినాడు అందువలనను ప్రజాపవాదమువలన జానకిని వదలవలసి వచ్చినది. ఈ విషయము రాముని హృదయములో సంక్షిప్తముగా నుండెను దానిని భవభూతి బహిర్గతముచేసి పాఠకులకు తెలియపరచినాడు భవభూతి మనస్తత్త్వ పరిశీలనలోదిట్ట అందులకే యింత సూక్ష్మముగా నొక్కొక్కరి హృదయగభీరతలను కూలంకషముగా పరిశీలించి వడపోతగావించ గలుగుచున్నాడు. భవభూతి మతమున యీ సీతా వివాసనముకూడ పదునాలుగు సంవత్సరములే భవభూతి పాండిత్యప్రకర్ష, శబ్దాడంబర, దీర్ఘ సమాసపద భూయిష్ఠమై యలరారుచున్నది ఇతనికి గోదావరి నదిపై మక్కువమెక్కువ, అందులకే తనమూడు నాటకములలో ముప్పది

యాఖుమాల్లు గోదావరీనదిని ప్రస్తావించినాడు. అతడు తెలుగువాడను వాదమునకిది దోహద మగుచున్నది కాళిదాసు నాటకములలో నార్యా వృత్త మెక్కువగా నుపయోగింపబడినది ఇతని నాటకములో శిఖరిణి, వసంతతిలకా వృత్తము, శార్దూలవిక్రీడితము లెక్కువగా నున్నవి.

కండూల ద్విపగండ పిండకషణా కంపేన
సంపాతిభిః
ఘర్మస్రంసిత బంధనైః స్వకుసుమై
రర్చంతి గోదాఃరీం
ఛాయాపస్కిరమాణ ముఖవ్యాకృష్ట
కీటత్వచః
కూజత్క్లాంత కపోతకుక్కుటకులాః కూలే
కులాయద్రుమాః

ఇదియపరాహ్ణమును వర్ణించు శ్లోకము ఇందు కుసుమ పతనము తెలుపుటచే గోదావరీ నది పూజ జరిగిన ట్లుత్ప్రేక్షింప బడినది దీనినివాచ్యముగా భఃభూతి వచించి నాడు. దండకారణ్యమందు శంబూకుని చంప బోయిన శ్రీరాముని గత స్మృతులొక్కుమ్మడి నుక్కిరి బిక్కిరి చేసినవి ఆ యావేదనను కొన్ని శ్లోకములలో బహిర్గతముగావించినాడు అయితే యివిశంబూకుని ముఖమున వెలు వడినవి.

నిష్కూజ స్తిమితుఃక్వచిత్క్వ చిదపి
ప్రోచ్చండస త్త్వస్వనా
స్స్వేచ్ఛాసు ప్త గభీరభోగ భుజగశ్వాస ప్రదీ
ప్తాగ్నయః
సీమానఃప్రదరోదరేషు విరళస్వచ్ఛాంభ
సోయాస్వయం
తృష్యద్భిః ప్రతిసూర్యకై రజగరస్వేద
ద్రవఃపీయతే

* * *

గుంజత్కుంజ కుటీరకౌశిక ఘటా
ఘూత్కారవత్కీచక
స్త.బాడంబరమూక మౌకులకులః క్రౌంచా
వతోఽయం గిరిః
ఏ తస్మిన్ ప్రచలాకినాం ప్రచలతాముద్వే
జితాః కూజితై
రుద్వేలంతి పురాణరోహిణ తరుస్కం
ధేషు కుంభీనసాః

* * *

ఏతేతే కుమారేషుగద్గదన దద్గోదావరీ
వారయో
మేఘాలంబిత మౌళినీలశిఖరాః క్షోణీభృతో
దాక్షిణాః
అన్యోన్య పతి ఘాతసంకుల చలత్కల్లోల
కోలాహలై
రుత్తాలా స్త ఇమే గభీరపయసః పుణ్యా
స్సరిత్సంగమాః.

ఈమూడు శ్లోకములుజనస్థానదృశ్యములకు రసప్రతిప త్తికై శంబూకునివాక్కునరామునకు వర్తమాన మివజనస్థాన వృత్తాంతమును సాక్షా త్కరింప జేసినాడు, కేవల చిత్రపట దర్శ నము వల్లనే రాముని మనస్సు వికలమైనది. ఆప్రదేశమును మరల చూచినప్పుడు తత్ప్రదేశమునకు సంబంధించిన జానకీహరణ గాథ మిగులబాధాకరముగానుండినదను టతిశయోక్తి కాజాలదు అందును ప్రస్తుతమనగా శంబూ కుని సంహారణ సమయమున రాముడు నాశిత ప్రియతముడు ఉద్దేశపూర్వకముగాకుండ జన స్థానమున్ను దర్శించినాడు

ఏతత్పున ర్వనమహో కధమద్యదృష్టం
యస్మిన్నభూమ చిరమేవ పురావసంతః
అరణ్యకాశ్చ గృహిణాశ్చరతా స్స్వధర్మే
సాంసారికేషు విషయేషువయ మేవ రసజ్ఞాః.

జనస్థానమును తానెట్లు దర్శించితినోయని యచ్చెరు వొందుచున్నాడు ఈ వనమందు నివసించుచు పితృవాక్పరిపాలనముగావించెను. ఏకకాలమందే పితృవాక్పరి పాలనముగా విడుచు సంసార విషయసుఖముల ను భవించు చుడెను అంతేగాక పంచవటిని సందర్శించి నపుడు తానాప్రదేశమును గౌరవింపక తిరోగ మించుటకు, దర్శించి సంభావించుటకును యస మర్థుడననివాకొనినాడు రాముడేకాకి,సితావిరహ సంతప్త హృదయుడు అందును పూర్వ మేప్రదేశమున వారిరువురు సౌఖ్యసాగరమున నోలలాడిరో తత్ప్రదేశముననే రాముడేకాకియై

తటస్థించుట విచారతరముగాదా! ఈ విషయమునే భవభూతి వాకొనినాడు.

యస్యాంతే దివసా స్తయా సహమయా
సీతాయథాస్వేగృహే
యత్సంబంధికథా భిరేవసతతం దీర్ఘాభి
రాస్థియత
ఏకస్సంప్రతి నాశిత ప్రియతమస్తామేవ
పాపఃకథం
రామః పంచవటీం విలోకయతు వాగచ్ఛత్వ
సంభావ్యవా.

ఇందు తేదివసాః యనగా పూర్వపు మధురానుభూతులు రాముని దుఃఖభాజనుని గావించెను. అయోధ్య యందుండినచో రాజకార్యభార నిర్వహణవ్యగ్రుడై యుండి యనుభవింపజాలని సుఖములు లక్ష్మణుడు కోదండపాణియై శీతారాముఁను రక్షించుచుండ యథాస్వేగృహే గడచినవి. ఆనాటిగాథలే సతతము సుదీర్ఘముగా మానసవ్యథ కల్పించుచు నిలచినవి. కామార్తులు ప్రకృతి కృపణులుకదా. నాశితప్రియతముడగు శ్రీరాము డీసూత్రమున కేమాత్రము భిన్నుడుకాదు ఆతడు సార్వభౌముడయ్యును, యవతారపురుషుడయ్యును ప్రకృతి సూత్రమునకు వశం వదుడయ్యెను

భవభూతి శంబూకుని పాత్రను చక్కగా పోషించినాడు భగవంతుడు భక్తుల కన్వేష్టవ్యుడు. మరి శంబూకుని విషయమున శ్రీరాముడతనిని వెదకుచు యెక్కడనో యున్న యయోధ్యకు వందల యోజనములు దూరమైన జనస్థానమున కరుదెంచెను అందులకే శంబూకుడు శ్రీరాముని యుద్దేశించి "యుష్మత్ప్రిహాదోపాదాన ఏషమహిమా, కిమత్ర తపోభ్యః? మహదు పకృతం తపసా" యని వక్కాణించినాడు.

అన్వేష్టవ్యోయ దపిభువనే లోకనాథశ్శ
రణ్యో
మామన్విష్యన్నిహవృషలకం యోజనానాం
శతాని
క్రాంత్వాప్రాప్తస్స ఇహతపసాం సంప్ర
సాదోఽన్యథాచే
త్క్వాయోధ్యాయాః పునరుపగమో
దండకాయాం వనేదః

రాజపాలన మందు శంబూకుని వధ యావశ్యకమే. దుర్ఘటమైన భగవత్సాక్షాత్కారము తపస్సుయొక్క సంప్రసాదమని వేఱుగా చెప్పవలయునా,

పంచవటీ దర్శన మాత్రముననే సీత పరిస్థితి చక్కగా వ్యక్తీకరింపబడినది. సీత విప్రయోగత్రస్త. నేపథ్యమందు రాముని కంఠధ్వని చెవిని సోకి నంతనే మూర్ఛిల్లినది అందును రాముని హృదయము సీతాపరిత్యాగ పరి తాపాగ్ని చే, కరుణరసము పుటపాకప్రతీకాశమైనది. కావున పంచవటీ దర్శనము శ్రీరామునకు గూడ మూర్ఛ నాపాదించినది వీరిరువురి పరిస్థితులనెట్లు ప్రకృతమునకుతేవలయునా యని సీతాసమేతయగు తమస చింత నొందినది.

రాముడు మూర్ఛిల్లుట సీతపాణిపద్మస్పర్శచే సేదదీరుట చాల చక్కగా రక్తి కట్టినది కేవలము మూర్ఛలోనే సీతాస్పర్శ సుఖమనుభవించుచున్నట్లు దుఃఖోపశమనము పొందును సీతస్పర్శ నిత్యఃపూర్వ పరిచితమని, హరిచందన పల్లవముల రసమని, సంజీవనౌషధి రసమని, యుత్ప్రేక్షించును మూర్ఛనుండి సేదదీఱి సీత యెందున్నదో కనుగొందునని యత్నించును అతని మతమున సీత పరిసరములందుండియే యతని మూర్ఛ నొందకుండ రక్షించుచుండెనని యూహ. అది వాస్తవము కూడ తమస తో సంభాషించునెడ తాను యజ్ఞము చేయనుండెననియు, బంగారు విగ్రహము నొకటి సీకది చేయించి యజ్ఞము పూర్తిచేయుచుండెనని తెలుపును ఈమాటవిని సీత యూరడిల్లును రాముని యేకపత్నీ వ్రతదీక్షపై మరల కొంచెముసడలిన యచంచలనాత్మ విశ్వాసము మరల చేకూఱును వాసంతి రాముడు సర్వకాల సర్వావస్థలయందు సంభావించు సీత నీవిధముగ వర్ణించి యట్టి సహధర్మచారిణి నేల పరిత్యజించితివని యడిగెను. ఏల పరిత్యజించితివను పదముపయోగింపజాలక "శాంతమథవాకిమతః పరేణ?" యని

మిన్నకుండినది. సీతాపరిత్యాగము చేసెనని వాసంతికిరామునియెడ కోపముండినను యతడు పొందుచున్న పరిభవాగ్ని యామెకు నావాక్యము పూర్తిచేయ వాక్కులేదు. ఇదిభవభూతి ప్రతిభా విశేషముకాదా?

త్వంజీవితం త్వమసి మేహృదయం ద్వితీయం
త్వం కౌముదీనయనయో రమృతం త్వమంగే
ఇత్యాదిభిః ప్రియశతై రను రుధ్య ముగ్ధాం
తామేవ, శాంధమధవా కిమతఃపరేణ.

ఈశ్లోకము చదువుచునప్పుడు రామునకు కలిగిన వేదన తత్ఫలితముగా సీతకు కలిగిన బాధ యనిర్వచనీయము. అందుకే వాసంతిని విరమతిరమయనినది. దానికి శ్రీరాముడు ప్రజలు సమ్మతించరని తానుహృదయ పూర్వకముగా సీతావివాసనమునకు కారణ భూతుడుకా లేదనియు విధిబలీయమగుటవల్ల తాను దీనికి నిమిత్త మాత్రుడనని మాత్రము వివరించెను. ఈసంఘటన సీతకు రామవియోగ మంతమైనట్లు కన్పట్టినది భార్యాసమేతుడై యున్నప్పుడు రాముని మనస్తత్త్వమువేఱు. సీత జనకునికై విలపించునపుడు "ఏవమేతే హృదయమర్మచ్ఛిదస్సంసార భాగ," యని వేదాంతము నుద్బోధించినాడు

భవభూతిమతమున కరుణ యొకటే రసము నిమిత్తభేదములవల్ల విభిన్నమై యితర రసముల మూలకారణమగును. సలిల మొక్కటే యవస్థాంతరములవల్ల తుషారముగాను, బుద్బుదము గాను, తరంగముగాను వ్యవహరింపబడును కదా. చతుర్థాంకమున జనకుడు, కౌసల్య అరుంధతి వాల్మీకియాశ్రమమునకు వత్తురు. జనకుడు బ్రహ్మ విద్యావిదుడు అట్టివానిని వాల్మీకి ప్రకృతి సహజమగు నపత్యవాత్సల్యమును రేకెత్తించి "దేవయజన సంభవేసీతే ఈదృశస్తే నిర్మాణభాగః" యని వాపోవును. కౌసల్యనుజూచి 'ప్రజాపరిపాలకుల తల్లి సౌఖ్యమేనా' యని యార్యగృష్టిని పృచ్ఛించెను ఈ యంకమందే జనకుడు కౌసల్య లవుని చూచుట తటస్థించును. అతనివలన రామాయణమందు కొంతభాగమును నాటకముగా రక్తికట్టించవలెనని భరతమునివద్దకు దాని నప్సరసలతో నాడింపవలెనని వాల్మీకి తన శిష్యులద్వారా పంపెనని తెలిపెను. యాగాశ్వము వచ్చుటయు, లవుడు నాయశ్వమును జయింపవలెనని వెడలును.

పంచమాంకమున చంద్రకేతుని లవుని యుద్ధమభివర్ణింపబడినది చంద్రకేతుడు లక్ష్మణ కుమారుడు లవుడు జృంభకాస్త్రములతో సైన్యమును మూర్ఛిల్లజేయును. వీరివురిసంభాషణచక్కగా చిత్రింపబడినది లవుడు రఘురాముని శౌర్యప్రతాపములను సహింపని క్షత్రియుడు. పరశురాముని గెల్చుట యొక విశేషముగాద ని నారఘుకుల తిలకుని దూషణచేసి చంద్రకేతునిమరలయుద్ధమునకు పురికొల్పును.

షష్ఠాంకమున చంద్రకేతువు లవుడు యుద్ధముచేయుచుండగా రాముడు వచ్చును చంద్రకేతువు రామునకు సాష్టాంగ నమస్కారమాచరింపగానే 'అప్యనామయం దివ్యాస్త్రయోధనస్య' యని కుశల ప్రశ్నముచేయును. అందులకు చంద్రకేతువు "ఆశ్చర్యకరమైన ప్రియమిత్రుడు లభించిన భాగ్యముచే నే కుశలినే. కాని నాదొక విన్నపము నన్నుజూచినట్లుగాని యంతకంటె యెక్కువగా గాని యనర్గళసాహసుడైన యావీరకుమారుని మీరు స్నేహదృష్టితో చూడవలెనని నాకోరిక" ఇట్లు సంభాషించిన చంద్రకేతువు సౌజన్యమెంతయో ప్రశంసనీయముగ నున్నది. రాముడు కూడ లవునిచూచి "అదృష్టవశమున కుమారునకతి గంభీరమంగళాకారుడైన స్నేహితుడు లభించెన"ని యచ్చెరు వొందును

భవభూతి యీ నాటకమందు, పుత్రుడని యెఱుంగకయే పుత్రవాత్సల్యము, నాయనయని యెఱుంగకయే పితృభక్తి, అన్నయనియుతమ్ముడనియు నెఱుంగకయే భాతృప్రేమ-వీనినివిచిత్రముగా సహృదయహృదయంగమంబుగాచిత్రించినాడు. మఱి నిర్వ్యాజనురాగము యేదో యాంతరంగిక కారణములవల్ల కలుగును కాని బహిరుపాధికృతములు కావని యుతనిమతము.

అల్లసాని వాని అల్లిక జిగిబిగి

కవి సమ్రాట్, శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

౭

కథా కథన శిల్పము.

ఈ కథా కథనశిల్ప మన్నమాట కొంతవఱకుఁ గ్రొత్తది. 'ప్రసన్న కథా కలితార్థయుక్తి' యని నన్నయ్యగారు వాడిరి. తర్వాత నెవ్వరును దీనివంకఁ జూచినట్లు కానుపించదు. అయినను ఈ కథా కథన శిల్పము పౌఢులైన కవుల యందు కనిపించకపోదు కథ చెప్పుటలో నొక శిల్ప మున్నదని గుర్తించిన వారి సంఖ్యయే తక్కువ యని చెప్పవచ్చును.

కళా పూర్ణోదయములో నీ ప్రయత్నము చాలఁగలదు. కాని యందలి కథా కథన వైఖరిని ప్రసన్నతను మాలి క్లిష్ట లక్షణమును సంపాదించినది

కొందఱు కవులు నాటకీయముగా కథా సంవిధానము చేయుట కలదు. అనఁగా నాటకమునందువలె రసవద్ఘట్టము తీసికొని యారంభించుట విష్కంభ ప్రవేశకములలో చెప్పఁదగిన కథను పరిత్యజించి కావ్యాదిచేయుట. ఈ పద్ధతి ప్రభావతీ ప్రద్యుమ్నములోఁ గొంత కలదు నాటకీయముగా కథా శిల్పమును జేయుట యనఁగా ఉపశ్రుతి సూచ్యార్థ సూచనము చూళికాదులు మొదలైన వాని నిక్షేపము చేయుటయో, లేదా తద్వాసనా భరితముగా కథను నడుపుటయో యగును. ఆధునికులు కొందఱు ఉక్తి ప్రత్యుక్తికావైఖరీ సమేతమైన యొక రచనను నాటకీయముగా నుండెనని చెప్పుచుండిరి. అదియంత సమంజసము కాదేమో! మఱియు నీ యుక్తి ప్రత్యుక్తికా వైఖరి వృత్తవర్తిష్యమాణ కథాంశములు లుప్తములో సూచితములో కా రచించిన నది మఱియు నాటకీయ రచనగా ననుకోవచ్చును

ఏది యెట్లైనను ఇది కథా కథన శిల్పములోనికి రాదు. కథా కథన శిల్ప మన్నది ఇదికాదు. అది వేఱగు విషయము

ఒక్కొక్కప్పుడు మఱి యొండొక విషయము ఈ శిల్ప మేమో యని భ్రాంతి గొలుపవచ్చును. ఇది చాల విచారించఁదగిన విషయము పెద్దన్నగారి కథా కథన శిల్పమును గూర్చి ప్రధానముగాఁ జెప్పుచు దీనిని గూర్చి విచారణ ప్రారంభించినచో నప్రస్తుత ప్రశంస యగును. కాని దానిని గుఱించి యే కొంతయో చెప్పక పోయినచో తద్భావరూఢి కలుగదు దానిని విస్తారముగాఁ జెప్పక పోయినచో ఈ కథా కథనములోని పెద్దన్నగారి వైశిష్ట్యము తెలియదు. ఇట్టి క్లిష్టమైన విషయమిది పెద్దన్నగారి కథా కథన శిల్పములోని వైశిష్ట్యము మాట యటుంచి దాని స్వరూప కథనము చేయుదును.

ఇతః పూర్వము స్వారోచిషమను సంభవమను పేరుపెట్టి యీ కావ్యమునందు భిన్నకథల కెట్లు సంయోజనము చేసెనో చూపించి యుంటిని. ఇప్పుడు ప్రవరునికథ చెప్పుటలోని యొక విశిష్ట లక్షణమును చూపింపఁ బ్రయత్నింతును.

ఆంధ్రభాషలో ప్రబంధములొక విలక్షణమైన సాహిత్య శాఖ. దాని విలక్ష

ణత్వ మెట్టిదనఁగా నాంధ్ర సారస్వత మనినంతటనే ఇతిహాస పురాణములైన భారత భాగవతములనుదాటి సారస్వత వేత్తయొక్క బుద్ధి పెద్దన్న, భట్టుమూర్తి, ధూర్జటి, తెనాలి రామకృష్ణయ్య కృష్ణరాయలవారు, మొదలైనవారి మీఁదికిఁ బ్రసరించును ఆ పురాణములు ఈ ప్రబంధముల నడుమ నాచనసోముఁడును శ్రీనాథుఁడును గలరు శ్రీనాథుఁడు మఱియుఁ గలఁడు. ఆయన కావ్యములు ప్రబంధరూపమునందే యున్నవి. ఒకవిధముగాఁ జూచినచో నాంధ్ర ప్రబంధ నిర్మాత శ్రీనాథుఁడే యనవలయును కాని పెద్దన్న దానిలోని నిగ్గులాగి ప్రబంధమునకు స్వస్వరూప మిచ్చినాడు

ఈకథా కథన శిల్పమన్నది ఈప్రబంధ రూపములోలేదు. శ్రీనాథుఁడు గూడ తానెక్కువ కథలు వ్రాయుచు కథా కథనము చేసెనుగదా! ఆ కథనముల యందలి వైశిష్ట్యము సర్వథా నీక్రిందఁ జెప్పఁబోవు విషయములలో నంతర్భూతమై యుండును,

1 ఒక సన్నివేశము దానిలోని ప్రధానార్థము విస్పష్టముగా భాసించునట్లు చేసెడు నొకకల్పన. ఉదాహరణముగా హరవిలాసమున చంపిన తమ కొడుకును పిలువుఁడని యోగి తలిదండ్రులకుఁ జెప్పెను. వారు నాల్గు దిక్కుల యందుఁ బిలిచిరి ఇవి రమ్యముగా నున్నవి. ఏల యనఁగా శివుఁడు పంచభూతాత్ముఁడు గనుక, సర్వదిక్కులయందు నిండి యున్నాడు గనుక, శివునిలో కలిసి పోయిన కొడుకును దిక్కులయందే పిలువవలయును ఈ మహార్థముతోగూడి యుండి, దానియందు రమ్యత భాసించుచున్నది ఇది విశిష్టార్థవంతమైన కల్పన గాని కథ చెప్పుటలోని నేర్పు కాదు

2. ఉత్తర హరివంశములో హంస డిభకుల కథయున్నది. వారు వేటకు వెళ్ళిరి. ఋషులు యజ్ఞము చేయుచుండఁగా నచటికిపోయి చూచిరి వారిని జూచి యూరకే తిరిగివచ్చుట బాగుండదని "మా నాయనగారు రాజసూయ యాగము చేయుచుండిరి మిమ్మాహ్వానము చేయుటకు వచ్చితి"మనిరి రాజసూయ యాగములేదు, ఏమియులేదు మొదట ననుకొననేలేదు. అపుడది వారి యంతట వారికిఁ దోచిన విషయము అన్నా మకదా యని యింటికి వచ్చి యాగారంభమును గావించిరి. దానితో రగడ పెరిగినది ఇది హంసడిభకుల యొక్క ధృష్టత్వముచేత అనినమాట, చేసిన చేత, ఇది కథాకథన శిల్పమా? అని విచారణ చేసినచో నేను, కాకపోవును.

ఇట్టివి సారస్వతమునం దందందుఁ గలవు, వీనినన్నింటిని కథాకథన శిల్పము లనుటకు వీలులేదు ఏలయనఁగా వాని ప్రయోజనములు వేఱు అవి కావ్యశిల్పమునం దంతర్భూతములు కావచ్చును. కథాకథన శిల్పమని నన్నయ్యగారి పెక్కుకథలు, పెద్దన్నగారి ఈ ప్రవర వరూథినీ సమాఖ్యానములు మాత్రమే యనిపించుకొఁ దగినంత ప్రత్యేకతతో భాసించుచున్నవి

నన్నయ్యగారి కథాకథన శిల్పము కొన్ని వ్యాసములమున్నే విమర్శించి చూపితిని ఆ లక్షణము వేఱు. ఈ వరూథినీ కథ చెప్పుటలోని లక్షణము వేఱు.

ఈయన కథను పురము, అచటి నాల్గువర్ణములు, వెలయాండ్రు - వీరివర్ణ

నతో నారంభించెను. దీనిని పట్టుకొని తరువాతి ప్రబంధ కర్తలు పుష్పలావికలతో సహా పెద్దపెద్ద వర్ణనలు చేసిరి కోట, కోటగోడ, పరిఖ, మేడలు, చాతుర్వర్ణ్యము తదితర వృత్తులు, వీనినన్నిటిని గాని వీటిలోఁ గొన్నిటినిగాని యొకానొక ప్రసక్తి వచ్చినప్పుడు తత్పూర్వ్యలు గూడ వర్ణించుట కలదు భాగవతమునందే పోతన్నగారు ఒకటి రెండుచోట్ల నిట్టి వర్ణనలు చేసిరి ఈ వర్ణనలు నేటి కొందఱకు విసుగెత్తినవి ఆ విసుగు పలుమంది వ్రాయుటచేతనే కలిగినది కాని యిందొక యౌచిత్య మున్నది. పూర్వకాలపు పట్టణము లట్లుండెడివి. అన్నింటికి కోటగోడయు పరిఖయు నుండెడివి. చిన్నచిన్న గ్రామములకుఁగూడ నుండెడివి మఱియు నే గ్రామమున కా గ్రామమే. దేనికది స్వయంపోషకముగా స్వయం సంపూర్ణముగా నుండెడివి. ఆ నాగరకత గ్రామ నాగరకతయనియు, నేటి నాగరకత పట్టణ నాగరకత యనుటయుఁ గలదుగదా? కనుక నా గ్రామములు పట్టణములు నటువంటివి

మఱియుఁ గావ్యము జీవిత ప్రతిబింబము కావలయుననియు తత్తత్కాల సాంఘికాది వ్యవస్థలకు ముకురభూతముగా నుండవలయు ననియుఁ జెప్పుచున్నారు గదా! పూర్వకవులు ప్రాకార పరిఖాదులను వర్ణించినచో తత్కాల పరిస్థితులను వర్ణించిరి. అవి కవితా లక్షణము, అందు దోషమేమియును లేదే! అట్లే పెద్దన్నగారు చేసిరి ఆయన రెండే పద్యములు వ్రాసెను పట్టణముయొక్క వప్రప్రస్థలిని వర్ణించెను. రెండవ సీసపద్యములో చాతుర్వర్ణ్యమును వెలయాంద్రను వర్ణించెను చాతుర్వర్ణ్యము మాట యెట్లున్నను వెలయాండ్రను వర్ణించుట తన కథకోసము కూడ వర్ణించెను

అచటి వెలయాండ్రు 'నాట్యరేఖా కళాధురంధరనిరూఢ' చేత రంభాదులు స్పర్ధ వహించినను 'కాసెకొంగున వారించి గడపగల'వారు. ఇట్టివారిని దైనందినముగా ప్రవరుఁడు చూచుచునే యుండెను వారి సంగీతము తెలియుఁగును. వారి నాట్యము తెలియుఁగును వారి యొయ్యారము తెలియుఁగును అతఁడు మిక్కిలి సుందరుఁడు 'మకరాంక శశాంక మనోజ్ఞమూర్తి' 'అనారతాధ్యాపన తత్పరుఁడు' అతనిని జాల మంది యువతులు కాంక్షచేసిరి వారికతఁడు భోగబాహ్యుఁడయ్యెను అతఁడు యౌవనమందు యజ్వ ధనాఢ్యుఁడు. మఱియు భూపాపర శేషభోగి ఇవి యతని యందున్న లక్షణములు ఇట్టి లక్షణములు కలవానినగా పెద్దన్న ప్రవరు నేల సృష్టించెను? ఈ ప్రవరుఁ డెట్టివాఁడుగా పెద్దన్న యూహించి యుండును? ఆనందవల్లిలో అనేకానందములు చెప్పఁబడినవి అందులో మొదటిది ఇది యువకుఁడు సాధుయువకుఁడు వేదాధ్యయన పరుఁడు ఆశిష్ఠుఁడు ద్రఢిష్ఠుఁడు బలిష్ఠుఁడు అకామహతుఁడు శ్రోత్రియుఁడు- ఈ దృక్లక్షణ సంపన్నుఁడు కలిగినచో వాఁడు పొందెడు నానందము అది ఏకమైన మానుషానందము ఇది అనంతమునకు మొదటి కొలత ఈ ఆనందములు వందయైనచో మఱియొక యానందము, అట్టివి వంద మఱియొక యానందము తట్టతుదిది బ్రహ్మానందముగా వేదము చెప్పుచున్నది.

'న ఏకోమానుష ఆనందః'

దీనికి లక్ష్యభూతుఁడుగా ప్రవరుని పెద్దన్న నిర్మించినాఁడు

ఇతఁడు హిమాలయమునకుఁ బోవును వరూథినిని జూచును ఆమె మహాసౌందర్యవతి. పరమ యౌవనవతి. యాగాది ఫలమైన యప్సర స్త్రీ సమాగమ సుఖము నయాచితముగా నియ్యఁ గూర్చున్నది ఇతని నాకర్షించుటకు వంద యొయ్యారములు నెఱపినది కోరికల్ గుబ్బటిలంగఁ జూచినది ఝుళంఝుళత్కటక సూచిత వేగ పదారవిందగా నడచినది జిప్పిల్లాప్పె మెచ్చులు ప్రకటించినది. అంఘ్రికటకంబుల్ మ్రోయఁగా నడ్డమై నిలచినది "ఇంతలు కన్నులుండ" నని నర్మగర్భముగాఁ బలికినది. 'పద్మసంభవ వైకుంఠ భర్గసభలు' తమికు సాముగరిడీలని వికత్థనత నెఱసినది 'అంధునకుఁ గొఱయె వెన్నెల?' అని యూటాడినది. ఇట్టివెన్ని చమత్కారములైనఁ జేసినది. దేనికిని ప్రవరుఁడు కదలలేదు. ఎందుచేత కదలలేదు? ఎందుచేత కదలలేదనఁగా ఆయూరి వెలయాండ్రు నాట్యరేఖా కళాధురంధర నిరూఢిచేత రంభాదులను గూడ లెక్క సేయరు. ఈ లక్షణము లన్నియు నాతఁ డెఱిఁగినవే. వీనిలో నతని కేమియుఁ గ్రొత్తలేదు.

పైఁగా, పెద్దన్నగారు వాడినది 'నాట్య' అన్న శబ్దము. నృత్యనృత్తములను వాడలేదు. ఆయూరి వెలయాండ్రు నర్తకులుగాదు, నాట్యకర్తలు నాట్యమనఁగా వాక్యార్థాభినయము అనఁగా సర్వవిధ నాయికా స్వరూపములు, అనుభావవ్యభిచారి సర్వభావాభినయము వారెఱుఁగుదురు లోకోత్తరముగా ప్రదర్శించనుగలరు. వానినన్నిటి నెఱిఁగిన ప్రవరుఁడు వరూథినియందాలక్షణము లను జూచి ఏమియు నబ్బురపాటు చెందఁడు.

అంతటితో నాగక వరూథిని 'ఆనందో బ్రహ్మ' యని భృగువల్లిచదివినది దుర్వ్యాఖ్యానము చేసినది. దానితో నతనికి మఱియు వెగటువేసినది

ఇది కథాకథన శిల్పము ఇందేమి యున్నది? ఒక కథను జెప్పెడి లక్షణము కలదు. ఆ కథ నొక వైలక్షణ్యముతోఁ జెప్పుట కలదు ప్రవరుఁడు వరూథినిని జూచెను ఆమె ఇతనిని ప్రేమించెను. తన కోర్కెఁ దెలిపెను. ఇతఁడు నిరాకరించెను. ఇది సామాన్య కథ మార్కండేయ పురాణములో నున్నదే. దీని కనేక విషయములు కలిపి పెద్దన్న కావ్యముగా వ్రాసెను.

ఒక కథ యొక పద్ధతిగా జరుగుటకు హేతు నిరూపణము శిల్పములోని భాగము ఆ హేతువులు పాత్ర పోషణమునకో, సంవిధాన పోషణమునకో, కవితా రామణీయకమునకో పరిపోషకములైనచో వానియందు కథాకథన శిల్పము లోపించును. కవితా శిల్పమెక్కువ భాసించును.

ఇందాక చెప్పిన నాచనసోమన్న హంసడిభకుల వ్యవహారము వారి దుర్జనత్వగుణాపాదకమై అది కథాకథన శిల్పము కాకపోవు చున్నది.

ఇది యట్లుకాదు. ఇది అచ్చముగా కథాకథన శిల్పము. ఏలయనఁగా ప్రవరుఁడు వైరాగ్యవంతుఁడు, ఏకపత్నీ వ్రతుఁడు, అగ్నిహోత్రి. ఇంతియేగాక ఆయూరి వెలయాండ్ర నాట్యవైభవ

మెఱఁగినవాఁడు అతఁడు వరూధినిని జూచినప్పుడు కోరికయెట్లును లేదుగదా, ఆశ్చర్యముకూడ లేదు.

ఈకథా కథనములో నున్నవైచిత్రి యిది· కొన్ని లక్షణములు కలిగిన యొక పురుషుఁడున్నాడు అట్టివానికి నొక సంవిధాన మేర్పడును. ఈ దృగ్లక్షణ సహితుఁడైన వాఁడు ఆ సంవిధానము నందెట్లు ప్రవర్తించును? స్వలక్షణాను సారముగనే ప్రవర్తించును. కలిగిన సంవిధానము ఫలవంతము కాని లక్షణము వాని శీలమునందే కలదు. నిస్సంశయముగా ఆ సంవిధాన వైయర్థ్యమే ప్రాప్తించును

ఒకవేళ భిన్నముగా జరుగవచ్చును, జరుగుటకు వీలులేదు. అందుచేత భిన్నముగా జరుగలేదు తన రచించిన కథలో ఇట్టి లక్షణములు పెట్టి కథా నిర్మాణము చేసి ఆ కథను సూక్ష్మాంశ రమణీయముగాఁ జిత్రించి రచించుటలోననే కథా కథన శిల్పమున్నది.

తాత్పర్యమిది ఏవంభూత లక్షణ సహితుఁడైన పురుషునకు ఏవంభూత లక్షణ సహితురాలైన స్త్రీతోడి కలిసికొనుట జరిగినది· ఫలిత మేమగును? ఏమగునో మొదటనే చెప్పఁబడినది ఆ వెలయాండ్ర లక్షణము చెప్పుట, అతఁడు వైరాగ్యవంతుఁ డగుట - మొదలైన వానియందే వరూధినీ సమాగమ ఫలమిమిడియున్నది. ఇంతే.

★

శ్రీ భరతముని ప్రణీత
నాట్యశాస్త్రమ్
★
ఆంధ్రభారతి

డాక్టర్ శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి, ఎం. ఏ., ఎం. లిట్., పి హెచ్. డి.

చతుర్థోఽధ్యాయః—తాండవలక్షణమ్

1. తలపుష్పపుటము.

వామే పుష్పపుటః పార్శ్వే పాదోఽగ్రతల సంచరః
తథాచ సన్నతం పార్శ్వం తలపుష్పపుటం భవేత్. ౬౦

ఎడమవైపున పుష్పపుట హస్తమును పట్టవలెను చేతివ్రేళ్ళను ఎడము లేకుండాఉంచి సర్పశీర్ష హస్తము యొక్క అరచేతిని రెండవచేతి ప్రక్కగాకలిపిన పుష్పపుట హస్తము వచ్చును. అగ్రతల సంచరమైన పాదమున మడమనుఎత్తి, కాలివ్రేళ్ళను అంచితములుగాచేసి, బొటనవ్రేలిని ప్రసరించిన అగ్రతల సంచరమగును. పార్శ్వము సన్నతము కావలెను. ప్రక్కభాగము, నడుము వ్యాభుగ్నములై భుజము జారినట్లుగానుంచిన ప్రక్కభాగము వంగినట్లుండును. ఈ మూడును కలసిన తలపుష్పపుటమను కరణము వచ్చును.

సమపాదతల హస్తద్వయ పూర్వకముగా తల సంచరము జరుగును. కుడి పాదము మడమ వెనుకగా ఎడమపాదము నుంచి, కుడిపాదముతో అడుగువేయుచు చేతులను వ్యావర్తింపజేసి, కుడిప్రక్కనుండి పరివర్తనము చేయుచు ఎడమప్రక్కకు తీసికొని రావలెను. అప్పుడు ఎడమ వక్షమున పుష్పపుట హస్తబంధమును పట్టవలెను. అగ్రతల పాదమును, పుష్పపుటముతో సంయోజించ టచే నీకరణము తలపుష్పపుట మనబడుచున్నది ఈరీతిగా కరణముల పేర్లకు అర్థమును చెప్పవలెను.

వాక్యార్థాభినయమును ప్రధానముగా ప్రదర్శించునపుడు కరణములకే ప్రాధాన్యము నొసగవలెను పదార్థాభినయములను చూపునపుడు అందలి వాక్యమున కొకదానికే ప్రాధాన్యము చూపవలసినచో వాక్యాదిలో గాని, వాక్యమధ్యమునగాని, వాక్యాంతమున గాని ఉచితానుచితములను గమనించి కరణమును ప్రయోగించవలెనని ముఖ్యసూత్రము. నృత్తమున ప్రధానమైనది అభినయము అభినయము నాల్గు విధములు. అందు ఆంగికాభినయము అంగ హారములతో నిష్పన్నమగును. ఈ అంగహారములు కరణముల నాశ్రయించుకొనినవి,


కరణములకు వ్యావృత్త పరివర్తములుండును. అరచేతికి అభిముఖముగా కనిష్ఠికాది వ్రేళ్ళను పాచుట వ్యావర్తిత మనబడును ఈవ్రేళ్ళనే క్రమముగాబయటకు తెరచుట పరివర్తిత మనబడును. తర్జన్యాదిగా వ్రేళ్ళను లోపలకు చాచిన ఆవేష్టితమని, బయటకు తెరచిన ఉద్వేష్టితమని యందురు.


1


2


3


4


5


6


7


8


9

2. వర్తితము.

కుంచితౌ మణిబంధేతు వ్యావృత్త పరివర్తితౌ
హస్తౌ నిపతితౌ చోర్వో ర్వర్తితం కరణంతు తత్.

వక్షమున కెదురుగా నున్న పతాక హస్తములను ఒకదానినొకటి తాకకుండా స్వస్తికవలె మణికట్టుతో పట్టవలెను. తర్వాత చేతులను తీసి, అవృత్త పరివృత్తములను చేసి, ఉత్తానములుగా తొడలవద్ద నుంచవలెను. అసూయను తెలుపు వాక్యార్థము నభినయించునపుడు హస్తములను ఉత్తానపతాకలుగా పట్టవలెను. ఇవి తర్వాత అధోముఖ పతాకలగును. రోషము నభినయించునపుడుగూడ నీకరణ ముపకరించును. అభినయించు భావము ననుసరించి ఖటకాముఖము, శుకతుండము మొదలగు హస్తములను యోజించవలెను. కావుననే భరతుడు హస్త విశేషమును నిరూపించలేదు హస్తముయొక్క ఔచిత్యము ననుసరించి పాదమును నిరూపించవలెనని నృత్త సంప్రదాయము.

3. వలితోరుకము.

శుకతుండౌ యదా హస్తౌ వ్యావృత్త పరివర్తితౌ
ఊరూచ వలితౌ యస్మిన్ వలితోరుక ముచ్యతే. ౬౨

తర్జనియగు చూపుడు వ్రేలిని విల్లువలెవంచి మిగిలిన వ్రేళ్ళను దీనికి వెనుకగా సాచి, బొటనవ్రేలిని కుంచించినచో అరాలహస్తమగును. అరాలహస్తమున అనామిక వంగియున్నచో శుకతుండహస్తము వచ్చును. శుకతుండ హస్తములను వక్షము వద్దనుంచి వ్యావర్తితములుగా చేయవలెను. అప్పుడు ఆక్షిప్తమను చారితో హస్తములను పరివర్తనమున వక్షము వద్దకు తెచ్చి అధోముఖ శుకతుండములుగానుంచవలెను.

కుంచించబడిన పాదమును పైకెత్తి శరీరమునకు ముందు త్రితాలదూరమున ప్రక్కగా పిక్కలవరకు తీసికొనివెళ్ళి, మడమను స్వస్తికగా భూమి యందుంచిన ఆక్షిప్తమను చారీ సిద్ధించును. వ్యావృత్తమున నీచారీ ప్రయోగము చేయవలెను. స్థితియందు బద్ధా అనుచారీ రావలెను. ఒక పిక్కను మరొకపిక్కతో కలిపి స్వస్తికను పట్టి ఊరువలనము చేసిన బద్ధాచారీ రాగలదు. ఈ కరణము ముగ్ధ నాయికా విషయకము.

4. అపవిద్ధము.

ఆవర్త్య శుకతుండాఖ్య మూరుపృష్ఠే నిపాతయేత్
వామహస్తశ్చ వక్షఃస్థో ఒప్యపవిద్ధంతు తద్భవేత్. ౬౩

వక్షస్థలమున ఎనిమిది వ్రేళ్ళ ఎడముగా రెండు చేతులనుంచిన చతురశ్రస్థితి యేర్పడును. ఈ చేతులలో కుడిహస్తమగు శుకతుండమునకు అవర్తముచేసి, శుకతుండమును పొగొట్టి, అదే సమయమున ఆక్షిప్తచారీని ప్రయోగించవలెను. తర్వాత నదేచేతిని శుకతుండము చేసి ఊరువుల క్రిందుగా నుంచవలెను. వక్షమున

ఎడమచేతిని ఖటకాముఖముగా నుంచవలెను. అసూయ కోపములను తెలియజేయు వాక్యార్థముల నభినయించుట కీ కరణ ముపకరించును.

5. సమనఖము.

శ్లిష్టౌ సమనఖౌ పాదౌ కరౌ చాపి ప్రలంబితౌ
దేహః స్వాభావికో యత్ర భవేత్ సమనఖంతు తత్. ౬౪

చేతులను లతాహస్తములుగా నుంచవలెను. అడ్డముగా ప్రక్కలకు ప్రసరించబడిన పతాక హస్తములను లతాహస్తములందురు, పాదములను కలపుచు లతాహస్తములనుపట్టి, దేహమును సహజరూపమున నుంచుటయే సమనఖము. నృత్తమున ప్రవేశించునపుడు మొదటనే ఇది కన్పించగలదు.

6. లీనము.

పతాకాంజలి వక్షఃస్థం ప్రసారిత శిరోధరమ్
నిహంచి తాంసకూటంచ తల్లీనం కరణం స్మృతమ్. ౬౫

పతాకాహస్తముల వ్రేళ్ళను బాగుగా కలపినచో అంజలి ఏర్పడును. సహజముగా నుండునట్లు వ్రేళ్ళను ప్రసారించి, బొటన వ్రేలిని కుంచించిన పతాకవచ్చును. బాహుశిఖరములను పైకిఎత్తి, మెడనుకుంచించి నికుంచితమైన శిరస్సుతోను, బుజములతోను అనుసంధించిన నిహంచితత్వము సిద్ధించును. వక్షఃస్థలమునుండి వ్యావర్తితముగా లలాటమునకు ప్రక్కలకు, మండలమువలె తిరుగు ప్రసారితములగు పతాక హస్తములను ఊర్ధ్వమండలము లందురు. ఈ నృత్తహస్తములను ముందు ప్రయోగించి, హస్తచలములలో వక్షఃస్థలమున అంజలిని చేయవలెను. పతాకాహస్తములనే స్వీకరించవలెను. ఊర్ధ్వమండల గమనమున పతాకాస్తములకు స్ఫుటమైన ప్రయోగోత్పత్తి గలదు. ప్రియప్రార్థనను తెలుపు వాక్యార్థాభినయమున ఈ కరణమును ప్రయోగించవలెను. దేవతాప్రణామమున శిరస్సుపై అంజలిఉండవలెను గనుక వక్షఃస్థమగు అంజలిని విధించరాదని, ప్రియప్రార్థనలో వినియోగము చెప్పబడినది.

7. స్వస్తిక రేచితము.

స్వస్తికౌ రేచితా విద్ధౌ విశ్లిష్టౌ కటిసంశ్రితౌ
యత్ర తత్కరణం జ్ఞేయం బుధైః స్వస్తిక రేచితమ్. ౬౬

ఈ కరణమున ఆరునృత్త హస్తములు వచ్చుచున్నవి మొదట రేచిత హస్తములు ప్రసరింపబడిన ఉత్తానతలములు గలిగిన హంసపక్షహస్తములు వేగముతో కంపించిన రేచితములగును. మూడు వ్రేళ్ళను సమముగా ప్రసారించి, చిటికెన వ్రేలిని సాచి, బొటనవ్రేలిని కుంచించిన హంసపక్షము రాగలదు.

తర్వాత వీటిని ఆవిద్ధ వక్రములు చేయవలెను. భుజాగ్రములతోను, మోచేతులతోను పతాకాహస్తములను సవిలాసముగా వ్యావర్తింపచేసి, నాగలిని పట్టినట్లుగా అరచేతులను క్రిందకు ఎదురుగా నుంచినచో ఆ విద్ధవక్రములగును. హస్తములను

వక్షమున స్వస్తికగా చూపవలెను. తల ముఖములను మణిబంధమున స్వస్తికగాపట్టి, ఈ స్వస్తికను విడదీసిన, హస్తములు విప్రకీర్ణములగును. త్రిపతాకహస్తములను నడుమువద్ద ఎగబట్టిన వక్షవంచితములగును. వీటినే పరావృత్తములుగా మరికొంచెము ఎగబట్టిన వక్ష ప్రద్యోతములు రాగలవు. రేచిత హస్తములను ప్రయోగించిన తర్వాత వ్యావర్తిత కరణమున శిరస్సునుండి క్రిందికి, పైకి, చేతులను తెచ్చుచు, ఆవిద్ధ వక్రహస్తవర్తనతో వక్షమువద్ద స్వస్తికను విభించవలెను ఈ స్వస్తికను వదలుచు వక్షవంచితములుగను, వక్షప్రద్యోతములుగను చేయగా స్వస్తిక రేచితము రాగలదు. నృత్తమునే ప్రధానముగా అభినయించవలసి వచ్చినచోట, ప్రహర్షాది యోగమందు ఈ కరణమును ప్రయోగించవలెను

8. మండల స్వస్తికము.

స్వస్తికౌతు కరౌకృత్వా ప్రాఙ్ముఖోర్ధ్వతలౌ సమౌ
తథాచ మండలం స్థానం మండల స్వస్తికంతు తత్. ౬౭

స్వస్తికహస్తములను ఎదురు ముఖములుగా పట్టి చతురశ్రములుగా నుంచ వలెను. వక్షముకు ఎనిమిది వ్రేళ్ళదూరముగా, సముఖముగా ఖటకా ముఖముల నుంచవలెను. అప్పుడు బుజములు, చేతులు తులాదండమువలె సమముగానున్న చతురశ్రము లనబడును. ఖటకా ముఖములను ఊర్ధ్వమండలము గలవానినిగా చేయుచు రెండుపాదములమధ్య నాలుగు తాలముల దూరముంచి, నడుమును జానువుతో సమముగాచేసిన మండల స్థానకము సిద్ధించగలదు.

చతురశ్ర హస్తములతో నుండి, విచ్యవాప్రయోగము చేయుచు ఉద్వేష్టిత వర్తనతో ఊర్ధ్వమండలముగా స్వస్తికను పట్టవలెను. మండల స్థానకమును చూప వలెనని భావము అగ్రతల సంచర పాదముతో భూమిని ఘట్టించుచు సమపాదము లను చూపిన విచ్యవాయనబడును మోసమును తెలుపు వాక్యార్థాభినయమున ఈ కరణ ముపకరించును

9 నికుట్టనము

నికుట్టితౌ యదా హస్తౌ స్వబాహూ శిరసోఽన్తరే
పాదౌ నికుట్టితౌచైవ జ్ఞేయం తత్తు నికుట్టనమ్. ౬౮

శరీరమును పైకిఎత్తి క్రిందకు దించుట నికుట్టనమని కోహలుని మతము అందుచే అలపల్లవ హస్తములోని చిటికెన వ్రేలితో చూపు పతనోత్పతనములను (ఆవర్తపరివర్తనములను) నికుట్టన మందురు అరికాలి ముందు భాగముపై నిలిచి మడమను క్రింద వేయుటను ఉద్ఘట్టిత మందురు బాహు శిరస్సున అలపల్లవ హస్త ములను నికుట్టితములుగా జేసి ప్రయోగించవలెను కుడిచేతిలో కుడిపాదమునకు, ఎడమ చేతితో ఎడమ పాదమునకు ప్రయోగవిధిని చెప్పి కొనవలెను మండల స్థానకమున నిలచి ఉద్వేష్టిత కరణమున కుడిచేతిని భుజశిరస్సున నికుట్టనము చేయ వలెను. ఆత్మ గౌరవమును, స్వోత్కర్షను మాటిమాటికి చెప్పువాక్యార్థము నభిన యించు నపుడీ కరణమును ప్రయోగించవలెను.

కోజాగర పూర్ణిమ

శ్రీ గూడూరి నమశ్శివాయ

దూర్వాసు శాపవశమున
నిర్వీర్యత జగములెల్ల నిశ్శ్రీకములై
పర్వతరిపుతో గూడ న
పర్వములయియుండె హత సుపర్వావళులై.

వృత్రాసురుని వధించి తిరిగి అమరావతికి వచ్చుచున్న సమయములో, త్రోవలో ఇంద్రునకు దూర్వాసమహర్షి ఎదురై మందార పుష్పమాలికను బహూకరించెను ఆ పుష్పమాలికను ఇంద్రుడు తన వాహనమైన ఐరావతము యొక్క కుంభస్థలమున నుంచెను. ఆ మందార పుష్పముల మకరందము కొరకు తేనెటీగలు ఝుమ్మనుచూ వచ్చి ఐరావతముమీద వ్రాలి దానిని బాధించ జొచ్చెను. ఐరావతము కోపగించుకొని ఆ మాలను తొండముతో విసిరి కాళ్ళతో మట్టగించి నేలరాచి వైచెను ఆ చోద్యమును చూచిన దూర్వాసుడు ఇంద్రుని "ని భోగము లెల్లను సిరి సంపత్తు సర్వమును సముద్రగతమగుగాక" యని శపించెను అంతటితో అష్టభోగములు సముద్రములో కలిసి పోయినవి.

ఇట్టి స్థితిలో ఇంద్రుడు దరిద్రుడయ్యెను. దేవత లెల్లరు రోగిష్ఠులైరి పంచభూతములు తమ కృత్యముల నిర్వహించుట కసమర్థులైరి. దిక్పాలకులు తమ ధర్మములను నిర్వర్తించ లేక పోయిరి. గ్రహములు బలహీనములైనవి. యజ్ఞయాగాది క్రతువులు కుంటువడి పోయినవి. వర్షములు లేవు. దేవతలు హావిస్సులులేక కటకట లాడజొచ్చిరి. అంతటా దారిద్ర్యము హెచ్చినది. మృత్యువు వెంటాడ జొచ్చినది. లోకమంతయూ హాహాకారములు మిన్నుముట్టినవి

నెలవు వెడలివచ్చి నిస్తేజులైనట్టి
వేల్పుగముల జూచి వేల్పుపెద్ద
పరమపురుషు దలచి ప్రణతుడై సంఫుల్ల
పద్మనయను డగుచు బలికె దెలియ.

"లోకమున వర్షములు లేవు అందువలన ఆరోగ్యము పూర్తిగా నశించి పోయినది మాకు అమృతత్వమును ప్రసాదించవలసినది" అని దేవతలు, మహర్షులు ప్రార్థన చేసిరి అప్పుడు విష్ణుమూర్తి ప్రత్యక్షమై ఏమి కావలయునన అడిగెను "భూమియందు అన్నము, గోవుయందు అమృతము, సమిధలయందు వహ్ని, మాకు "మృత్యోర్మా అమృతఙ్గమయ" మృత్యువును నశింపజేసి అమృతత్వమును ప్రసాదించవలె" నని కోరగా

అమృతోత్పాదన యత్నము
విమృష్ట మతి జేయుటొప్పు వేల్పులు వినుడీ
యమృతంబు ద్రావి జంతువు
లమృతగతిన్ బ్రతుకు చుండు నాయుర్వృద్ధిన్.

అని చెప్పినట అమృతమును సంపాదించమని యర్థము అప్పుడు దేవతలు దానవులను కూడా కలుపుకొని "పాల మున్నీటిలో పలసర్వతృణలతౌషధములు తెప్పించి అనేకముగా వైచి, మందర

శైలంబు మంథానముగ జేసి, తనర వాసుకిదరి త్రాడు సేసి పాలకడలిని మథించిరి. పాలకడలినుండి అప్పుడు విషము పుట్టినది ఆ విషమును ఈశ్వరుడు పానము చేసినాడు. తరువాత లక్ష్మి, ఉచ్చైశ్రవము, మొదలగునవి పుట్టినవి అనేక ఓషధులు పుట్టినవి చివరకు అమృతము తీసుకొని ధన్వంతరి అవతరించెను.

తరుణుండు, దీర్ఘదోర్దండుండు,
కంబుకంధరుడు,
పీతాంబరధారి స్రగ్విలాసిత
భూషణకృతు,
దరుణాక్షుం,డున్న తోరస్కు,
డత్యుత్తముండు
నీలకుంచిత కేశ నివహుండు,
జలధరశ్యాముండు,
మృగరాజ సత్వశాలి, మణి
కుండలుడు రత్నమంజీరు,
డచ్యుతు నంశాంశసంభవుం,
డమల మూర్తి,
భూరియాగ భాగభోక్త, ధన్వన్తరి
యనగ నమృత కలశ హస్తుడగుచు,
నిఖిల వైద్య శాస్త్ర నిపుణు, డా
యుర్వేది,
వేల్పు వజ్జ, గడలి వెడలివచ్చె.

ధన్వంతరి యీ విధముగ పాలకడలి నుండి వెడలివచ్చెను అదిచూచి వేల్పు వర్గము "చావులేని మందు చక్కగ మనకబ్బెననుచు"ఆనందించినారు అంతటితో నిశ్రీకమైయున్న లోకము ధన సమృద్ధమైపోయినది. వర్షములు కురిసినవి. పంచభూతములు తేజోవంతమైనవి. గ్రహములు తమ కర్తవ్యమును నిర్ణయించుకొని బాధ్యతను నిర్వహించినవి. మహర్షులు యజ్ఞయాగములుచేయ సమర్థత కల్గియుండిరి. దేవతలకు అమృతత్వము లభించినది. ప్రపంచమున తాండవించుచున్న మృత్యుదేవత పలాయన మైనది

ఇట్టి ధన్వంతరి లోకమునకు అమృతత్వమును కల్గించినందువల్ల మనకు పూజనీయుడైనాడు. ఈధన్వంతరి ఉద్భవించినది కార్తీక బహుళ త్రయోదశి, గురువారం హస్తా నక్షత్రమున ఆశ్వయుజ మాసమనే వాదముకూడా కలదు. కాని ఆనాటికి ఉచ్చైశ్రవమే పుట్టలేదు. పెద్దలు యీకాలమును కార్తీక బహుళమనే నిర్ణయించిరి కార్తీక బహుళమని నిర్ణయించుటకు, చాలా కారణములు ఋజువు చేయుచున్నవి

ఈ కాలమునుగూర్చి వాగ్భటమున యమదంష్ట్రాకాలమని నిర్ణయము చేయ బడినది. అట్టి దేవతలే ఆ కాలమున అట్టి బాధలకు లోనైరనుట వల్ల నేటి మానవులు ఎంతటి బాధలకు లోనగుదురో విచారించండి జగమంత యీ కాలమున కధీనమైనది. మంచి చెడ్డ లన్నిటికి కాలమే కారణము. కావున పురుషుడు కాలమువలన కల్గుచున్నాడు అట్టి పురుషునకు కాలము వలననే రోగములు కల్గుచున్నవి. కాన రోగములకు మూలకారణము కాలమే యగును,అని చరకులు చెప్పియున్నారు. శరద్రుతువులోని సగకాలము యమదంష్ట్రాకాలము. యమదంష్ట్రాకాలమును గూర్చి శాస్త్రమున

కార్తిక్యామపరః పక్షో మార్గశీర్ష
స్యచాదిమః
ద్వావేతౌ యమదంష్ట్రాఖ్యౌ మితా
హారస్స జీవతి॥

అని భోజమహారాజుల వారు కాలమును గూర్చి యమదంష్ట్రా స్వరూప నిర్ణయంచేసి యున్నారు దీనినే వాగ్భటాచార్యులు శాహాటమున యిట్లు చెప్పిరి

కార్తికస్యాంతిమః పక్షః మార్గ
శీర్షస్య చాదిమః
యమదంష్ట్రా సమాఖ్యాతా అల్పా
శీ తత్ర జీవతి.

అని భోజులను అనుసరించి యమదంష్ట్రా కాలనిర్ణయం చేసినారు నవీన సంహితాకారులు బాల్యత్రయములోని ఒకరు అయిన శార్ఙ్గధరులు కూడా

కార్తికస్యది నాన్యష్టా వష్టావా
గ్రహణ స్యచ
యమదంష్ట్రా సమాఖ్యాతా స్వల్పా
భుక్తోహి జీవతి.

అని కార్తీక బహుళంలోని చివర ఎనిమిది దినములు మార్గశీర్షములోని మొదటి ఎనిమిది రోజులు కలిసి ఒక పక్షకాలమే యమదంష్ట్రా కాలమని మతభేదమును చెప్పియున్నారు.

అసలు యీ యమదంష్ట్రలనగా నేమి? అని విచారించితే తేలిన విషయమేమన కార్తీక మార్గశిర మాసముల లోని యీ కాలము శరత్ హేమంత ఋతువులకు సంధికాలము ఈ సమయమున భూమియందలి వర్షపు తేమ ఆరీ ఆరక యుండును. మంచు కురియుట ఆరంభించును. మంచు తేమల రెంటి కలయికవల్ల రాత్రులయందుగాలి అతి చల్లనై శరత్కాలమున ప్రకోపము నందిన పిత్తమును క్షయము నొందించును కఫము, చయము (వ్యాప్తి) నందుటయు జరుగును ఈ కాలమునందు పిత్తకఫముల క్షయచయసంధియు ఏర్పడును అందువలన జనులకు పిత్తకఫ దోషములకు సంబంధించిన వ్యాధులు తరచుగ సంభవించును ఈ కాలమున తరచుగ జ్వరము, విషమ జ్వరము, సన్నిపాత జ్వరము, అగ్నిమాంద్యము, మలేరియా జ్వరములు, దగ్గులు విశేషముగా ప్రకోపమునంది వ్యాపించును. జ్వరము కల్గుటకు యీ కాలము చాలా అదనుగా నుండును కాబట్టి యీ కాలము మృత్యుపదముగా నెంచుట చేత ప్రాచీనులు దానిని యమదంష్ట్రా కాలమని పేర్కొనిరి. యమదంష్ట్రలనగా యముని కోఱలు

మార్గశిర పూర్ణిమను కోఱల పూర్ణిమయని జనము వాకొనుచున్నారు ఈ కాలమున సంజురోగము మూలవ్యాధి, కామెర్లు మొదలగు దీర్ఘవ్యాధులు కూడా ప్రచండముగా జనులను బాధించి మారక కారణము లగుచున్నవి చిత్త కార్తెనుండీ సంజురోగులకు మారక దినములని జనవాక్యం. ఆరోగ్యము జాగ్రత్తగా కాపాడుకొనవలెనని పల్లెపట్టుల లోని పాటకపు జనముకూడా ప్రసిద్ధముగా చెప్పుకొందురు ఈ కాలమున జీర్ణశక్తి క్షీణించుటవల్లనే అనేక రోగములు పుట్టుచున్నవి యీ ప్రమాదము నుండి తప్పించుకొనుటకు "అల్పాశనమే" ముఖ్యకర్తవ్యమని పైముగ్గురు

శాస్త్రకారులు పేర్కొన్నారు. ఈ కాలమున పగలు చాలా తక్కువ, రాత్రి కాలము చాలా హెచ్చుఅయియున్నది ఈ కాలమున పగలు ఆహారము మాని రాత్రి భోజనము చేయుట ప్రశస్తము. అట్లతద్దెనుండియే పిల్లలకు పగలు ఆహారము మాన్పుట అలవాటు చేశారు తెల్లవారుఝామున చద్దికుడిపించి 'పగ లెల్లను అన్నము తినకూడదు. ముసలి మొగుడు వస్తాడ'ని పసికాయలను ఝడిపించి ఉపవాసాలు అలవాటు చేయించారు. పిమ్మట నాగులచవితినాడు పుట్టలో పాలుపోసి ఉపవాస ముండి మర్నాడు నాగపూజచేసి భుజించవలయునని ఉపవాసాన్ని పరిచయం చేశారు. ఆనాడు కూర తరిగితే నాగుబామును తరిగినట్లని, పిల్లలనే తరుగుతున్నట్లని పాటకపు జనం చెప్పుకుంటూంటారు కార్తీక మాసంలో పగలు భోజనంమాని సాయంత్రం ఈశ్వరాలయమునకు వెళ్ళి మృత్యుంజయ జప మొనర్చి అభిషేకము చేసి వచ్చి పిమ్మట భోజనం చేయటం చాలామందికి అలవాటు దీనిని నక్తము అని అంటారు ఈ కాలములో అల్పాశనమే శరణ్యమని పై శాస్త్రకారులు చెప్పియున్నారుగదా! కొందరు బహు కొద్దిగా ఆహారము తీసుకొనుట కూడా కలదు ఈ ఆచారమే మహమ్మదీయులు కూడా ఒకనెలలో పాటిస్తున్నారు లఘుభోజనమే అల్పాశనమని, లంఘనమని చెప్పబడినది. లఘుభోజనము ఆమహారమై పిత్తమును ప్రకోపింపజేయుట లోకవిదితము అందువలననే వాగ్భటాచార్యులవారు 'అల్పాశీతత్ర జీవతి' అని చెప్పియున్నారు.

హిందూ ధర్మము ఏ ధర్మమును ప్రతిపాదించినను ఆధ్యాత్మికమునకు లంకె వైచుట ఆచారమైయున్నది. కార్తీకమున పగలెల్ల తపస్సు, యోగాభ్యాసము చేసుకొని రాత్రి భుజించిన మోక్షము కల్గునని ధర్మశాస్త్రముల చెప్పియున్నారు ఇటులచేసిన ఆరోగ్యము వృద్ధిచెంది ఎక్కువ కాలము సుఖముగ జీవించుటకు ఆకరమగును. యమదంష్ట్రలనుండి విముక్తుడు కాగలడు అని చెప్పిరి.

ఇట్టి యమదంష్ట్రాకాలమున ధన్వంతరీ ప్రాదుర్భావము జరిగినది ధన్వంతరి అమృతమును తెచ్చి దేవతలకు ప్రసాదించెను. మనము నేడు ధన్వంతరిని పూజించి మృత్యుప్రదమైన యీ కాలమును గడిపి అమృతత్వమును పొందవలెనని సంకల్పము. అందుకొరకుచేయునదే యీ ధన్వంతరి జయంతి

మార్గశిర పూర్ణిమనాడు కోటల పూర్ణిమ అని చెప్పియున్నాను. మృత్యుముఖమునుండి రక్షింపబడినట్లుగా భావించి యముని కోటకు బలిగా రొట్టెలను చేసి కుక్కలకువేయుట ఆచారమైనది ఈ కోటల పూర్ణిమ వ్రతమును పల్లెలలో శూద్రులే ఎక్కువగా ఆచరిస్తున్నారు తదితర బ్రాహ్మణాదివర్ణముల వారికి దీని పట్టింపు అంతగా పరిగణించనట్లున్నది. ఈ దినమున కుక్కలకు రొట్టెతినిపించుట యేమి? అని సందేహింపవచ్చును. యముని యొక్క ప్రతిరూపము కుక్క (కాలభైరవుడు). కుక్క

వే ద ము లు

న్యాయ, సాహిత్య విద్యా ప్రవీణ, శ్రీ దూళిపాళ రామచంద్రశాస్త్రి

౧

వే ద ల క్ష ణ ము:

శ్లో॥ ప్రత్యక్షేణాను మిత్యావాయ స్తూపాయోన బుద్ధ్యతే
ఏనం విదంతి వేదేన తస్మాద్వేదస్య వేదతా॥

ప్రత్యక్షానుమాన ప్రమాణములకు గోచరము గాని అలౌకికమగు ఉపాయమును బోధించు గ్రంథము వేదమని భావము

"ఇష్టప్రాప్త్య నిష్టపరిహారయో రలౌకికము పాయం యో గ్రంధో వేదయతి సవేదః"అను వ్యుత్పత్తిచే ఇష్టప్రాప్త్య నిష్టపరిహారములకు సాధనమగు లోకానవగతమగు ఉపాయమును బోధించుటచే ఈ గ్రంధమునకు వేదమను వ్యవహారము సముచితమై యున్నది-ఈ ఉపాయము ధర్మము- ఈ ధర్మమును వేదమునుండి తెలుసుకొని ఆచరించినయడల మానవులు అభివృద్ధిని, శ్రేయస్సును, పొందుదురు గనుకనే "అభ్యుదయ నిశ్రేయస సాధనం ధర్మః" అని కణాదుడు చెప్పియున్నాడు

ఈ ధర్మము ప్రవృత్తి సాధన మనియు, నివృత్తి సాధనమనియు, ద్వివిధమై యున్నది ప్రవృత్తి ధర్మము మోక్షమునకు సాక్షాత్సాధనము కానేరదు

"తమేవం విద్వానమృత ఇహ భవతి. నాన్యఃపంధా విద్యతేఽయనాయ" జ్ఞానమువలననే మోక్షము కలుగుననియు, మోక్షమునకు జ్ఞానముకంటె వేరు మార్గము లేదనియు శ్రుతు లుద్ఘోషించుచున్నవి మరియు ఈ ప్రవృత్తిధర్మము ఫలాభిసంధిని వదలి చేయునెడల క్రమక్రమముగ సాధన చతుష్టయమును పొంది ఆత్మజ్ఞాన ప్రాప్తికి అర్హత కలుగును. తరువాత నివృత్తి ధర్మమున కధికారియగును

నివృత్తిధర్మము. చిత్తశుద్ధిని కలుగజేసి నిశ్రేయససాధనమగు జ్ఞానమునకు అవకాశము కలుగజేయును నిశ్శ్రేయసమనగా మోక్షసుఖము. నిరతిశయ నిరవధికా ఖండానందరసస్వరూపము. దానికి నాశములేదు- అచట దుఃఖలేశమునకు గూడ అవకాశములేదు ఇదియే సమస్త జనులకు అవశ్యము, ఆకాంక్షణీయముఅగుటచే పరమపురుషార్ధ మనబడుచున్నది దీనికిని వృత్తిధర్మము పరంపరసాధనమగును. ప్రవృత్తిధర్మము గూడ ఇందు వ్యవహిత పరంపరముగ సాధనమగును. ధర్మమునకు అదృష్టమని తార్కిక వ్యవహారము. అదృష్టమనగా అతీంద్రియ మనియర్ధము. కావున ప్రత్యక్షముగాని ప్రత్యక్షోపజీవ్యమగు అనుమాన ప్రమాణముగాని ఈ ధర్మమును తెలుసుకొనుటకు సాధనముకాదు. గనుక ఈ ధర్మమును తెలిసుకొనుటకు అపౌరుషేయము, పరమేశ్వర ప్రసాదలబ్ధము అగు వేదమే పరమసాధనమని బుద్ధిమంతుల విశ్వాసము ఇట్టి ధర్మము కాలవశముచే పరాజితమగుటయు, తన్మూలమున వేదముల యందు జనులు శ్రద్ధలేని వారగుటయు, ఆసమయమున శ్రీపరమేశ్వరు డవతరించి దుష్టశిక్షణమును శిష్టపరిపాలనమును నొనర్చి వేదమార్గమును యధా పూర్వముగ పునరుద్ధరించుటయు, శాస్త్రములయందు బాగుగ జెప్పబడి యున్నది

యదాయదాహి ధర్మస్యగ్లా నిర్భవతిభారత
అభ్యుత్థాన మధర్మస్యతదాఽత్మానం
సృజామ్యహమ్॥

పైన వివరింపబడిన ద్వివిధములగు ధర్మములను బోధించుటచే వేదము ప్రమాణమని కణాదులు వైశేషిక సూత్రములలో చెప్పియున్నారు, 'తద్వచనాచ్చాగమప్రామాణ్యం' అతీంద్రియమగు ధర్మమును బోధించుటచేతనే ఈవేదము ప్రమాణమని తాత్పర్యము. ఇట్లుండగ వేదములో ఎచ్చటనైనను, ఇంద్రియ గోచరములగు విషయములనుగూర్చి వివరించు ప్రస్తావములున్నను అభాగము అర్ధవాదములనియు, వానికి స్వార్ధమునతాత్పర్యము లేద

కోఅలకు కొట్టి బలిగా యిచ్చిన యమ ధర్మరాజు తృప్తిపడి మనలను మృత్యు ముఖమునుండి వదలి వెళ్ళునని నమ్మకము ఆ నమ్మకమే కోఅల పూర్ణిమ వ్రతమును ఆచరింపజేయుచున్నది.

అరయఁగ సర్వజనౌఘ నాశకములై
యత్యంతఘోరములై
పరమవ్యాధి కరములయ్యు కడు
శోభాస్ఫూర్తినొప్పారి శాం
కరికిం బ్రీతి కరములై మిగుల
వేడ్కల్ జేయులోకాళికిన్
శరదారంభ వసంతముల్ శమన
దంష్ట్రాప్రాయముల్ భూవరా!

అని భారతము చెపుతోంది.

★

నియు, విధివాక్యబోధితమగు అతీంద్రియ మగు ధర్మమును బోధించుటయే అభాగము లకు పరంపరగ లక్ష్యమనియు, వాటిని ఒట్టి వేదమునకు అప్రామాణ్యము సంభవించ దనియు, తంత్రజ్ఞులు విమర్శించి సిద్ధాంతము జేసియున్నారు కావున ఈ ధర్మము వేదైక సమధిగమ్యమనిసిద్ధాంతముఇందుకుప్రమాణము

గౌ. ధ. సూ॥ వేదోఽఖిలో ధర్మమూలమ్.
తద్విదాంచ స్మృతిశీలే॥

ఈ వేదములు పురుష ప్రణీతములుగావు-పౌరుషేయములైన యెడల పురుషబుద్ధి నాశ్ర యించిన భ్రమ, ప్రమాదాదిదోషములు వేద మందు ప్రవేశించుట కవకాశముకలుగును. అట్లైనచో సాకల్యముగ వేదమునకు ప్రామా ణ్యము సిద్ధింపనేరదు. మరియు, పౌరుషేయ ములెనిచో, భారత, రామాయణాదులకు వలె కర్త స్మరణీయుడై యుండవలెను. అవిధ ముగ వేదమును గురించిన కర్త ఎచటను గోచరించుటలేదు. కారకము తైత్తిరీయము, మున్నగు వేదభాగములకు గల వ్యవహారము లను బట్టి కరాదిమునులు వేదములకు కర్త లుగా భావింపబడుదురను వాదమున్నను అవ్యవ హారములకు కరాదిమునులు, ఆయావేద భాగ ములకు ఉపదేశకులని భావముగాని కర్తలని తాత్పర్యముగాదనియు సప్రమాణముగ ఈవిష యము నుపపాదించి మీమాంసకులు వేదము లపౌరుషేయములనినిరూపించియున్నారు,కావు ననే పరాశరస్మృతియందు

శ్లో. నకశ్చిద్వేద కర్తాఽస్తి వేదంస్మృత్వా
చతుర్ముఖః
తథైవధర్మాన్ స్మరతిమనుః కల్పాంత
రేంతరే॥

వేదములకు కర్తగానరాడు - చతుర్ముఖుడు వేదములను స్మరించి ధర్మము నుపదేశించును. ఆవిధముగనే, ప్రతి కల్పమందును మనువు వేదముఖమున ధర్మమును తెలిసికొని తానుప దేశించును కావున వేదము అపౌరుషేయమని పరాశరుడు చెప్పియున్నాడు.

నైయ్యాయికులు ఆప్తోచ్చరితమగు వాక్య మంతయు ప్రమాణమని జెప్పెదరు కావున వేదమునకు సంపూర్ణమగు ప్రామాణ్యమును సాధించుటకై వేదములు ఈశ్వరకర్తృకము లని నిరూపించిరి ఈశ్వరునియందు భ్రమ ప్రమాదాదిదోషము లుండవు. గనుక తత్క ర్తృకములగు వేదములయందును ఆదోషము లుండవుగావున నిఖిలవేదము ప్రమాణములని భావము వేదములు ఈశ్వరోచ్చరితములనుటలో నైయ్యాయికులు 'తస్మాద్యజ్ఞాత్సర్వ హోతః ఋచస్సామానిజజ్ఞిరే ఛందాగ్ంసి జజ్ఞిరే తస్మాత్। యజుస్తస్మాదజాయత' ఋక్కులు సామములు యజుస్సులు విరాట్పురుషునివలన పుట్టినవని తాత్పర్యముగల ఈ పురుష సూక్త మందలి వాక్యములను ప్రమాణముగ నిరూ పించెదరు

అపౌరుషేయములు వేదములని జెప్పు మీమాంసకులు, వేదములు పరమేశ్వరునివలన అభివ్యక్తములైనవి గాని, రచింపబడలేదని స్పష్టముగ నిశ్చయించిరి. పైన ఉదహరింప బడిన పురుషసూక్తమునకు గూడ వేదములు పరమేశ్వరుని వలన అభివ్యక్తములైనవనియే గాని ఉత్పన్నములైనవి కావని భావమును అపౌరుషేయవాదులు వర్ణించెదరు ఈ విధ ముగ వేదములు పౌరుషేయములా? లేక అపౌరుషేయములా? అనుటలో శాస్త్రకారుల అభిప్రాయములు భిన్నభిన్నముగా ఉన్నను, ఉభయమతముల యందును వేదములు సంపూర్ణముగ ప్రమాణములను యంశము సప్రమాణముగను సయుక్తికముగను నిర్ణ యింపబడినది, ఇట్టి వాదములను విమర్శించి కొందరు శాస్త్రకారులు, అచటచట తమ అభి ప్రాయములను గూడ నిర్ణయించియున్నారు. అందుకు ఉదాహరణము దిఙ్మాత్రముగ ఇచట నిరూపింపబడుచున్నది.

"నకశ్చిద్వేదకర్తాఽస్తి వేదంస్మృత్వా
చతుర్ముఖః"

అను పరాశర వాక్యమునకు వ్యాఖ్యానము చేయు ప్రస్తావమున శ్రీ మాధవాచార్యులవారు

తమ అభిప్రాయమును ఈ విధముగ వివరించి యున్నారు.

"నతావద్వ్యాసోవేదకర్తా- తస్యవిభాగ మాత్రకారిత్వాత్.నాఽపిచతుర్ముఖః ఈశ్వరేణ చతుర్ముఖాయ వేదప్రదానాత్ ఇతరేషాం కర్తృత్వందూరాపాస్తమ్"

"అతఃకాళిదాసాదిగ్రంథేష్వివవేదేషుఅర్థావబోధపూర్వికాయాః పదవిశేషావాపోద్వాపాభ్యాం ప్రవృత్తాయా వాక్యరచనాయా అభావాదపౌరుషేయత్వం యుక్తమ్॥"

కాళిదాసాది గ్రంథముల కన్న విలక్షణమగు వాక్యరచనతో గూడి యున్నందున వేదములు అపౌరుషేయములని భావము- ఇటులనే పౌరుషేయత్వమును నిరూపించు ప్రమాణములను పౌరుషేయవాదులో చెప్పుదురు గాని అందరి మతముల యందును వేదములు ప్రమాణగ్రంథములైనవను విషయము నిర్వివాదము

★

STATEMENT ABOUT OWNERSHIP & OTHER PARTICULARS ABOUT

NAVA-BHARATHI

A Literary & Cultural Telugu Monthly

Form VI (See Rule 8). The Registration of News-Papers (Central) Rules, 1956.

1. Place of Publication	Gandhinagar, Vijayawada-2.
2. Periodicity of its Publication	First week of Every month.
3 Printer's Name	Sri J Radhakrishna Reddy
Nationality Indian	Address Vijayawada.
4. Publisher's Name	Sri J Radhakrishna Reddy
Nationality Indian	Address Vijayawada
5. Editor's Name	Sri J. Radhakrishna Reddy
Nationlity Indian	Address Vijayawada.

6 Names and Addresses of Individuals who own the News-Paper and Partners or Share - holders, holding more than one per-cent of the total capital

Names	Addresses
Sri CHADALAVADA PITCHAYYA	VIJAYAWADA
Sri J RADHAKRISANA REDDY	VIJAYAWADA

I, J. Radhakrishna Reddy, here by declare that the particulars given above are true to the best of my knowledge and belief

J. Radhakrishna Reddy
Signature of Publisher

1 - 12 - 1958

ద్రవ్యము - దాని ఉనికి

బెర్ట్రండ్ రసెల్

అనువాదం: జి. ఎస్. ఎన్.

౩

మనుష్యుల పరిస్థితితో పోల్చి చూచినపుడు పిల్లికి సంబంధించిన సమస్య యేమంత క్లిష్టమైనదిగాదు మనుష్యులు మాట్లాడునపుడు, తత్ఫలితముగ, కొన్ని యభిప్రాయములతో సంబంధించి యున్నట్లు మనము భావించెడి ధ్వనులను మనము వినునపుడు వెనువెంటనే కొన్ని ముఖభంగిమలను, పెదవుల సంచలనములను మనము గాంచునపుడు, మనము వినునది యొక భావమునకు నభివ్యక్తి(expression) కాదని చెప్పుట కష్టము. ఏలన మనముగూడ నవే ధ్వనులను జేసినచో నితరులకుగూడ నట్టి యనుభవములే గల్గుచుండుట ప్రసిద్ధము. స్వప్నములో నిట్టి సంఘటనలు జరుగుచుండుట నిజమే. కాని యచ్చట మనకతిరిక్తముగా నితరులున్నారని యనుకొనుట భ్రాన్తి కాని స్వప్నములను జాగ్రజ్జీవనమని మనము వ్యవహరించెడి దానిని బట్టి కొంత వ్యాఖ్యానింపవచ్చును నిజముగా భౌతికమగు ప్రపంచమొకటి గలదని మనము విశ్వసించినచో వైజ్ఞానిక సిద్ధాన్తములను బట్టి స్వప్నములను వివరింపవీలగును

కావున మనకంటెను, మన యింద్రియార్థములకంటెను నతిరిక్తములైనవస్తువులున్నవనియు మనము చూచుటపై వానియునికి యాధారపడి యుండలేదను సర్వసామాన్యమగు నభిప్రాయమునే ప్రతిలాఘవ సిద్ధాన్తము (Principle of simplicity) సమర్థించును.

స్వతంత్రమగు బాహ్య ప్రపంచమును విశ్వసింప గల్గుటయనునది హేతువాదమును బట్టి సాధ్యముగాదన్న మాటనిజమే మనమొకింత మననము జేసికొనుసరికి నీవిశ్వాసము మనలో జీర్ణించి పోయినట్లు మనకు తెల్లమగును, ఈ విశ్వాసమును సామాన్య పరిస్థితులలో మనము శంకించి యుండెడి వారముగాము. దృష్టివిషయమున ఇంద్రియార్థమే భౌతిక వస్తువని విశ్వసింప బడుచున్నట్లు తోచుచున్నది కాని భౌతిక వస్తువును, ఇంద్రియార్థమును ఒక్కటి గాదని హేతువాదము నిరూపించుచున్నది ఈ పరిశోధనము శబ్దస్పర్శ ఘ్రాణముల విషయమున నెట్టి సమస్యను బయలుదేరదీయుటలేదు. ఇది మన యింద్రియార్థముల కతిరిక్తముగా భౌతిక వస్తువులుగలవను విశ్వాసమున కెట్టి క్షతిని గల్గించుటలేదు. ఈ విశ్వాసమెట్టి చిక్కులకు త్రోవదీయక మన యనుభవ కథనములను సమన్వయింప జూచుటచే దానిని తిరస్కరించుట కెట్టి హేతువును గానరాదు స్వప్నముల వలన గలిగిన సందేహముల నావలకు నెట్టి, బాహ్యప్రపంచ మొకటిగలదనియు, మనము దానిని జూచినను జూడకున్నను దానియునికికి నెట్టి భంగమును ఉండబోదనియు మనమంగీకరింపవచ్చును

ఈ నిగమనమునకు త్రోవదీయు నుపపత్తి నిస్సంశయముగా మనము ప్రతిపాదించుటకు వీలగునంత బలముగలేదు. కాని యనేక తాత్త్వికములగు నుపపత్తులలో నీదౌర్బల్యము గోచరించును కాన దాని సామాన్య లక్షణములను, సామంజస్యమును సంగ్రహముగ పర్యాలోచించట యవసరము సర్వజ్ఞానమును మన సహజ సిద్ధమగు విశ్వాసముపై నిర్మితము కావలెను వీనిని త్రోసిరాజనినచో మనకింక మిగులున దేమియును లేదు. కాని మన సహజసిద్ధములగు విశ్వాసములలో కొన్ని మిగిలిన వానికన్న మివుల శక్తివంతమైనవి కాని వానిలో ననేకములు, సహజసిద్ధములు కాని తదితర విశ్వాసములతో కలగలుపు నొందినవి. తత్ఫలితముగ నవిగూడ

సహజ విశ్వాసములుగ నలువురలో చెలామణి యగుట కాస్కారమైనది

మన మవలంబించు విశ్వాసములతో నారంభించి, వానిని వేర్వేరుగ విడదీసి కలగలుపులకు నెడమీయక- మనకు గల సహజ విశ్వాసముల క్రమపరంపరను తత్త్వశాస్త్రము నిర్దేశింపవలెను మన విశ్వాసములు- తుదకు ప్రతిపాదింపబడు రూపములో పరస్పరవైరుధ్యము లేక యొక సమన్వయాత్మకమగు విధానముగ రూపొందవలెను ఇంకొకదానితో వైరుధ్యమేర్పడినపుడు తప్ప సామాన్యముగ సహజసిద్ధములగు విశ్వాసమును గాదనుటకు వీలు లేదు కావున వానికి సమన్వయము గుదిరినచో విధానమంతయు నంగీకార్యమగును.

మన విశ్వాసములలో నన్నిగాని కొన్నిగాని పొరబాటుకావచ్చును కాన వీనియన్నింటి విషయమున కొన్ని సంశయచ్ఛాయల కాస్కారము లేకపోలేదు. కాని యొక విశ్వాసము యధార్థమగునా కాదా యనునది మరియొక విశ్వాసమును బట్టియే యెఱుంగవలెను మఱి యింకొకమార్గము లేదు. కాని మన సహజసిద్ధములగు విశ్వాసములను (instinctive beliefs) వాని పరిణామములను సంయోజన మొనర్చి- వానిలోనేది యంగీకరించుటకు యోగ్యమైనదో పర్యాలోచించి, అవసరమైనచో కొన్నింటిని పరిత్యజించుటయో మార్చుటయో యొనర్చి- మనము సహజముగ విశ్వసించిన దానిని నాధారముగ గొని మన జ్ఞానమును క్రమబద్ధమొనరింప గలము. ఇందు గూడ పొరబాటున కాస్కారము లేకపోలేదు, కాని యంగ ప్రత్యంగముల సమన్వయము వలనను, సవిమర్శమగు ననుశీలనమువలనను నిందు దోషమునకు నవకాశము తక్కువ

అథమ మీపనియైనను తత్త్వశాస్త్రము నిర్వహింపగలదు. యధార్థముగనో అయధార్థముగనో తత్త్వశాస్త్రమింతకంటె ఘనకార్యములు సాధించుననియును, ప్రపంచమునకు సంబంధించిన యనితర సాధ్యమైన జ్ఞానమును సమకూర్చుననియును పరతత్త్వమును గూర్చిన రహస్యమును మనకు విప్పిచెప్పగల్గుననియును తచ్ఛాస్త్రజ్ఞులు నుడువుచున్నారు. ఇది నిజమైనను, గాకున్నను, మనముదహరించిన యతి సామాన్యమగు నీవిధిని తత్త్వశాస్త్రము నిర్వహింపగల్గును లోకజ్ఞానము నందలి యౌచిత్యమును శంకింప నారంభించి తత్త్వశాస్త్ర సమస్యలలో గోచరించు చిక్కులను పరిష్కరింప నెంచు వారికిట్టిపని నిక్కముగా సరిపోవును

ద్రవ్యము - దానిస్వభావము

వెనుకటి యధ్యాయమున - అనుభవపూర్వకములగు నుపపత్తుల నారయ జాలకపోయినను- బల్లతో గలసియున్నట్లు మనము భావించెడి యింద్రియార్థములు- మనకును మన ప్రత్యక్షానుభవములకును నతిరిక్తమైన పదార్థమొకటి యున్నదనుట సహేతుకమే యని మన మంగీకరించితిమి అనగా నాకు బల్ల యున్నదని తెల్పు శబ్దస్పర్శరూప జ్ఞానముల కతిరిక్తముగా నొక పదార్థము గలదనియు, ఇవి వానికాభాసములనియు నేనంగీకరింతును. నా కన్నులను మూసినచో, రంగు ఉనికికి విచ్ఛేదము గలుగును నాముంజేతిని బల్లతోడి సంసర్గమునుండి తొలగించినచో, గట్టితన మనెడి స్పర్శసంబంధియగు జ్ఞానము గలుగకుండ బోవును బల్లను మణికట్లతో గొట్టుట మానివైచినచో నెట్టి చప్పుడగుటకును ఆస్కారము లేదు కాని యివియేమియును నేను చేయనపుడసలు బల్లయే యుండదని నేను నమ్మను. అట్లుగాక నేను తిరిగి కన్నులను దెరచి, చేతిని బల్లపైనుంచి, మణికట్లతోదానిని దట్ట నారంభించినచో, వెనుకటి యింద్రియార్థములన్నియు పునరనుభూతములగును. ఈ యధ్యాయమున మనము విచారంపవలసిన సమస్య యిది. నేను చూచినను చూడకున్నను నిలిచియుండు ఈనిజమైన బల్ల స్వభావమేమి?

ఈ ప్రశ్నమునకు భౌతికశాస్త్ర మొకసమాధానము చెప్పుచున్నది అది యసంపూర్ణమైనను, కొంత యుహతోగూడు కొనినదైనను మన మన్నలనందు కొనదగి యున్నది. తెలిసియో, తెలియకయో, భౌతిక శాస్త్రము-ప్రకృతి గోచరములగు విషయములనన్నిటిని (phenomena) కొన్నిచలనముల క్రింద సంక్షే

పింప వచ్చునను నభిప్రాయము నేర్పరచుకొను స్థితికి వచ్చినది. కాంతి, ఉష్ణత, ధ్వని-ఈమూడును తరంగ సంచలనముల వలననే గలుగుచున్నవి. ఈతరంగ సంచలనములు వానిని ప్రసరింపజేయు వస్తువు నుండి కాంతిని జూచు వ్యక్తి యొద్దకుగాని, ఉష్ణత ననుభవించు వాని యొద్దకుగాని, ధ్వనిని వినువాని సమీపమునకు గాని పయనించును. ఈతరంగ సంచలనముల కునికిపట్టు ఆకాశమో, స్థూలద్రవ్యమోయయి యుండును. కాని యెట్టి పరిస్థితులలో నైనను దానినితత్త్వ శాస్త్రవేత్త ద్రవ్యమనియే వ్యవహరించును. ప్రకృతి శాస్త్రము దానికి నిర్దేశించు ధర్మములు రెండే. అవి ప్రదేశములో నునికి, గతిసూత్రముల ననుసరించి చలించు సామర్థ్యము దాని కితరలక్షణము లున్నవను విషయమును ప్రకృతి శాస్త్రముగాదనదు కాని. యట్టి లక్షణములున్నను నవి ప్రకృతి శాస్త్రవేత్త కంతగానుపకరింపవు-ప్రకృతి గోచరములగు విషయములను వివరించుటలో నెంతమాత్రము పకరింపవు.

ఒక్కొక్కప్పుడు కాంతియనగా నొకవిధమగు తరంగసంచలనము (Wave motion)ని చెప్పుట కద్దు. కాని యట్లుచెప్పుట ఉన్న విషయములను తప్పుద్రోవలకు బట్టించుట. ఏలన మనకు వెంటనే యింద్రియములద్వారా గోచరించుకాంతి యొకవిధమగు తరంగ సంచలనమని చెప్ప వీలులేదు. కాంతికిని తరంగసంచలనమునకును వ్యత్యాసము గలదు. కాంతి యనగా గ్రుడ్డివారము కానిచో మన కందఱకును దెలియునట్టిది. అయినను మనకు దెలిసిన వస్తు సంబంధియగు జ్ఞానమును కన్నులులేని యితరులకు వాక్కుద్వారా వర్ణించి చెప్ప రానిది. కాని తరంగసంచలనము విషయము వేఱు. స్పర్శజ్ఞానముద్వారా దేశ గతమగు (Spatial) జ్ఞానము సాధ్యమేగనుక తరంగ సంచలనమన్ననేమో గ్రుడ్డివానికి తెలియజెప్పుటకు వీలున్నది. సముద్రముపై పయనించునపుడు గ్రుడ్డివానికి తరంగసంచలనమన్ననేమో అనుభవముద్వారా తెలియుట కవకాశమున్నది. కాని గ్రుడ్డివాని కవగతమగుటకు నాస్కారము గలదీనిని మాత్రము మేము కాంతియని చెప్పుటలేదు మరి కాంతియనగా గ్రుడ్డివానికెన్నడు నవగతమగుటకు వీలులేనిది. మనము వానికెన్నడును వర్ణించి చెప్పజాలనిది.

గ్రుడ్డివారము కాని మన కందఱకును నవగతమగు నీ పదార్థము- ప్రకృతిశాస్త్రము ననుసరించి బాహ్యప్రపంచమున గోచరమగునది గాదు. మరియది దానిని (కాంతిని) జూచు వ్యక్తి కన్నులు, నరములు, మేదస్సుపై కొన్ని తరంగముల వ్యాపారముచే నేర్పడుచున్నది. కాంతియనగా తరంగములే యని చెప్పుచున్నామనగా కాంతినిగూర్చిన జ్ఞానమునకు తరంగములు భౌతికకారణమని యర్థము. గాని చూడగల్గినవారి కవగతమగునదియును, గ్రుడ్డివారికి నవగతము కాజాలనిదియును నగు నీకాంతి-మనకును, మన యింద్రియములకును నతిరిక్తముగానున్న ప్రపంచములో భాగమని ప్రకృతిశాస్త్రము భావించుటలేదు. తదితరములకు నింద్రియ గ్రహణములపట్ల గూడ నైవిషయములే యన్వయించును.

వైజ్ఞానిక ప్రపంచమున లేనివి కేవలము రూపములు ధ్వనులేగాదు. దృక్కుద్వారా, స్పర్శద్వారా అనుభూతమగు దేశము(Space) గూడ నందు లేదు. ద్రవ్యమొకదేశములో నుండుట యనునది ప్రకృతిశాస్త్రమునకు చాల ముఖ్యము. కాని యదియున్న దేశమును మనముచూచి స్పర్శద్వారా అనుభవమునకు దెచ్చుకొను దేశమును ఒక్కటిగాదు. తొలుత మనము దృగింద్రియముద్వారా అనుభవగోచరమగు దేశమును స్పర్శేంద్రియముద్వారా అనుభవ గోచరమగు దేశమును ఒక్కటిగాదు, మనము చూచిన వస్తువులను స్పృశించుట యనునది మనము చిన్నతనముననే నేర్చుకొందుము. అంతియగాక మనకు స్పర్శద్వారా అనుభూతమగు వస్తువులను కంటిద్వారాజూచి యవగతము జేసికొనుటచిన్నతనముననే యలవరచుకొందుము. కాని ప్రకృతిశాస్త్ర సిద్ధమగు దేశము రూపస్పర్శములచే ననుభూతములగు దేశములకు సంబంధింపక ప్రత్యేకమై యొప్పును. కాని దానిని స్పర్శానుభూతమగు దేశ

మని గాని దృగ్గోచరమగు దేశమనిగాని చెప్ప వీలులేదు

అంతియగాక వేర్వేరువురు ఒకే వస్తువును వేర్వేరు రూపములో జూతురు. ఉదాహరణమునకు గుండ్రముగా నుండు నాణెమును గుండ్రనిదిగనే మనము నిర్ణయింపవలసి యున్నను. మనము దానికి పూర్తిగా ఎదురుగా నున్ననే యది గుండ్రముగ నుండును లేనిచో నది కోడిగ్రుడ్డు ఆకారమున గాన్పించును అది గుండ్రముగా నున్నదని నిర్ణయించుచున్నామనగా - దానికి స్థూలముగా కన్పించు రూపమునుబట్టి గాక దానికి స్వతస్సిద్ధమైన రూపమును బట్టి దాని సిసలైన యాకారమును నిర్ణయించుచున్నామన్నమాట కాని యీ సిసలైన యాకారము సిసలైన దేశమున నుండవలెను. మరి వ్యక్తికి ననుభూతమగు స్థూలదేశమున గాదు యీ సిసలైన యాకారమును గురించియే ప్రకృతిశాస్త్రము విశేషముగ ప్రతిపాదించును సిసలైన దేశము సార్వత్రికము స్థూలముగ గన్పించు దేశము వైయక్తికము వేర్వేరువుర వైయక్తికదేశములలో నొకే వస్తువు విభిన్నముగ గన్పటును. కావున యథార్థమగు నాకృతితో గూడిన యథార్థమగు దేశము వ్యక్త్యనుభూతి విశిష్టములగు దేశములకు విభిన్నమై యుండవలెను. కాన విజ్ఞానశాస్త్రసిద్ధమగుదేశము-మనము దృగిన్ద్రియస్పర్శేన్ద్రియములద్వారా యనుభవమునకు దెచ్చుకొను దేశములతో సంబంధమై యున్నను నదియును నవియును నొక్కటి మాత్రముగాదు మరి వానికిని దీనికిని గల సంబంధము విచారింపదగిన యంశము.

భౌతిక వస్తువులును, నింద్రియార్థములును నొక్కటి గావనియును, అవి మన యింద్రియ గ్రహణములకు గారణమగుచున్న వనియును తాత్కాలికముగ మనమంగీకరించితిమి ఈ భౌతిక వస్తువులే విజ్ఞానశాస్త్ర సిద్ధమగు దేశమున నున్నవి కాన నట్టి దేశమును మనము భౌతి దేశమని వ్యవహరింపవచ్చును. మన యింద్రియ గ్రహణములకు భౌతికవస్తువులు కారణమైనచో, నీ వస్తువులు మన యింద్రియములును, నరములును, మేధస్సును, తనలో నిముడ్చుకొను భౌతిక దేశమొకటి యుండవలెను. మనమొక వస్తువున కనుగుణమగు సంబంధమున నున్నపుడు—మన శరీరమున కొంతభాగము వస్తువుచే నావరింపబడిన దేశమునకు దగ్గరగా భౌతిక దేశములో కొంత ప్రదేశము నాక్రమించి యున్నపుడు - మనకా వస్తువువలన స్పర్శజ్ఞానము గలుగును, స్థూలముగా జెప్పవలెనన్న - వస్తువునకును భౌతిక ప్రదేశములోని కన్నులకును నడుమ కాంతి నిరోధకమగు వస్తువేమియు లేనపుడు, వస్తువును మనము జూడగల్గుదుము అట్లే వస్తువునకు మనము వీలైనంత దగ్గఱగా నున్నపుడు అది నాలుకను స్పృశించునపుడు లేక మన భౌతిక శరీరమున కనుగుణమగు భౌతికదేశములో నది నెలకొనియున్నపుడు, మనకు వస్తు సంబంధియగు స్పర్శజ్ఞానమో గంధజ్ఞానమో కలుగును వస్తువును, మన భౌతికశరీరమును ఒకే భౌతికదేశములో నునట్లు మనము పరిగణించినచో, మనకు వేర్వేరు పరిస్థితులలో నొకే వస్తువెట్లు వేర్వేరు ఇంద్రియ గ్రహణములను సమకూర్చునో వివరించి చెప్ప వీలులేదు ఏలన వస్తువువలన మనకెట్టి యింద్రియ గ్రహణముండునో యనునది - వస్తువునకును మన శరీరమునకును సంబంధించిన తత్తదనుగుణములగు స్థానములపై నాధారపడి యుండును

ప్రస్తుతము మన యింద్రియార్థములు, మన వ్యక్త్యనుభూతమగు దేశములలో - అనగా దృగింద్రియాను భూతమగు దేశమునగాని - స్పర్శేంద్రియాను భూతమగు దేశమునగాని-తదితరములగు నింద్రియముల వలన మనకస్పష్టముగా నను భూతములగు దేశములందు గాని నెలకొనియుండును. ప్రకృతిశాస్త్రము, లోకజ్ఞానము భావించునట్లు భౌతికవస్తు విశిష్టమగు సార్వత్రిక భౌతికదేశ మొకటియున్నచో భౌతికదేశములోని భౌతికవస్తువుల యాయా స్థానములు మన యింద్రియార్థములున్న స్థానమున కనుగుణముగ నుండవలెను ఇది యవగతమగుటలో కష్టమేమియును లేదు. బాటపై

బోవు నపుడొక యిల్లు మరియొక యింటి కంటె నెక్కువ దగ్గఱగా మనకు గన్పించు నపుడు తదితర యింద్రియములు గూడ నది దగ్గఱిగానున్నదను జ్ఞానమునే మనకు గల్గించును ఉదాహరణమునకు బాటవెంట నడచి వెళ్లినపుడు దగ్గఱగానున్న యింటికి త్వరగా మనము చేరగల్గుదుము ఇతరులుగూడ మనకు దగ్గఱగానున్నటు కన్పించు ఇల్లు దగ్గఱగానే యున్నదని యంగీకరింతురు యుద్ధపటము గూడనదే యభిప్రాయమును వెలిబుచును కావున ప్రతిదియు ను-మనమిండ్ల, పైపు జూచునపుడు- మన కనుభూతమగు నింద్రియార్ధముల నడుమగల సంబంధమునే నిర్దేశించును కావున మన వ్యక్త్యనుభూతములగు దేశములలోని యింద్రియార్ధముల కనుగుణమైన రీతిగ భౌతిక వస్తువులకు దేశగతములైన సంబంధము లున్నవని మన మంగీకరింపవచ్చును కావున భూమితి శాస్త్రములో వ్యవహరింపబడి భౌతిక నక్షత్ర శాస్త్రములలో నంగీకరింపబడిన భౌతికదేశ మిదియే.

భౌతికదేశ మొకటి గలదనియు, అది వ్యక్త్యనుభూతములగు దేశములతో నానుగుణ్యము వహించునని యంగీకరించినను, దానిని గురించి మనకు విశేషముగ నేమి తెలియును? ఆనుగుణ్యమును గడించుట కెంత అవసరమో అంతయే దానిని గురించి మన కవగతమగును. అనగా నసలు భౌతిక దేశమననేమో మనకెన్నడును నవగతము కాజాలదు కాని దేశగతములైన సంబంధములవలన నేర్పడిన భౌతిక వస్తువుల సంస్థానప్రకారము (arrangement of the physical objects) ను మన మెఱుగగలము. ఉదాహరణమునకు భూమియును, సూర్యుడును, చంద్రుడును గ్రహణకాలమున నొకే సరళరేఖలో నుండునని మనకు దెలియును కాని సిసలైన సరళరేఖ యననేమో మనకు దెలియక పోవచ్చును కాని దృగ్దేశమున నది మనకెట్లు గోచరించునో తెలిసికొను వీలున్నది. కావున సిసలైన దూరమననేమో మన కవగతము గాకున్నను భౌతిక దేశములలోని దూరముల సంబంధము మన కవగతమగుటకు వీలుగలదు. ఒక దూరము మరియొక దూరముకంటె నెక్కువ యని మనకు తెలియవీలున్నది. కాని మన వైయక్తికదేశములలోని దూరముతోగాని శబ్దరూపాదికమగు నింద్రియార్ధముతో నాత్యంతికమగు సన్నిహితసంబంధముండునంత యెక్కువగా భౌతిక ప్రదేశమునందలి దూరములతో మనకు పరిచితియుండజాలదు కాని కన్నులు లేని గ్రుడ్డివాడు దృగ్దేశమును గూర్చి యితరుల ద్వారా తెలిసికొను విధముగనే భౌతిక దేశమును గూర్చిన సర్వవిషయములను మన మెఱుగవచ్చును కాని గ్రుడ్డివానికి దృగ్దేశమును గూర్చి స్వయముగా నవగతము కానట్లు భౌతికదేశమును గూర్చి మనకవగతము కాజాలదు. కాని యింద్రియార్ధముల యానుగుణ్యమును నిలుపుటకు వలసిన సంబంధలక్షణములను మన మెఱుంగగలము కాని యాసంబంధము లన్వయించు పదముల స్వభావమును మన మెఱుంగజాలము

కాలము విషయమై చెప్పవలెనన్న ఇంత కాలము గడచినదని మన కనిపించుటకును, ఇప్పుడింత యైనదని గడియారపు ముళ్ళు సూచించుటకును ఎట్టి పొందికయును లేదు. మన కేమియు తోచక యున్నపుడు కాలము మిగుల మెల్లగా గడచును మనకు నభిమతమైన పనిలో నిమగ్నమైనపుడు కాలమెంత వేగముగ గడచినదియు మనకు దెలియదు. మనము సుషుప్తిలో నున్నపు డసలుకాలమేమయ్యెనో గూడ మనకు దెలియదు కాన కాలమనగా రెండు సంఘటనలనడుమి వ్యవధి (interval) యని మన మనుకొనునంతవరకును- దేశమునకువలెనే, సార్వజనీన కాలమనియు వైయక్తిక కాలమనియు వివేచనము సేయు నావశ్యకత గలదు కాని కాలమనగా పూర్వాపరముల క్రమమని యనుకొనుచో నట్టి వివేచనము చేయు నావశ్యకతలేదు. సంఘటనల కున్నట్లు కన్పించు క్రమమునకును వాని కున్న క్రమమునకు నెట్టి భేదమునులేదు. ఏది యెట్లున్నను పై రెండు క్రమములును ఒక్కటిగావని యనుకొనుటకు చెప్పదగిన యుప

వత్తు లేవియును లేవు. దేశమును గురించి కూడ పై విషయమే యన్వయించును. ఒక సైనిక పటాలమొక బాటవెంట కదనుద్రొక్కుచు బోవుచున్నచో, పటాలము యొక్క ఆకారము వేర్వేరు దృక్పథములనుండి వేర్వేరు రీతులుగ గన్పించును. కాని యే దృక్పథమునుండి జూచినను మనుష్యులొకే క్రమములో తీర్చినట్లు గన్పింతురు కావున భౌతికదేశములోని క్రమమును గూడ యథార్థమైనదిగనే మనమెంతుము కాని క్రమమునునిలుపుట కవసరమైనంత వరకునునాకారము భౌతికదేశమునకనుగుణముగ నున్నట్లు భావింపబడుచున్నది.

సంఘటనలకున్నట్లు గన్పించు క్రమమునకును, నిజముగా వానికుండు క్రమమునకును భేదమేమియు లేదని చెప్పునపుడొక సంభావ్యమగు నపోహనుదొలగింపవలసిన యావశ్యకత గలదు విభిన్నములగు భౌతిక వస్తువుం వేర్వేరుదశలు- ఆ వస్తువుల ప్రత్యక్షజ్ఞాన విశిష్టములగు నింద్రియార్థములవలె నొకే కాలక్రమముతో గూడియుండవు. భౌతికవస్తువుగ బరిగణించినచో, ఉరుమును, మెరుపును ఏకకాలికములు అనగా మెరపును - సంచలనము ప్రారంభించుచోట, మెఱపున్నచోట సంచలనమును ఏకకాల సముత్పన్నములే కాని మెఱపుకు మనము వినుటవలన గలుగు నింద్రియార్థము-వాయుసంచలనము మనమున్న ప్రదేశము నఱకును,పయనించుపఱకును మన కనుభూతముగాదు. అట్లే సూర్యకిరణములు మనలను జేరుటకి ఎనిమిది నిషములు పట్టును కావునమనము సూర్యుని జూచుమన్నా మనగానెనిమిది నిమిషలక్రిందటి సూర్యునిజూచుచున్నామన్నమాట మనయింద్రియార్థములు భౌతికసూర్యుని గూర్చిననిదర్శనమును సమకూర్చువరకును ఎనిమిది నిముషములక్రిందటి భౌతిక సూర్యుని గూర్చిన నిదర్శనమునే యవి సమకూర్చును ఈ యెనిమిది నిమిషములలో సూర్యుని యునికి కేక్షతిగల్గినను సూర్యుని జూచుట యను మన యింద్రియార్థమున కెట్టి క్షతియును లేదు ఇది, భౌతిక వస్తువులకును, ఇంద్రియార్థములకును నడుమగల భేదమును గూర్చిన వివేచనమెందుకు చేయవలసి వచ్చినదో తగినయొక క్రొంగ్రొత్త నిదర్శనమును జూపును.

దేశము విషయమై మనకు దెలిసినదానికిని ఇంద్రియార్థములకును వాని భౌతిక ప్రతిరూపముల (Counterparts) కును నానుగుణ్యము విషయమై మనకు దెలిసినదానికిని భేదము లేదు ఒక వస్తువు నీలముగను మరియొక వస్తువు ఎఱ్ఱగను గన్పించుచో భౌతికవస్తువులకు గూడ తదనుగుణముగ భేదము కలదని యనుకొనుటలో ననౌచిత్య మేమియునులేదు. కాని ఒక వస్తువు నీలముగాగాని కన్పింపజేయు భౌతిక వస్తుగతమగు లక్షణముతో మనము సాక్షాత్తు పరిచితి గడించుకొనలేము ఇట్టి లక్షణము నొక తరంగ సంచలనముగా ప్రకృతి శాస్త్రము పరిగణించుచున్నది ఇది సువిదితమగు సుపపత్తిగ దోచుచున్నది ఏలన మనము చూచు దేశమునందలి తరంగ సంచలనములను గూర్చి మన మాలోచింతుము కాని యా తరంగ సంచలనములు భౌతికదేశములోనుండి యుండవలెను. వీనితో మనకు ప్రత్యక్ష సంసర్గములేదు కాని నిసలైన తరంగ సంచలనములనుగూర్చి మన మనుకొనినంతగా మనకు దెలియదు ఈ రూపముల విషయముననేది యన్వయించునో, తదితరముగు నింద్రియార్థముల విషయమై యవియే యన్వయించును. కావున భౌతిక వస్తువుల సంబంధమునకు-ఇంద్రియార్థముల సంబంధముతో వానికి గల యానుగుణ్యమును బట్టి యేర్పడిన సర్వవిధములజ్ఞేయలక్షణము లున్నను, భౌతిక వస్తువులను మాత్రము, ఇంద్రియముల ద్వారమున పరిశోధింపగల్గినంత వఱకును, వాని స్వస్వరూపము నెఱుంగుట సాధ్యముగాదు అయినచో భౌతిక వస్తువుల స్వభావము నెఱుంగుటకును మార్గమేమైన గలదేమో యన్న ప్రశ్నము మిగిలియే యున్నది.

దృగ్దేశము నందలి యింద్రియార్థములకు సంబంధించి పవ్రథమమున నవలంబింపనగు హేతుపద్ధతి తుదివఱకును నిల్వకున్నను- భౌతికవస్తువులును, ఇంద్రియార్థములును అచ్చ

ముగ నొక్కటియే గాకపోయినను, సజాతీయములే యను భావము. ఈ యభిప్రాయము ప్రకారము భౌతిక వస్తువులకు యధార్థములగు రంగులు ఉండును కావున వేర్వేరు దృక్పథములను బట్టి కన్పించు వేర్వేరు ఛాయలలో తటస్థమై యొప్పురంగే (Neutral Colour) నిజముగా వస్తువునకు సంబంధించిన రంగు అని మనమనుకొనవచ్చును.

అట్టి వాదము నంత సులభముగా కొట్టి పారవైచుటకు వలనుపడదు. కాని దానిని విశ్లేషకమనుట కవకాశమున్నది. తొలుత మనము చూచురంగు కంటికి దాకు కాంతి తరంగముల స్వభావముపై నాధారపడి యుండును. మనకును, వస్తువునకును నడుమ నుండు సాధనమును (Medium) బట్టియు వెలుతురు పరావర్తనము నొందు విధానమును బట్టియు మార్పు జెందుచుండును. నడుమ నున్న గాని- యెంతయో స్వచ్ఛముగ నున్న గాని, లేనిచో వస్తువు రంగును మార్చివైచును. నడుమనేర్పడు నెట్టి చిక్కని పరావర్తనమైనను రంగును పూర్తిగ మార్చివైచును. కావున మనము చూచురంగు- కిరణము మన యక్షిదేశమును జేరుసరికి ఏర్పడిన గుణము. కాన నది కేవలము కిరణము బయలుదేరు ప్రదేశమున నున్న వస్తుగత లక్షణమని యనుకొన వీలులేదు. కావున కొన్ని తరంగములు మన యక్షిదేశమున ప్రవేశించుచో, తరంగము లెచ్చటనుండి బయలుదేరునో ఆ వస్తువునకు రంగు ఉన్నను లేకున్నను ఒకానొక రంగు మనకు గోచరమగును కావున భౌతికవస్తువులకు రంగులున్నవని యనుకొనుటకు హేతువేమియును లేదు. తదితరములగు నింద్రియార్థములకు గూడ నిదియే యన్వయించును.

ద్రవ్యమే యధార్థమగుచో, నది యిట్టి లక్షణములను గలిగియున్నదని చెప్పుటకు తాత్త్వికములగు నుపపత్తులేవైన గలవా యను ప్రశ్న మొక్కటి మిగిలిపోయినది. పైన వివరించిన రీతి యనేక తత్త్వవేత్తలు వాస్తవమగు నేదియైనను మానసికమే యైయుండవలెననియో మనము తెలిసికొనగలుగు నది మానసమైనదై యుండవలయుననియో, వాదించిరి. అట్టివారిని విజ్ఞానవాదులని వ్యవహరింపనగును విజ్ఞానవాదులు- పైకి ద్రవ్యముగ కన్పించునది నిజముగా మానసికమై యుండుననియో లేక లీబ్నిజ్‌వలె మూలభూతములగు మనస్సుల సమాహారమనియో లేక బెర్క్లీవలె మనస్సులోని భావనలనియోచెప్పుదురు. ద్రవ్యమనగా మనస్సునకతిరిక్తమగు నొకపదార్థమని వారంగీకరింతురు. కాని మనయింద్రియార్థములు, వ్యక్తిగతములైన మన యింద్రియగ్రహణముల కతిరిక్తముగా నొక పదార్థమున్నదనుటకు చిహ్నములన్న విషయమును నిరాకరింపరు విజ్ఞానవాదులు - వారి వాదమున కనుకూలముగ జెప్పు నుపపత్తులను (నా యభిప్రాయముప్రకారము హేత్వాభాసముతో గూడియున్న యుపపత్తులను) సంగ్రహముగ ప్రతిపాదింతము,

★

మృత్యుముఖంలో తుదిరోజు

విక్టర్ హ్యూగో

అనువాదం: శ్రీ రెంటాల గోపాలకృష్ణ

౩

13

గడిచిన కొద్దిరోజులలో నేనొకభయంకరమైన విషయాన్ని చూచాను

అప్పటికింకా భళ్ళున తెల్లవారలేదు జైలంతా గగ్గోలుగా ఉంది. ఇంతింత లావు ఇనుప తలుపులు తెరుస్తున్న చప్పుళ్ళు, మూస్తున్న చప్పుళ్ళు, గడియలు, గొళ్ళాలు వేస్తున్న చప్పుళ్ళు, తీస్తున్న చప్పుళ్ళు, తాళపు చెవిగుత్తులు గలగలలాడేధ్వనులు ఇనుప గొలుసుల గరగర చప్పుళ్ళు, మెట్లెక్కే వాళ్ళు, దిగేవాళ్ళు, ఇటూ అటూ గబగబ పరుగెత్తేవాళ్ళు ఎక్కడో, దూరంగాఉన్న వాళ్ళకోసం పెట్టే కేకలు,పిలుపులు, అందుకుఅవతలవారు చెప్పే సమాధానాలు ఒకటేమిటి? జైలు ఆవరణం అంతటా ధ్వనులు మిన్ను ముడుతున్నాయి. నా ప్రక్క గదులలో ఖైదీలు మామూలు కంటె మరింత ఉల్లాసంగా ఉన్నారు బిసెట్రీ జైలు భవనం యావత్తూ పగలబడి నవ్వుతున్నట్లు, పరవశమై పాడుతున్నట్లు, ఆడుతున్నట్లు కనుపిస్తున్నది

ఈ ఉద్విగ్న వాతావరణంలో అలల అల్లకల్లోలంలో-నేనొక్కణ్ణే మాత్రం ఒంటిగా నిశ్శబ్దంగా ఉన్నాను. ఇదంతా ఏమిటాఅని నిర్ఘాంత పోయాను. ఏం జరుగుతుందో అని శ్రద్ధాసక్తులతో వినసాగాను.

ఒక కాపలావాడు నాగదిముందు నుంచి వెడుతున్నాడు. సాహసంచేసి అతగాణ్ణి పిలిచాను. "ఏమిటి దంతానూ. జైల్లో ఏమైనా ఉత్సవాలు, వేడుకలు చేస్తున్నారా ఏమిటి?" అని అడిగాను.

"ఆ, ఆ, నీకు కావాలంటె ఉత్సవాలే! ఇవాళ ఖైదీలందరికీ గొలుసులు తగిలిస్తున్నారు. వాళ్ళందరినీ రేపు 'టవులన్'కు తీసుకెడుతున్నారు మీకుచూడాలని ఉందా? భలే వేడుకగా ఉంటుంది లెండి!" అన్నాడు కాపలావాడు.

ఒంటిగా, సర్వంత్యజించిన సన్యాసిలా కూచున్న వ్యక్తికి ఏదైనా ఒక వింత, వేడుకచూచే భాగ్యం కలగడం-అది అసహ్యకరమే అయినప్పటికీ-నిజంగా ఒక అదృష్టమనే చెప్పాలి ఆ వేడుకేమిటో చూడడానికి అంగీకరించాను నేను. అది చూడడానికి నాకు అవకాశంకలిగిస్తూ కాపలావాడు అందుకు అవసరమైన జాగ్రత్తలన్నీ తీసుకున్నాడు ఖాళీగా ఉన్న ఒక చిన్నగదిలోకి నన్ను తీసుకవెళ్ళాడు. అక్కడ కుర్చీగానీ, బల్లగానీ లేదు తలుపులు లేని ఒక కిటికీ మాత్రం ఉంది ఆ కిటికీ రొమ్ముల ఎత్తున ఉండడంచేత, అందులో నుంచి హాయిగా వెలుపలకు చూడవచ్చు. నిర్మలనీలాకాశం ఎంతో చక్కగా కనుపిస్తుంది

"ఇదిగో, చూడవయ్యా చూడు. ఇక్కడ ఉంటే అన్నీ వినిపిస్తాయి, అన్నీ కనుపిస్తాయి నీజోలీ-శొంఠీ ఎవరూ రారు. ఒక్కడివీ ధొరవారిలా ఉండ

వచ్చు ఇక్కడ!" అన్నాడు కాపలా వాడు, నన్ను గదిలో వదిలిపెట్టి.

తరువాత అతను నా చేతులకూ, కాళ్ళకూ గొలుసులుబిగించి తాళాలు వేసివెళ్ళి పోయాడు.

కిటికీలో నుంచి చూస్తే అవతల నచ్చ దరంగా ఉన్న ఆవరణ కనపిస్తోంది. దానిచుట్టూ ఒక గోడమాదిరి, ఒక పెద్ద రాతి భవనం ఉంది పైన ఆకాశం అంటుతూ ఆరు అంతస్థులున్నాయి అయ్యో, భగవంతుడా! చతుర్ముఖంగా ఉన్న ఈభవనంచూస్తేఎంతటివాడికైనా భీతి ఆవహిస్తుంది. ఎలాంటి వాడికైనా మనస్సు వికలమవుతుంది పైనుంచి క్రిందివరకూ తలుపులు లేని కిటికీలు కనుపిస్తున్నాయి. ఒకదానిపై ఒకటి వరుసగా రాళ్ళు పేర్చి నట్లున్నాయి ఒక్కొక్క కిటికీలో కనులు జానెడు లోతున గుంజుకుని పోయినముఖాలు, విచలితమైన విషవిషాద భరితమైన దీన వదనాలు—ఖైదీల వదనాలు అనేకం కనుపిస్తున్నాయి అందరూ కుప్పిం చి పోయి పుల్లల్లా ఉన్నారు కాళ్ళకూ, చేతులకేకాక ప్రతిఒక్కరికీ మెడకూ, వంటినిండానూ ఇనపగొలుసులు బిగించి ఉన్నాయి. ఇదిగో--వీళ్ళే—ఈ ఖైదీలే జరగనున్న వినోద ప్రదర్శనంలో పాత్ర లు. నటించడానికి తమవంతు ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారు.

వాళ్ళంతా కిటికీలలోనుంచి,నిర్మాను ష్యంగా ఉన్న ఆవరణలోకి మౌనంగా, తదేకంగా చూస్తున్నారు, వాళ్ళుదేని కోసమో కనిపెట్టుకొని ఉన్నట్లు కను పిస్తున్నారు కొందరిముఖాలు నిర్జీవంగా, నిసేజంగా, కత్తివేటు వేసినా నెత్తురు చుక్కలేనట్లు కనుపిస్తున్నాయి కొందరి ముఖాలలో ఎక్కడలేని దైన్యం తాండవిస్తోంది. అక్కడక్కడ మరికొన్ని ముఖాలు మాత్రం నిప్పులు కక్కుతూ, రౌద్రాకారం తాల్చి ఉన్నాయి.

ఆవరణాన్ని చుట్టుకొని ఉన్న జైలు గోడలు పూర్తిగా మూసుకునిపోయి లేవు చతుర్ముఖంగా ఉన్న భవనానికి ఒక ప్రక్క (తూర్పుముఖంగా ఉన్నది) గోడ, మధ్యకు రెండుగా చీలి ఉంది. దానిని అవతలప్రక్క గోడతో, మధ్య ఇనుప కమ్మీలువేసిఅతుకుపెట్టారు.ఇక్కడి నుంచి లోనికిచూస్తే మరొక ఆవరణం అగుపిస్తుంది ఇది మొదటిఆవరణంలాంటిదే కాని దానికంటె చిన్నది దీనికీ చుట్టూతా గోడలు, పైన కోణాకృతిలో ఉన్న నల్లటి కప్పు ఉన్నాయి

ప్రధాన ఆవరణంలో చుట్టూ గోడలకు ఆనించి రాతి బెంచీలు ఏర్పాటు చేశారు వాటి నడుమ ఒక ఇనుపస్తంభం ఉంది. దానికొక లాంతరు తగిలించారు

మధ్యాహ్నమైంది హఠాత్తుగా చెర నాల సింహద్వారం తెరుచుకుంది ఒక పెద్ద శకటం లోనికి వచ్చింది దాని వెన కాల కొందరు సైనికులు కాపలా కాస్తూ ప్రవేశించారు అందరూ నీలిరంగుదుస్తులు ధరించారు. ఒకవిధమైన ఎర్రటి భుజ కీర్తులు పెట్టుకున్నారు. నడుముకు సంచులు వ్రేలాడుతున్న పచ్చటి పట కాలు కట్టుకున్నారు అసహ్యంగా, పాడు కొట్లాడుతున్నట్లు కనుపిస్తు న్నారు! శకటం గలగల చప్పుడుచేస్తూ ఆవరణలోనికి వచ్చింది సైనికులువచ్చి రావడంతోనే అలజడి బయలుదేరింది.

ఆ శకటంలో ఖైదీలను కట్టివేసే ఇనుప గొలుసులు వేసుకొచ్చారు.

సరిగ్గా, అదే సమయంలో మరో విచిత్రం జరిగింది. అప్పటివరకూ జైలు భవనంలో కిటికీల చెంత కదలక, నిశ్శబ్దంగా చూస్తూఉన్న ఖైదీలంతా, ఒక్క పెట్టున సంతోషంతో అరుపులు, కేకలు, పెడబొబ్బలు పెట్టారు ఈలలు వేశారు. గోల చేశారు. లల్లాయి పదాలుపాడారు. విరగబడి నవ్వారు. ఒకరినొకరు తిట్టుకున్నారు. కొట్టుకున్నారు. బ్రహ్మాండమైన గగ్గోలు పుట్టింది. ప్రతి ఒక్కరి ముఖం వికారంగా మారింది. మారు రూపు పడింది. ఒక్కొక్కరు ఒక్కొక్క బ్రహ్మరాక్షసివలె కనుపించారు. పిడికిళ్ళు బిగించారు. కిటికీ చువ్వలు పట్టి ఊపారు. గ్రుడ్లురిమారు. గొంతులు చించుకున్నారు. నేను నిలువునా నిర్ఘాంత పోయాను. ఏమిటీ సంచలనం—ఎందుకీ సంక్షోభం?

సోల్జెర్లగుంపుతో పాటు పారిస్ నగరం నుంచి వచ్చినవాళ్ళు కొందరున్నారు. వాళ్ళను స్పష్టంగా గుర్తు పట్టవచ్చు. శుభ్రమైన దుస్తులు ధరించారు. భయ భయంగా కనుపిస్తున్నారు. అందులో అనేక తరహాల వాళ్ళున్నారు.

జైలు కావలివాళ్ళు నిశ్శబ్దంగా తమ పని తాము చేసుకపోతున్నారు. ఒకడు శకటం అధిరోహించాడు. పైన ఉన్న ఇనుపగొలుసులు, ఒట్టల మూటలు ఇవతలికి లాగి ఒక్కొక్కటీ క్రింద ఉన్న తన సహచరులకు అందించాడు. తరువాత వారు తాము చేయవలసి పని కొందరీపని, మరికొందరీపని అని విభజించుకున్నారు. ఒకగుంపు వెళ్ళి ఆవరణంలో ఒకమూల, ఇనుపగొలుసులన్నీ వరుసగా క్రిందపరిచింది. మరొకముఠా వెళ్ళి చొక్కాలు, లాగులు—వేటికవి విడివిడిగా 'పేవ్ మెంటు' మీద పెట్టింది. మెడకు, తగిలించే ఇనుప కాలర్లు కూడా విడివిడిగా ఉంచారు. వాళ్ళ కెప్టెన్ వృద్ధుడు. మనిషి మందంగా, పొట్టిగా ఉన్నాడు. అతను వాటినన్నింటినీ—ఒక్కొక్కటే పరీక్షించాడు మెడకు తగిలించే ఇనుప 'కాలర్లు' సరిగ్గాఉన్నదీ లేనిదీ తెలుసుకునేందుకు వాటిని రాళ్ళ మీద మోగించి చూచాడు. క్రింద ఇలా పనులు సాగుతోంటే, పైన ఖైదీలు ఇవి చూచి మరింత అలజడి ప్రారంభించారు. ఎప్పటి కప్పుడు తమ, సంతోషాన్ని వ్యక్తంచేస్తూ కేకలు వేశారు. చప్పట్లు కొట్టారు.

ఏర్పాట్లన్నీ పూర్తి అయిన పిమ్మట తెల్లటి వెండిజరీఅంచు బాడ్జీ ధరించిన ఉన్నతోద్యోగి ఒకాయన ఇనస్పెక్టర్ ను పిలిచాడు. అతనిద్వారా జైలుగవర్నర్ కు అవసరమైన ఆజ్ఞలు అందచేశాడు. ఒక్క క్షణం తరువాత భవనంక్రిందిభాగంలో బిలాలమాదిరి మూడుద్వారాలు ఒకేమాటు తెరుచుకున్నాయి దుమ్ము-ధూళి కొట్టినట్లు, లోపలనుంచి అనేక మంది జనం ఇవతలికొచ్చారు. వాళ్ళంతా ఖైదీలు వాళ్ళముఖాలలో వాడుకొట్లాడుతున్నది కట్టుబట్టలు చిరిగి-పీలికలయి ఉన్నాయి. అంతా అరుస్తూ గందరగోళం చేయడం మొదలుపెట్టారు.

వీళ్ళిలా ఆవరణంలో అడుగు పెట్టారో లేదో, పై అంతస్థులలో కిటికీల చెంత నున్న ఖైదీల ఆనందం మిన్నుముట్టింది, పై వారూ, క్రిందివారూ ఒకరినొకరు

చూచుకుని పలకరించుకున్నారు కౌగిల్యా ట్లు చేసుకున్నారు. ఆవరణంలో ఉన్న ఖైదీలందరూ రకరకాల గడ్డి టోపీలు ధరించి ఉన్నారు. వారు తమజైలు గదులలో కూచుని తయారు చేసుకున్న టోపీలు అవి.కొన్ని టోపీలు గుండ్రంగాను, కొన్ని పొడుగాను కొన్ని వివిధ కోణాకృతులలోను, ఇంకా కొన్ని చిత్రవిచిత్రంగాను ఉన్నాయి. తామీ టోపీలు ధరించి నగరవీధులవెంట నడిచి వెళుతుంటే, అందరూ నిర్ఘాంతపోయి చూడాలని వీరిఅభిలాష కాబోలు!

వారిలో పదిహేడేండ్ల అబ్బాయి ఒకడున్నాడు. అతనిముఖం ఆడపిల్లముఖంలాఉంది అతను జైల్లో ఉండబట్టి వారం రోజులయిందట! ఈ వారం రోజులూ అతను గడ్డితో రకరకాల దుస్తులు తయారు చేసుకున్నాడు వాటిని వంటినిండా తగిలించుకుని, పుట్టలోనుంచి పాముపిల్ల బయటికి వచ్చినట్లు వచ్చాడు అతన్ని చూడగానే అందరూ కరతాళ ధ్వనులు చేశారు అతనొక హాస్యగాడట! ఏదో దొంగతనం చేసినందుకు జైల్లో పెట్టారట. రంగస్థలంలో ఒక నటుడు ప్రవేశించినట్లు అతను ప్రవేశించేసరికి ఖైదీలంతా మహోత్సాహంతో కేకలు పెట్టారు. ఈలలు వేశారు. తాము ఖైదీలమనీ, తమకు శిక్షలుపడ్డాయనీ అనుకున్న పాపాన పోలేదు ఎవరూ. తామంతా ఒకే కుటుంబానికి చెందినట్లు, పెళ్ళి పందిట్లో ఏ పాటకచేరీలోనో, ఆటకచేరీలోనో పాల్గొంటున్నట్లు కనుపించారు. అంతా.

తరువాత ఖైదీలందరినీ రెండు వరుసలుగా గేటు వద్ద నిలుచోపెట్టారు. ఇప్పుడు వారందరినీ డాక్టర్లు పరీక్షచేస్తారు అనారోగ్యంగాను, అశక్తతగాను ఉన్న వాళ్ళను ప్రవాసానికి పంపించకుండా నిలిపి వేయవచ్చు కళ్ళు జబ్బు చేస్తేనూ, కాలు విరిగితేనూ, చేతులు చచ్చుపడితేనూ—ఇలాంటి వ్యాధుల పేరుతో వారు తప్పించుకోవడానికిది తుది అవకాశం.

ఇనుప గేటు మళ్ళీ తెరుచుకున్నది ఒక వార్డరు అకారాది అక్షర క్రమంలో ఖైదీలను పేరుపేరున పిలవడం మొదలు పెట్టాడు. ఇంకేం? ఒక్కొక్క ఖైదీ ఇవతల ఉన్న ఆవరణంలోకి వచ్చి వరుసలో నిలవపడ్డాడు.

ఇలా ఒక ముప్ఫయిమంది ఇవతలికొచ్చాక తిరిగి గేటు తలుపు వేశారు ఒక వార్డరు వాళ్ళను మళ్ళీ వరసాగ్గా నిలుచోబెట్టి, ఒక్కొక్కరి ముఖాన ఒకచొక్కా, ఒక జత ముతక ట్రౌషర్లు పడేశాడు. బట్టలు మార్చుకోవలసిందిగా ఆజ్ఞాపించాడు. వెంటనే ఖైదీలంతా బట్టలు విడవడం మొదలు పెట్టారు. సరిగ్గా ఆక్షణంలో తలవని తలంపుగా ఒక సంఘటన జరిగింది చల్లని గాలి వీచింది వానమీదినుంచి వస్తున్న గాలిలా ఉంది హఠాత్తుగా ఆకసం మేఘావృతమైంది.

ఖైదీలంతా చిరిగి పీలికలయిన తమ బట్టలు విడిచేసి అధికార్లు ఇచ్చిన దుస్తులు ధరిస్తున్నారు, వాళ్ళలా బరవంట ఉన్నప్పుడు అపరిచితమైన కళ్ళు అనేకం వాళ్ళను ఏతదేకంగా చూస్తున్నాయి. దుర్భరమైన వేయి బాణాలు ఏవో తమ వంటికి తాకినట్లనిపించింది ఖైదీలకు.దారుణమైన బాధతో, సహించరాని అవమా

నంతో, లజ్జతో వాళ్ళ శిరస్సులు వాలాయి. సరిగ్గా అదే క్షణంలో ఆకాశం యావత్తూ అంధకారమైంది. కొండలు కోట్లగా మబ్బుపట్టి చిట్లు - చీకట్లు కమ్మాయి వానజల్లు ప్రారంభమైంది. చూస్తూచూస్తుండగానే ఆకాశం చిల్లులు పడినట్లు, కుంభపోతగా వర్షం కురవసాగింది ఒడలు జలదరించేటట్లు ఈదురుగాలి విసిరివిసిరి కొట్టడం మొదలుపెట్టింది. ఖైదీలంతా ఆ వానలో తడిసి ముద్దయినారు గడగడ వణికిపోయారు. క్షణంలో ఆవరణం అంతా జలమయమైంది. కుంటలు, చెరువులు ఏకమైనాయా అన్నట్లు నీరు ప్రవహించసాగింది. పారిస్ నుంచి,చూడవచ్చినవాళ్లు భవనం వాకిళ్లలోకి వెళ్ళి తల దాచుకున్నారు వర్షంమాత్రం తగ్గలేదు. దౌర్భాగ్యులయిన ఖైదీలు ఆవానలో అలాగే తడిసిపోతున్నారు ఆపాదమస్తకం వణికిపోతున్నారు. దేహం ఎక్కడికక్కడ బిగుసుకపోతున్నట్లు - విపరీతంగా బాధపడుతున్నారు. పాపం! వాళ్ళను కంటితో చూడడమే మహాపాపం! వాళ్ల ఉత్సాహం, ఉద్వేగం, కేకలు, చప్పట్లు, ఆటలు,పాటలు-అన్నీ ఏమైపోయినాయో అంతటా నిశ్శబ్దం అలుముకున్నది

ఉన్నట్లుండి ఒక వృద్ధుడు బిగ్గరగా అరిచాడు: "మమ్మల నిలా జోరువానలో నిలవబెట్టి చంపుతున్నారు ఇదేం న్యాయం? మమ్మల నిలా చెయ్యమని ఏ 'రూల్సు' చెబుతోంది?" అంటూ అతను పిడికిళ్లు బిగించి బిగ్గరగా అరిచాడు. వెర్రెత్తినట్లు మధ్య మధ్య పగలబడి నవ్వసాగాడు.

వాళ్ళంతా ప్రయాణపు దుస్తులు ధరించిన తరువాత, ఇరవై ముప్ఫయి మందిని కలిపి ఒక్కొక్క జట్టుగా ఆవరణంలో మరొకమూలకుతీసుకపోబడ్డారు. అక్కడ చేతులకూ మెడకూ వేసే ఇనుప సంకెళ్లు వరసాగ్గా క్రిందపరచి ఉన్నాయి ప్రతి ఒక్క ఖైదీకీ వాటిని తగిలిస్తారు. పెద్ద గుదిబండ లున్నట్లు ఉన్నాయి అవి ప్రయాణం సాగినంత దూరం ఖైదీలు వాటితో అలా ఉండవలసిందే.

ఖైదీలను మోకాళ్ళలోతు బురదలో కూచోబెట్టారు. మెడకూ చేతులకూ సంకెళ్లు తగిలించారు. గొలుసులు ఊడిరాకుండా బలమైన చీలలు కొట్టారు చీలలు బిగించేటప్పుడు కమ్మరవాళ్ళు సుత్తెలతో బాదుతూ ఉంటే, ఆ దృశ్యం చూడశక్యం కాకుండా ఉంది. ప్రతి ఒక్కఖైదీ మృత్యుముఖంలో తలదూర్చినట్లున్నాడు దుర్భరమైన బాధతో సుళ్లు తిరిగిపోతున్నాడు. సుత్తెతో ఒక్కొక్క దెబ్బ కొడుతోంటే వాళ్ళ శరీరాలు ఎగరేసుకుపోతున్నాయి. కొంచెం అటు కదిలినా ఇటు కదిలినా ఆ దెబ్బ తలకు తగిలి, శిరస్సు వెయ్యి వ్రక్కలయి ఊరుకుంటుంది!

ఈ పని పూర్తి అయిన తరువాత తిరిగీ అంతటా గంభీర వాతావరణం అలుముకున్నది. మధ్య మధ్య సంకెళ్ళ గలగల చప్పుడు, కాపలవాళ్ళ చేతులలోని తాళపు గుత్తుల ధ్వని, ఎవరో ఒక ఖైదీ మూల్గుడు, తప్ప మరి అలికిడి అన్న మాటలేదు. పాపం, వాళ్ళలో కొందరు ఉప్పిడి-చప్పిడి కాకుండా, తమలోతాము గ్రుడ్ల నీళ్ళు గుక్కుకుంటున్నారు. ముసలివాళ్ళు అయితే గడ

గడ వణికిపోతూ, పెదవులు కొరుక్కుంటున్నారు నేను భయవిచలితుడనై ఈ ఘోరకృత్యాలన్నీ కళ్ళారా చూచాను. ముందు డాక్టర్ల పరీక్ష, పిమ్మట కాపలా వాళ్ళ తనిఖీ, తరువాత సంకెళ్లు తగిలించి చీలలు కొట్టడం-మొత్తం మూడు కార్యక్రమాలని తెలుసుకున్నాను

వాన వెలిసింది. ఎండ పొడవచ్చింది మబ్బు విడిచిన ఎండ-తీక్షణంగా, నిప్పులు చెరుగుతోంది. ఖైదీలంతా కంపరమెత్తినట్లు-ఒక్కమాటుగా లేచి నిలుచున్నారు. రెప్పపాటు కాలంలో అంతా లాంతరు స్తంభంచూట్టూ వలయాకారంగా నిలుచున్నారు ముఖాలు పైకెత్తారు అందరి ముఖాల్లోనూ అలసట ద్యోతక మవుతోంది అంతా కలిసి ఒక పాటపాడారు. ప్రేమకు సంబంధించిన జానపద గీతం అది ఏదో ఉద్వేగంలో కొట్టుకపోతున్నట్లు, ఉన్మత్తులైనట్లు పాడారు. మధ్య మధ్య నవ్వులు, కేకలు, చప్పట్లు-ఏవో అర్థంకాని మాటలు. వారివంటిమీద ఉన్న సంకెళ్ళ గలగల ధ్వని అపాటకు దరువుగా ఉన్నది వారి వాలకం చూడగా, చూడగా ఏదో భూతకోటి నాట్యం చేస్తున్నట్లు కనుపించింది నాకు.

ఒక పెద్దతొట్టి మోసుకొచ్చి అవరణంలో పెట్టారు. అందులో ఏదో ద్రవ పదార్థం ఉన్నది. అప్పుడే పొయ్యిమీది నుంచిదించి తీసుకొస్తువ్నట్లుగా, సెగలు-పొగలు కక్కుతోంది అదేదో తినుపదార్థంలా ఉంది. అది పంకూరో, ఏంపులుసో ఆ భగవంతుడికే ఎరుక! ఖైదీలంతా తొట్టిమీది కెగబడి అవురావురున తినేశారు.

తిన్నంత తిని-తాగినంత తాగి తక్కినది క్రింద-పైన వెదజల్లారు. మళ్ళీ ఆటా-పాటా మొదలుపెట్టారు. చూడబోతే ఆరోజు వాళ్ళకు కొంత స్వేచ్ఛ ఇచ్చినట్లున్నది

ఈ దృశ్యం అంతా నేను ఎంతో ఆసక్తితో తిలకించాను అంతా విచిత్రంగా ఉంది నాకు. నా గుండెలు దడదడ కొట్టుకుంటున్నాయి. అయినా ఆ దృశ్యం చూస్తున్నంతసేపూ నా పరిస్థితి-నాబాధ, అంతా మరిచిపోయాను. నా హృదయాంతరాళంలో నుంచి ఏదో తీవ్రమైన జాలి, సానుభూతి పుట్టుకొచ్చాయి వాళ్లు నవ్వుతుంటే నేను ఏడుస్తున్నాను!

నేనిలా వివశుడనై చూస్తుండగా-హఠాత్తుగా ఆటా-పాటా ఆగిపోయింది. అంతటా నిశ్శబ్దం అలుముకుంది. ఖైదీలందరి చూపులు నేనున్న కిటికీమీదికి వాలాయి.

"అడుగో, ఉరిశిక్ష పడిన మనిషి! అడుగో, ఉరిశిక్షపడిన మనిషి!" అంటూ అందరూ తమ చూపుడు వ్రేళ్ళతో నన్ను చూపుతూ బిగ్గరగా అరవడం, కేకలు వెయ్యడం మొదలుపెట్టారు.

నేను కలవరంతో అలాగే ఉండిపోయాను. నేను ఫలానా అని వాళ్ళకెలా తెలిసిందో, నన్ను వాళ్ళు ఎలా గుర్తుపట్టగలిగారో నా కర్థం కాలేదు

నన్ను చూచి "గుడ్‌మార్నింగ్" అన్నారు కొందరు, "గుడ్‌నైట్" అన్నారు మరికొందరు ఇలా అని మహదానందంతో చప్పట్లు చరిచారు

వారిలో యావజ్జీవ కఠిన కారాగార వాసశిక్ష పడిన కుర్రవా డొకడున్నాడు. ముఖం చాలా తేటగా ఉంది. అతను నా

వంక ఓర్వలేనట్లు అదోలా చూచి "నా కంటె నీవే అదృష్టవంతుడవు రానాయనా! నిన్నొక్కసారే తల నరికేస్తారు, తీరి పోతుంది సరే, స్నేహితుడా! వెడతాను, సెలవు!" అన్నాడు,

నా మనస్సులో ఏ ఆలోచన పరుగెత్తిందో చెప్పలేను. అవును నేను వాళ్ళ స్నేహితుణ్ణి కావచ్చు 'డీగ్రేవ్', 'టౌలన్' అక్కచెల్లెళ్లు వాళ్ళకంటె నే తక్కువ తరగతిలో ఉన్నాను, వాళ్ళు నన్ను గౌరవిస్తున్నారు నేను కంపించిపోయాను

అవును, వాళ్ళ స్నేహితుణ్ణి! కొద్ది రోజుల్లో నేనూ ఒక ప్రదర్శనం ఇవ్వబోతున్నాను వాళ్ళలో కొందరు చూస్తారు.

నిర్వీర్యుడనై, నిస్తేజుడనై, పక్షవాతం వచ్చినవాడిలా, నిశ్చలంగా, నేను అలాగే కిటికీచెంత ఉండిపోయాను. ఖైదీలంతా అక్కడనుంచి కదిలిపోతున్నారు. ఒక సేనానివహం తరలి వెడుతున్నట్లు వెడుతున్నారు. వాళ్ళ అరుపులు, కేకలు, సంకెళ్ళ గలగలచప్పుళ్లు, పదధ్వనులు, ఇవ్వన్నీ నాకర్ణపుటాలను భేదిస్తున్నాయి. ఇలా వారంతా బారుతీరి, నా గది గోడ ప్రక్కనుంచి వెడుతోంటే, ఏదో రాక్షస దండు తరలి వెడుతున్నట్లనిపించింది నాకు. కెవ్వున కేకపెట్టాను. బలవంతాన తలుపు బ్రద్దలు కొట్టుకుని బయటపడదామని ప్రయత్నించాను కాని ప్రయోజనం లేదు. తప్పించుకునే మార్గమేలేదు. ఏదో భూతం పూనినట్లు, వెర్రిఆవేశంతో అరిచాను, పిలిచాను, కేకలు పెట్టాను. భయంకరమైన ఖైదీలదండు నాకు మరింత చేరవగా వస్తున్నట్లు తోచింది. తోచడమేమిటి? వాళ్ళు రానేవచ్చారు. నా కిటికీచువ్వల దగ్గర వాళ్ళ తలకాయలు కనుపించాయి. నేను భయవిచలితుడనై, ఒక వెర్రికేకపెట్టి, తక్షణమే స్పృహతప్పి పడిపోయాను.

14

నాకు స్పృహవచ్చింది. కళ్లు తెరిచి చూచాను. అది రాత్రివేళ. నేను ఆస్పత్రిలో ఒక మంచంమీద పడుకుని ఉన్నట్లు తెలుసుకున్నాను. నా మంచం ప్రక్కనే ఒక చువ్వకు లాంతరు వ్రేలాడుతోంది. నాకు అభిముఖంగా అనేకమంది రోగుల మంచాలు వరుసగా ఉన్నాయి.

కొద్ది క్షణాలపాటు అలాగే కళ్ళు తెరిచి చూస్తూ పడుకున్నాను. నా మనస్సులో మాత్రం ఎలాంటి ఆలోచనా లేదు, ఆందోళనాలేదు. సాధారణంగా, ఒక మనిషి మంచంమీద పడుకుని ఉన్నప్పుడు కొంత ప్రశాంతత, హాయి కలుగుతాయి, అలాగే ఉన్నది నాకుకూడా. నిజానికి తదితర రోజుల్లో అయితే ఈ జైల్లో, ఈ ఆస్పత్రిలో మంచంమీద పడుకుని ఉండడమంటె - ఒళ్ళు కంపరమెత్తుతుంది. ఎక్కడలేని అసహ్యం, చిరాకు పుట్టుకొస్తాయి. 'అయ్యో, భగవంతుడా! ఎంతటి దురవస్థ పట్టిందిరా' అనిపిస్తుంది. కాని ఇప్పుడు నాకు అలా అనిపించడం లేదు అన్నార్తుడికి ఇది ఉడికిందా లేదా ఇది రుచిగా ఉందా లేదా, అన్న విచక్షణాజ్ఞానం ఉండదట!' అలాగే నిద్రకు ముఖంవాచిపోయిన నాకు- పక్కముఖం ఎరుగని నాకు - ఈ ఆస్పత్రిలో,ఈపాడు పరిమళంలో, ఈ కుక్కి మంచంమీద, నుగ్గు నుగ్గు అయిన పరుపుమీద, చిల్లుల దుప్పటి కప్పుకుని పడుకున్నా-నాకెంతో

పోయిగా, హంసతూలికా తల్పంమీద పడుకున్నట్లుగా ఉంది! అలా చూస్తుండగానే నాకు పిచ్చినిద్ర పట్టింది

పెద్దపెట్టున ధ్వనులన్నీ వచ్చి నా చెవున పడ్డాయి. ఉలికిపడి లేచాను. చూదుసుకదా, భళ్లున తెల్లవారిపోయింది. బయట ఏదో గోలగా ఉంది. నా మంచం కిటికీప్రక్క ఉండడం వల్ల లేచి కూచుని అదేమిటో అని అవతలికి చూచాను.

కిటికీలోనుంచి చూస్తే 'బిసెట్టీ జైలు భవనపు ఆవరణం అగుపిస్తుంది. ఆవరణం నిండా జనం గుమికూడి ఉన్నారు. ఆ గుంపు మధ్య సోల్జర్లు రెండు వరుసలుగా బారుతీరి నిలుచున్నారు మధ్యలో ఒక ఇరుకుత్రోవ వదిలిపెట్టారు. ఆ ఇరుకు త్రోవగుండా, మెల్లగా' అటూ ఇటూ సోలుతూ సొక్కుతూ లేవలేని మనిషి నడుస్తున్నట్లుగా, పొడుగాటి అయిదు వాగెన్లు వచ్చి ఆగాయి వాటినిండా జనం క్రిక్కిరిసిఉన్నారు ప్రవాసానికి వెళ్ళుతున్న ఖైదీలు వారంతా

వాగెన్ల తలుపులు తెరిచారు. ఆ ఓట్టూ, ఈట్టూ- ఖైదీలు ఒకరిప్రక్కన ఒకరు ఒదిగివరుసగా కూచున్నారు అందరినీ గొలుసులతో కట్టేశారు. వాగెను దిగువన ఒక 'వార్డరు' రైఫిల్ పట్టుకుని నిలుచున్నాడు వాగెనులు వస్తోంటే, ఆ కుదుపుకు గొలుసులు గలగల చప్పుడవుతున్నాయి ఖైదీల తలలు అటూ ఇటూ ఊగుతున్నాయి.

తిరిగీ వానజల్లు ప్రారంభమైంది చల్లని, ఈదురుగాలి వీస్తున్నది ఖైదీలంతా చలికి వణికిపోతున్నారు. దౌడలు కంపిస్తున్నాయి. ప్రతి ఒక్కరి వదనం వివర్ణమై ఉన్నది. అనేక మందికి వంటినిండా సరియైన వస్త్రంకూడా లేదు. తలలకు టోపీలులేవు పశువులకంటె అన్యాయంగా ఉన్నది వాళ్ళ పరిస్థితి. ఎంత హీనమైన బ్రతుకు! ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, కట్టినబట్ట విడవకుండా, తిండీ-తిప్పలూ లేకుండా-వారంతా 'ఇరవై అయిదు రోజులు' ఆ వాగెన్లలో అలాగే కూచుని ప్రయాణం చెయ్యాలి. అయ్యో భగవంతుడా! ఏమిటీ యాత్ర!

చుట్టూ గుమికూడి ఉన్న జనసమూహానికీ, వాగెన్లలో కూచుని ఉన్న ఖైదీలకూ మధ్య సాగుతున్న సంభాషణలు ఏమిటో ఆ పరమేశ్వరుడికే ఎరుక! కొందరు ఖైదీలకు ధైర్యం చెపుతున్నారు. ఉత్సాహాన్ని ఇచ్చేమాటలతో వీడ్కోలు చెపుతున్నారు. మరికొందరు 'ఛీ, ఛీ, ఏం బ్రతుకు? ఈ శిక్షలు అనుభవించడంకంటె ఇంత విషంమ్రింగి చావడం మంచిది' అంటూ అవమానకరమైన మాటలు మాట్లాడుతున్నారు ఇలా గందరగోళం సాగుతుండగా,ఇంతలో కెప్టెన్ వచ్చాడు. ఖైదీల తలలమీద, బుజాలమీద కొరడా దెబ్బలు ఛెళ్ళున మ్రోగాయి. ఎక్కడికక్కడ సద్దుమణిగింది ఖైదీలందరూ కుక్కిన పేలల్లే తలలు వాల్చుకుని కూచున్నారు. కాని వారికనులు పగతో,వగతో నిండిన విషవిషాగ్ని జ్వాలలను వెళ్ళగ్రక్కుతున్నాయి.

అయిదు వాగెనులూ బయలుదేరాయి వాగెనుల వెనకాల గుర్రాలమీద సాయుధసైనిక దళాలు నడుస్తున్నాయి.

వాటివెంట వార్డర్లు కాలినడకన వెడుతున్నారు. బిసెస్ట్రీ జైలు భవనపు సింహద్వారపుగేటు తెరుచుకున్నది. గుంపు గుంపంతా పెద్ద సుడిగాలి వెళ్ళినట్లువెళ్ళి అంతలో అదృశ్యమైంది. భయంకరమైన రాళ్ళవాన కురిసి వెలిసినట్లయింది!

దూరంనుంచి మందంగా, గుర్రపు డెక్కల సవ్వడి వినిపిస్తున్నది. గొలుసుల గలగలధ్వనులు, కొరడాదెబ్బల చప్పుళ్ళు జనసందడి, అరుపులు, కేకలు- అన్నీ ఇహ మనకు వినిపించవు, కనుపించవు. దౌర్భాగ్యులయిన ఖైదీల ప్రవాసంలో ఇది తొలిరోజు!

ప్లీడరు చెప్పిందేమిటి? "కఠినశిక్ష!" అయ్యో, భగవంతుడా! ఇంతకంటె మరణశిక్ష వెయ్యిరెట్లు నయం! ఇలాంటి శిక్ష అనుభవించేదానికంటె ఉరికంబం ఎక్కడమే మంచిది!

15

దురదృష్టవశాత్తూ నేను జబ్బుగా లేను ఇహ రేపే నేసీ ఆస్పత్రి వదిలి వెళ్ళాలి మళ్ళీ నా జైలుగది నాకు సిద్ధంగా ఉంటుంది

నాకు జబ్బూలేదు, పాడూలేదు. అయినా నాకేం జబ్బయ్యా? మాంచి నడివయస్సులో - పచ్చిపేడ త్రొక్కితే పదహారు వ్రక్కలయ్యేటట్లు - ఉన్నాను! కండపుష్టికితరుగులేదు వంటిమీద ఎక్కడ పట్టుకున్నా, రక్తం చిమ్ముతోంది! మనస్సుకూడా తేటగా ఉంది. లక్షణాలన్నీ పరికిస్తే-నిండా నూరేండ్లు బ్రతుకుతానని తెలుస్తున్నది. ఇహ నాకేం రోగమయ్యా, దిబ్బరొట్టెలా ఉంటేనూ?

అవును, ఈ చెప్పినదంతా వాస్తవమే. అయినప్పటికీ నేను వ్యాధితో బాధపడుతున్నాను. ఎవరికీ అంతుపట్టని వ్యాధి. తీరని, ఆరని, మనోవ్యాధి! మనోవ్యాధికి మందు లేదంటారే? మానవహాస్తం వల్ల నాకీవ్యాధి కలిగింది!

ఈ వ్యాధి వేయివ్యాధుల పెట్టు; వేయి విషజ్వరాల పెట్టు. ఇది అహర్నిశలూ నాఆయుష్షును క్రుంగతీస్తున్నది. ఇంత ఆరోగ్యవంతుణ్ణి, దృఢకాయుణ్ణి అయినప్పటికీ కూడా ఇది నన్ను పీల్చిపిప్పిచేస్తున్నది. చివరికిది నా అంతు చూస్తుంది- నాచావును చూస్తుంది!

నేను జైలు ఆస్పత్రిలో ఉన్నప్పుడు ఒక దారుణమైన ఆలోచన నామనస్సులో మొలకెత్తింది. అంతకంతకూ అది నన్ను పిచ్చివాణ్ని చేసింది. ఆస్పత్రిలో ఉన్నప్పుడు తప్పించుకుని పోవచ్చునన్నదే ఆ ఆలోచన డాక్టర్లు,నర్సులు నెన్నెంతో ప్రేమగా చూస్తున్నారు. 'పాపం,వయసుకుర్రాడు, దిక్కులేనిచావు చస్తాడేమో!' అని నాపై జాలి వహించారు. నాపడక వదిలి ఒక్కక్షణం ఉండేవాళ్ళు కాదు. కాని అంత చదువుకున్నా ఆ డాక్టర్లు, నర్సులు అమాయకులు పాపం! అవ్వ! ఎక్కడైనా కద్దా?కన్ను నొప్పో, కాలు నొప్పో-జ్వరమో,పాడో అవుతే వాళ్ళు మందిచ్చి నయం చేద్దురు మరణదండన విధించబడిన మనిషిని వాళ్లేం బాగుపరచగలరు? ఏ మందిచ్చి ప్రాణాలు నిలబెట్టగలరు?-కాని వారు ఒక్కమార్గం చూపగలరు, రాజమార్గం! తలుపులు తెరిచి తప్పించుకోమనవచ్చు! కాని ఆపని వారు చేస్తారా?

వాకిప్పుడు వేరే ఆశలేదు. ఆశలన్నీ అడుగంటాయి- అవును. నా విషయంలో అంతా పకడ్బందీ చేశారు. నేను పై అధికారులకు పెట్టుకున్న విజ్ఞప్తి కూడా త్రోసివేశారు. సాక్ష్యం అంతా కట్టుదిట్టంగా ఉంది. నా తరఫు ప్లీడరు చేయగలిగినదంతా చేశాడు జడ్జీగారు న్యాయంగానే తీర్పు చెప్పారు. ఇహ నన్ను నేను కాపాడుకోడానికి ఆధారమే లేదా ?...... ఆఁ, పిచ్చి ! ఎందుకీ భ్రమ ? — ఆశలేదు ! నా విజ్ఞప్తులన్నీ గాలికి పోయినాయి. ఇహ గంద్రగొడ్డలే నాకు శరణ్యం ! నన్ను వాళ్ళు క్షమించినట్లయితే ? ఎవరు క్షమిస్తారు ? క్షమించమని నాతరఫున అడిగేవారెవ్వరున్నారు? అడిగినా ఏ ఆధారం చూచుకుని నన్ను దయతలుస్తారు ? అయినా ఎందుకు దయదలచాలి ? నన్ను క్షమించడమన్నది కల్ల ! ఇటు సూర్యుడు అటుపొడిచినా ఆ పని జరగదు !

ఇహ నేను దాటవలసిన అంచెలు మూడేమూడు. బిస్క్రెటీ. లాకాన్సెర్జరీ, లాగ్రేవ్ - అంతే!

★

విశ్వనాథ మధ్యాక్కఱలు

శేషగిరి శతకము

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

౨

ప్రవహించు కాలువ యైనచో నెండ వచ్చును స్వామి,
తవిలి గుండము పడి నీళ్ళు నిలిచెను తాడి లోఁతునను,
అవురా! సహస్రార్క తేజ, చాలి నీ వార్పనే వలయుఁ
జివరిపంకముతోడ వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

నోచ్చుదు విచ్చుదు తల తిరిగి ముద్ద నోటిలోనికిని
వచ్చుచునున్నది యేపనిం జేయువలసి వచ్చినను
కచ్చి పూనిన యట్లు నాదు స్వామి, నిన్ గాదని యేమి
చిచ్చు మ్రింగుచునుంటి? వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

నీ పరమకృపచే నాల్గు వేళ్లు లోనికిఁ బోవుచున్న
వీ పది పదునేను వత్సరాలుగా నిప్పటి కరువ
దై పైన గడచె న్యాసంబుగననో, సంన్యాసంబు గననో.
శ్రీపతీ! నీదయ! వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

ఇన్ని యుగాలుగా నిన్ని దేశాల నిన్ని గ్రామముల
నున్నట్టి మానవుల్ పుట్టుచుం జచ్చుచున్నార, యెందు
కన్నచో, నెందుకో తెలియదాయె, నీదైన యీ గుట్టు
చిన్న మెత్తైనఁ గను- వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

తాను పరమమోహి పరుల కన్నట్లు తాపత్రయంబు
పూని యిచ్చటి యునికి నిత్యముం చొల్కఁ బోసుక త్రోవ
గానైన పేరాస యేచగా, నైహికము నిత్యమంచుఁ
జీని తగవు లేపు వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

కాన రానట్టి రోగంబు త్రిప్పుకోఁ గలిగిన యట్టు
లేను లేదిది బుద్ధి నిల్వమిని మందు లిముడవు; కరుణ
యైన యట్టి చటకా గాఁగ మాన్పిన నది నీవు మాన్పు,
చేను పండించుకో; వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

ఒగి నీ తనువున కొక్కొక్క యప్పు డొక్కొక్క భోగమ్ము
తగిలించుచుంటి, నామేను శిలవోలెఁ దనరారుచుండె;
తగులదు మిగులదు సుంత సుఖము నాతనువున యందు,
సెగ లే దిగములేదు! వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

ఒక్క విద్యలయందు సుఖము పొందుట యుడుగదు నాకు,
తక్కిన వన్నియు సుంతయును నన్నుఁ దాఁకుట లేదు;
అక్కటా, యీ విద్యలెల్ల నీ దరహాసముల్ గానఁ
జిక్కితి వీసకి- వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

వచ్చినవెల్లఁ దొల్లింటి కోర్కులు చావవా రెండు;
వచ్చియేమి, మఱి చావకేమి యీ వచ్చుకోరికలు!
మచ్చు చల్లుటకేమొ, నన్ను మురిపించి నురపించుటేమొ!
చిచ్చు చూపించకే వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

రెక్కొని సాగించుచున్న యట్టి యీ సృష్టి సంకల్ప
మొక్కటి కారణ హీనమై తోచుచున్నది స్వామి,
ప్రక్క వాటెగదు కార్యకారణ భావమ్ములనకును
చిక్కని మార్గాన వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

ఇన్నాళ్ళు వెక్కిరింపులుగఁ జూచితి, విప్పుడుజాలి
కొన్నట్లు చూచుచు నుంటి నావంక గురువవై స్వామి;
పన్నుగాఁ దుదకు రక్షింతువని యాశపడుచుంటి నన్నుఁ
జిన్న పుచ్చకువె! (శ్రీ) వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

వేద ధర్మమ్ములు దొంగిలించిన విధముగా నుంటి,
నీదుచున్నాను మోహాబ్ధిలోపల నెడపెడగాక;
నాది మత్స్యాకృతి వగుచు నో స్వామి యరుదెంచి నన్ను
ఛేదింపవలయున- వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

దిగఁబడి పోవుచున్నాను మోహ వార్ధి యధఃప్రదేశ
ముగ, మట్టమునుండి యుబుకు బుడగలై బుసబుస లగుచు
బిగువైన నీ వీపుడిప్ప కీలించి పెకలింపఁ జూడు
చిగురు మెత్తని కృప; వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

మంటి భావంబులు మింటి భావముల్ మధియింపఁ బసుచు,
గంటి హాలహాలంబు, కష్ట దుఃఖ నికాయంబును, దెలి
గంటి చానలు, కృతుల్, కల్పవృక్షంబు, జ్ఞానామృతంపు
ఝుంటి పూయింపవే! వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

నేల సర్వంబును జూపఁగాఁ జుట్టి నెత్తిన పెట్టు
కోలేక కాని, యీ యాస యెద తెచ్చి కోలేక కాదు;
వ్రీలని చీఁకటి మబ్బు కోర్కుల వెక్కసంబైన
సీల వదల్చవే! వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

ఇమ్మహీ యీ సృష్టి సూర్యచంద్రులు, నీకాలమును, న
ఘమ్ము, పుణ్యమ్మును, వేదధర్మముల్ కానట్టి యిరులు
క్రమ్మిన ప్రళయాబ్ధిలోనఁ జొచ్చితిఁ గోఱవాటుగను;
జిమ్మవే నన్నును - వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

దాహమ్ము తుదలేని గుండె చెర్వులో దరి దిబ్బలందు
నా హృదయంబునం గానిపించు చున్నాడు, పిక్కటిలి
మోహభావంబులన్ తుంగ ముస్తెల ముట్టెఁద్రోచుచును
శ్రీహరి కిటిరాజు - వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

గుండెలోఁ బ్రేవులుతీయు మాట నిక్కవము నీయందు
మెండుగా సార్థక్యమైన మాట స్వామీ! నారసింహా!
గుండెలోఁ బ్రోవులుపడ్డ మోహంబు గూళ్ళనుగూడఁ
జెండవే దయపేర్మి- వే కటేశ్వరా! శేషాద్రి నిలయ!

నీవు లేవన లేవటంచు వాదించు నిర్భయ దైత్య
భావంబె మేలనిపించు, నీవు కన్పడుట నిశ్చయము!
భావించి, 'యున్నా' వటంచు మేమేమి బావుకొన్నాము?
సేవోరుమతి దక్క, వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

ఎంచి నీవిట్టు లుందువని యంచును, నిచ్చోట నుందు
వంచును. నియమంబులేని యపుడు- లేవనినఁ దప్పేమి?
వంచన యెవరికి? కొలువులోని కంబముచీల్చి గుండె
చించిరా నీపని! వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

ఐదేండ్ల పసివాని వెన్క వేసుక యసుర లోకేశు
పాదులు పెల్లగించితివి; మఱియు నిన్ బట్టి పుత్రకులు
వాదనే వాదన తండ్రి నెదిరింపవచ్చును, పాడి
చేదుకోవచ్చును; వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

మొట్టమొదట బలిదైత్యు యాచింపఁబోయిన వేళ
బొట్టన వ్రేలంత లేవు, తెగనుబ్బిపోయితి మిన్ను
పట్టక; దాతయనంగ నొక్కడే బలి! పీల మొక్కఁ
జెట్టుచేసెను నిన్ను - వేంకటేశ్వరా! శేషాద్రి నిలయ!

ఔను దానమ్మది నీవు చెప్పిన యట్టి వేదముల
లోనిదే గద, ధర్మమద్ది చేయుట లోపమై పోయెఁ;
బూని నీకిటుకేమొ సుంత తెలియంగఁ బోవదు మా, కి
సీ ! నీకుఁ దెలియదో ? వేంకటేశ్వరా ! శేషాద్రి నిలయ !

జన్మముల్ ధ్వంసము సేయలేదు, తా జన్మముల్ సేసె,
నిన్నుఁ గాదన్నది లేదు; బలిదైత్యు నీవేల మిన్ను
మన్ను కాకుండఁ జేసితివి ? ధర్మపు మతిలేదు, సురల
చెన్ను పాలింతువో వేంకటేశ్వరా ! శేషాద్రి నిలయ !

నిన్నుఁ బొమ్మనలేదు బలియుఁ, బ్రహ్లాదుని మనుమఁడతఁడు,
నిన్నును దన తాత ముల్లియ యనుకొనెన్; మొగమాట
మన్నది నీకు లేదని యెఱుంగడ, యన్నాడు నిన్నుఁ
జిన్నపుచ్చఁగ నేల వేంకటేశ్వరా ! శేషాద్రి నిలయ !

ముల్లోకములలోన నిండియుండి యెప్పుడు తృప్తిలేక
ముల్లోకముల బైటఁగూడ మరి నిండిపోవు పేరాస
చెల్లించుకొనఁగాక, యేమి బలిచేసెఁ ? జేసిన దీవు
చిల్లరయూహాను - వేంకటేశ్వరా ! శేషాద్రి నిలయ !

బ్రాహ్మణ జాతి సత్త్వంబు సూని దుర్జన వృత్తులగుచు
బ్రహ్మబంధువులాట కీవ యంకురార్పణ చేసినావు;
బ్రాహ్మీ పథేతర వృత్తముంబూని, భార్గవరామ !
జిహ్మచరణ ధామ ! వేంకటేశ్వరా ! శేషాద్రి నిలయ !

పైడిరాజు ప్రతిభ

విద్వాన్ శ్రీ సూ. సుబ్రహ్మణ్యం, ఎం ఎ; ఎల్. టి
(రీజినల్ డిప్యూటీ డైరక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్స్ట్రక్షన్)

నాకు జాబు వ్రాసినవారికి తిరుగు టపాలో జవాబు చేరకపోయినచో ఇండియా ప్రభుత్వ తంతి తపాలాశాఖలో ఏదో లోటు ఉండి ఉండునని నిశ్చయించుకోవచ్చునని మిత్రులకు చెప్పుచుందును. తత్క్షణము జవాబు వ్రాయు నలవాటుతో పాటు బొమ్మలుగీసిన కార్డులు వాడుచుండుటకూడ నా పద్ధతి. అనేకులు డ్రాయింగు మేష్టర్లతో ఉద్యోగరీత్యా సంబంధముండుటచే నిట్టి కార్డులకు కరువులేదుగాని 1952 నుండి పైడిరాజుగారితో సంబంధ మేర్పడినప్పటి నుండి యీ పద్ధతికి రాణింపు వచ్చినది. తక్కిన కార్డులవలెనే పైడిరాజుగారి బొమ్మలుగల కార్డులుకూడా మిత్రులకు పోస్టు ముద్రలతో పయనించుచుండెను. మైత్రీ మోదముకన్న కళాలోభత్వము హెచ్చయి అవి గాలికెగిరిపోవలసినవి కావని ఆల్బములో నతికించసాగితిని. అట్టివిప్పుడు ఒకమారరమి రెండు వందలు చేరినవి. నా ఆమోదమునకై అమర్చిన యీ యాల్బమొకనాటి కాంధ్రదేశ ఆస్తి విశేషములలో నొక అమూల్యాభరణమై తీరునను ఆశలో నా కణుమాత్ర మనుమానము లేదు

దీనిలోని వన్ని కార్డుపైడిరాజుబొమ్మలే. పరిమాణములో చిన్నవైనను ప్రతిభా ప్రదర్శనములో చిన్నవికావు

తక్కిన విషయములటుంచి ఒక్కొక్క బొమ్మ ఒక్కొక్క చాటువుగా నాకు తోచుచుండును. ఆశు కవిత్వమనిన నా కభిలాష. అనితరసాధారణ ఛందోనియమ బద్ధమైన ఆంధ్రకవితలో నాశువనగ్గళముగా జెప్పుచుండ నెవరి కాశ్చర్యము గొల్పదు. ఆశువును భట్టుమూర్తి తన బిరుదావళిలో చెప్పుకొన్నాడు. తిరుపతి వెంకట కవుల, కొప్పరపుకవుల ఆశువు వినకపోయినను గోడల దూకుచు పర్వెత్తు పందెపుగుఱ్ఱమువలె త్ర్యంబకరావు ఆశువు సాగిపోవుచుండగా ననేక అడ్డంకులు కల్పించి పరీక్షించి మెచ్చుకొనుచుండుట నా కిష్టము. విషయము, వృత్తము, ప్రాస, పదప్రయోగము, ఒకటేమి, అన్ని విధముల నియమములు కల్పించి ఆశువు చెప్పించి సంతోషించుట తిరిగి పైడిరాజు కళాశాలలో సమకూడినది. ఒక కార్డు తరువాత నొకకార్డు నిచ్చుచు, ఏ విషయమునో సూచించుచు, నిముషములపైన కన్నుల కెదురుగా కలకాల ముండి పోవలసిన బొమ్మలు పైడిరాజు చిత్రించుచుండగా తిరిగి ఆశుకవితాధార రాగములతో గాక రంగులలో, నాలికపైగాక తూలికపై పొంగిపొరలి ప్రవహించుచుండగా చూచి నేపొందు ఆనందము చిత్రకారుడు కూడ పొందలేడనిపించును. అతను వేయు వేగము నన్నాకర్షించు మొదటి గుణము.

ఇంక విషయ వైవిధ్యము కూడ మెచ్చతగినది. నిజము నకు ఒకటి రెండో, పదిపంద్రెండో విషయములను చిత్రింపుమని సూచింపగలము గాని

వందలకు వందలుగా సూచింపగలమా! కల్పించిన దృశ్యము కల్పించకుండ పైడిరాజు రెండువందల బొమ్మలప్పటి కప్పుడు శ్రీనాథుని చాటువులవలె కురిపించి యున్నాడు. శ్రీనాథుని నైషధాది గ్రంథములవలెనే అతని చాటువులుకూడ శాశ్వతము నిలిచిపోయెడివే కదా! అట్లే పైడిరాజు బహుమానములు పొందిన పెద్ద బొమ్మలతోపాటు ఈ చిన్నబొమ్మలు కూడ కళాక్షేత్రములో శాశ్వతముగా నుండవలసినవే ఆఫ్ఘన్ రాజు కొనిన "After the Bath" ఈజిప్టు సేకరించిన "A new Road" రష్యావారు కొనిన "To the market" లతో పాటు నావద్ద నున్న చిన్నబొమ్మలుకూడ పైడిరాజుకు పేరు ప్రఖ్యాతులు గడించగలవే. చాటువులలో నొక ప్రత్యేక చిలిపితనమో చికిలితనమో మహిమమో మాధుర్యమో కలదనినను కాదనలేము. ఎన్నెన్ని సుందర దృశ్యము లతని కనులలో మెలగుచుండును. ఎన్నెన్ని నిత్యనూతన కళాసుమాల ప్రకృతి దృశ్యము లతని మేధస్సు కల్పించగలదు అని మనమే బొమ్మల చూచిన మీదట అచ్చెరువందెదము.


పల్లెజీవన మతడనేక ముఖముల ముద్దు ముద్దుగా చిత్రించినాడు.

గ్రామకాంత వేకువనే వాకిలి ఊడ్చి ముంగిట ముగ్గుపెట్టుచున్నది. ఇంటాడబిడ్డవంటి ఆవు, చంటిబిడ్డ వంటి దూడతో ముంగిటనిలబడి ఇంటికి మంగళము గూర్చుచున్నది. ఆవును తులసి కోటను సమముగా పూజించుచున్న దిల్లాలు

[20]

ఊరి చెరువులో తాటితోపుల నీడలాడుచున్నవి. ప్రక్కన రెల్లుదుబ్బు పూసినది. పూలవంటిపులుగులు సన్నని రెల్లుపోచలపై వాలి వానికి వంపు సొంపులు గూర్చుచున్నవి. చెరువువద్ద పల్లెటూరి స్త్రీలు బిందెలు తోముకొని స్నానములాడి నీటిబిందెలు నెత్తి నెత్తుకొని ఇంటికి వెళ్లుచున్నారు వారిరాకపోకలకు కదలక మెదలక కొంగలు చేపలకై తపస్సు చేయుచున్నవి అక్కడక్కడ బెస్తలు గేలవులు వేసి కొంగజపము చేయుచున్నారు. ఇరుపక్షములను దప్పించుకొని చేప లీదులాడుచున్నవి నందనవనములో నాట్యమాడు నప్సరసల తళతళలు మిలమిలలు నీటిలో నీదులాడు రంగురంగుల చేపలముందు తీసికట్టు. పాపికొండల పైరుగాలి కూగులాడు వెదురు కొమ్మలలో కొంత కలదేమో యీ చేపల గమనికలోని సొగసు ఆ వేణువిలాసము మాత్రముచిత్రింపక విడిచెనా పైడిరాజు!

పాలు పెరుగు తట్టలతో పట్టణములో నమ్ముకొనుటకు పల్లెపడుచులు పోవుచున్నారు. ఆ పుంతకు రెండు వైపుల నున్న చెట్లు బారులుతీరి ఆకాశము నంటుచున్నవి. వాటి నీడనేకాని వాని అపురూప శోభ, తన సౌందర్యమునకే మురిసిపోవుచున్న కుమ్మరిపిల్ల గమనించుటలేదు. తలపైని కుండలతట్ట మెడ పైకెత్తి చూచుట కాటంకముగా నున్నమాట నిజమే దారిలో చాకళ్లార వేసిన గుడ్డలు తోరణములవలె నున్నవి. మగని నెత్తిని బిడ్డను తన నెత్తిని తట్టను బెట్టుకొని వెచ్చములకై



ముసలిమజ్జి



వరికోత

పయనించుచున్నది గ్రామకాంత.


ఊరికి పెద్దరికము వహించిన ముసలి మఱ్ఱిచెట్టు ఊడలతో విస్తరించి ముని మనుముల నెత్తిన మునసబుతో వియ్యమందుచున్నది. వయసుకు వన్నెకు పేరెన్నికగన్న వృక్షము లూరిలో ఇంకను చాల గలవు మఱ్ఱిచెట్టునీడ మునసబు చావిడికన్న ఊరివారి కభిమాన సమావేశరంగము. పిట్టలు విశ్రమించుచున్న చెట్లు, కోతులు వ్రేలాడుచున్న చెట్లు గ్రామ జీవితమును కొంతలో కొంత సూచించుచునే ఉన్నవి.

గొడ్లుకదా రైతుధనము. అవి పల్లెకు సొమ్ములు. గ్రామ జీవనమున గొడ్లకు గల స్థానము చాల ప్రధానమైనది అట్లే పైడిరాజు కళాఫలక ముందును అందమైన గొడ్లజత, నీళ్ళు త్రాగుచున్న గొడ్లు, ఇంటి మొగసాలను గొడ్లు, సాయంత్ర మింటికి వచ్చు గొడ్లు, ధాన్యము నూర్చుచున్న గొడ్లు, బండిని భాగ్యము నింటికి లాగుకొని వచ్చుచున్న గొడ్లు చక్కగా చిత్రించినాడు. డోలు బాకా సన్నాయిలతో నిండుగా అలంకరించుకొని ఊరేగు గంగిరెద్దును పైడిరాజు మరువలేదు.

వ్యవసాయ జీవి రైతు. పొలము దున్నుట, విత్తులు జల్లుట, ఊడ్చుట, కోతలు, నూర్పులు. తూర్పార బోయుట, పొలమునుండి వచ్చుస్త్రీలు, గడ్డిమోపులనెత్తిని బెట్టుక ఇంటికివచ్చు నాలుమగలు, గడ్డిబండ్లు, పైడిరాజు కార్డుల కెక్కించెను. తూర్పారబోయు స్త్రీలు వంగిన భంగిమ వెనుకనున్న ఈతచెట్టనుకరించుచున్నది. మంచెపై కెక్కి పిట్టలగొట్టుమగువ మగువమూంచాలను దలపించుచున్నది రంగు రంగుల చీరలు ధరించి నాట్లువోయుచు వంగి నిలిచిన అంగనల బారు నింగి నింద్ర ధనుస్సువలె నున్నది

సరకు లెత్తుకొని పడవ రెక్కలువిప్పి ఎగిరిపోతున్న పక్షిలాగ నున్నది. పల్లెటూరి వినీతజీవితము దలపించుచు వంగి వంపు తిరిగినవి నాటుపడవల టాపులు.

గ్రామీణుల పూరిపాకలు కళాకారుల కాకర్షణీయములు. పూరిండ్లు పైడిరాజు కళాజోత్స్నలో పాలరాతి మేడలకన్న ముచ్చట గొల్పుచున్నవి. పల్లెలందు ప్రకృతి యొడిలో పండుకొన్న పాకలు యమున నొడి నున్న తాజమహల్‌కు తీసిపోవు. ఏ ప్రకృతి చిత్రములోను పూరిగుడిసెలు వేయక పూర్తి చేయడు పైడిరాజు ఈ బీదల కుటీరములు భాగ్య భార వ్యధితుల కూరట గల్గించును. పల్లెటూరి ఆధ్యాత్మిక జీవనముకొంత ఇదివరకే గోపూత తులసీ పూజలలోనే స్ఫురించును. ఊరికావల మఱ్ఱినీడను నాగరాజు ప్రతిమకడ మోకరింపులు, ఊరి దేవాలయములో ప్రతి శుక్రవారము ధూప దీప నైవేద్యముల పళ్లెరములతో నెత్తిన చేతులతో లాస్య భంగిమలో నున్న స్త్రీ జనసమూహము సూచించును, తీర్థ సమయముల సంబరములు, జన సమూహములు, పొరుగూరి బండ్లు, రంగుల రాట్నములు. దూరమునుండి దృగ్గోచరమగుచు జనుల కుత్సాహమిచ్చు కళావిజయ మనదగు గోపురము, ధ్వజస్తంభము, విమానము



గ్రామకాంత ముగ్గుపెట్టుట



సరకు పడవ

ఒక్క కార్డులోని కిమిడినవి.

పల్లెటూరి జీవితము వందలకొలది కార్డులలో చిత్రించి ఒక్క కార్డులో పారిశ్రామిక పట్టణ జీవితములోని గుట్టు మట్టులు పైడిరాజు విప్పి చూపించెను ఈ బొమ్మ చాల గొప్పది పెద్దబొజ్జ, క్రొవ్విన కండలు ఆపాదము సకము తొడుగులు గల సేట్ జీ, రిక్షాతుపిండుగా కూర్చున్నాడు. వెనుకతట్టున మిల్లులు పొగలు గ్రక్కుచున్నవి ముందు కంటికి సేట్ జీయే కాని రిక్షా అంతగా ఆనదు. అసలే ఆనదు రిక్షావాడు. పట్టెసీడవలె ముందు భాగములో కొస కొరిగి యున్నాడు ఒక నిక్కరు తప్ప మరి బట్టలులేవు అతి కష్టముమీద రిక్షా లాగుచుండుటచే చేతి కండరము లుబికినవి కాళ్లు గునపములవలె నేలకు గ్రుచ్చి అడుగు వేయుచున్నాడు రిక్షా రెండుకొమ్ముల మధ్య వాని యూర్ధ్వకాయము మరొక కర్రవలె వంగియున్నది కర్రలో కర్రయై సీడలో నీడయై సరియైన నామ రూపములు లేని యీ యనామక వ్యక్తియే యీ బొమ్మకు నాయకుడు ఈ చిత్ర మెంత వర్ణించినను తీరదు

ప్రకృతి కళాకారులకు మాతృదేవత పల్లె జీవనములో మునిగి తేలిన పైడిరాజుకు ప్రకృతి పరమప్రియప్రద ప్రకృతి దృశ్యము లతడెన్నెని చిత్రించి యున్నాడు ప్రకృతి తన యశేష శోభతో ననంత ముఖముల నతని తూలికపై నృత్య మొనర్చును కొండల గూర్చి ఎన్ని బొమ్మలు గీసినను విసుగు జనింపదు. పోలవరమునుండి కూనవరము

వరకు గోదావరి కిరుప్రక్కల కొండల యఖండరాశి ఏమైనను. ఏ కొండకా కొండయే క్రొత్త యనిపించును దేని యాకారము దానిదే. దేని యందము దానిదే అస్లేపము దము సముద్రమును గూర్చి ఎన్ని బొమ్మలు గీసినను నిత్య నూతనములుగానే తోచును. అంతులేని అలల గెంతులాటలు, నీళ్ళలో బాల బాలికల కేరింతలు తీరముననే షికారు సేయు దంపతుల జంటలు, చెక్కల దోనెలపై చేపలవేటకు బోవు బెస్తలు, తిరిగి వచ్చుసరికి తట్టలతో తయారైన బెస్తల భార్యలు, సముద్ర సౌందర్యమునకు మెరుగు పెట్టుచున్నారు నీటినుండి జగతిలో జీవనాంకురమైన నాటినుండి సముద్రముపై మక్కువ మానవకోటికి పూర్వజన్మ వాసనాదత్త ప్రసాదము. వారసత్వపు హక్కు రంగునీళ్ళలో ముంచిన కుంచెతో నుత్తుంగతరంగ కల్లోల పారావారము పైడిరాజు చిన్న కార్డుపై ముంచి యెత్తును సముద్ర మొక్కటే ప్రకృతి నంతను గుత్తకు పుచ్చుకొనలేదుకదా! జలపాతముల గలగల, చిట్టడవి రెమ్మలపై పూల తళతళ, పూలపై తూనిగ రెక్కల మిలమిల, పైడిరాజు విలువగల తూలిక మొలపించిన కలల వలయములు

పాలరాతి ప్రాసాదములకు లేని ఆకర్షణ పటకుటీరముల కమర్చినాడు.

రవి చంద్రులకు లేని శాశ్వతత్వము రంగు నీళ్ళకు ప్రసాదించినాడు

కాంచనమునకు లేని విలువ కార్డుల కిచ్చినాడు

అట్టిది పైడిరాజు ప్రతిభ.

శ్రీమదాంధ్రవేదాంత పంచదశి

[తత్త్వవివేకప్రకరణము]

పండిత, శ్రీ జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి

౧

అఖిలము సృజించు నజ్ఞానమనెడు ఘోర
మైన గ్రాహంబును జయించునట్టి యత్న
మందె యెపుడుండు శంకరానంద గురుని
పాద పంకేరుహంబులు ప్రస్తుతింతు

అమ్మహా గురువర్య పాదాంబుజముల
సేవచే నతి నిర్మల చిత్తులకును
తత్త్వమెదియొ సుఖముగ బోధయగు కొఱకు
నీ యథార్థతత్త్వము రచియింపఁబడెడు.

జాగరమునఁ దెలియఁదగు శబ్దమాది
ధర్మములు వేఱువేఱయి తనరుచుండు
ఆ పదార్థంబుల నెఱుంగు నట్టిదైన
జ్ఞానమేకమై తద్భిన్నమైన దగును

స్వప్నమందట్టులే కాని జాగరంపు
వస్తువులు సుస్థిరంబులు. సప్నగతము
లస్థిరము- లందుచే భేదమరయనయ్యె;
జ్ఞానమొక్కఁడె రెండవస్థలను గూడ

నిద్రలో నేదెఱుఁగకున్న విద్రలేచి
యే దెఱుఁగనైతినను నదే స్మృతియనంగ.
నట్టి స్మృతియన్న జ్ఞానము ననుభవించు.
టందుచే నిద్ర నజ్ఞానమనుభవంబె.

అట్టిజ్ఞానము జాగరమందు స్వప్న
మందుఁగల్గు జ్ఞానంబె యన్యంబుగాదు.
మూఁడవస్థ యందునఁ బుట్టునట్టి
జ్ఞానమొక్కండె వేఱొండుకాదు సుండు

నెలలు వత్సరమ్ములు కల్పములు యుగములు
వచ్చుచును బోవుచుండును బహువిధముల
గాని యందెల్ల జ్ఞాన మొకఁడె యుదయ
మస్తమును లేని దదియ స్వయంప్రభమ్ము

ఇట్టిదైన జ్ఞానమె జీవుఁడితఁడె పరమ
మైన యానంద మూర్తి ప్రేమాస్పదుండు
తాను నశియింప నెవ్వండు తలఁపఁడేది
యెట్లు పోయినఁ దా నుండ నెంచు సుఖిగ.

పరులపైఁ బ్రేమ యది తన కొఱకె గాక
పరులపై నని పలుకంగ వలను పడదు;
అందుచేతనె ప్రేమ సర్వాధికమ్మ
అంమనన జీవుఁడానందుఁడనఁగఁబరగు.

ఇట్టి యుక్తులచేతను నెంచి చూడ
జీవు సచ్చిదానందుఁగాఁ జెప్పఁదగును,
అట్టి జీవాత్మకును బరమాత్మ కైక్య
భావ ముపనిషత్తులఁ దెలుపంగఁబడెడు.

ఆత్మ వెఱఁగని యెడఁ బ్రీతి యందుఁ బొడము.
దది వెలుఁగ విషయములపై నాస కలుగ.
దందుచే జీవు నానందమైన రూపు
వెలుఁగు చుండియు వెలుఁగ నట్టులుగఁదోచు

అంద అధ్యయనము సేయు నట్టి యెడల
తనయు సర్వము స్పష్టమ్ముగ వినియట్లు
జీవునానందరూపము చెలఁగుచున్న
వెలుఁగకుండు నాటంకముల్ గలుగ నెడల.

మలినమగు గాజు కుప్పెలో మసకగ్రమ్మ
చున్న దీపముఁ బోలుచు నున్నయాత్మ
మలినమగు బుద్ధి కలుగుచో మహితమైన
జీవరూపము వెలుఁగును జెందకుండు.

'జీవుఁడుండు నెల్లపుడు భాసిలుచుండు'
ననెడు నుక్తిఁ దిరస్కార మాచరించి.
'జీవుఁ డేలేఁడ యింక భాసిల్లుటేడ?'
యనుటయే విరుద్ధపు జ్ఞానమనఁగఁ బరగు.

పుత్రకంఠస్వరము వినఁబోలమికిని
నందలంగూడి పరియించుటగును హేతు.
నటులె జీవుఁడు భాసింపఁడనెడు నెడ న
నాదియౌ నవిద్యయె హేతువగును జూవె.

ఆ చిదానంద రూపమైనట్టి యదియు,
ఆ పరబ్రహ్మ ప్రతిబింబ మందినదియు,
ఆ గుణత్రయ సమరూపమైన యదియు
ప్రకృతియొక్కండు రెండయి పరగుచుండు.

అమల సత్త్వగుణాన్విత మగును మాయ
యన్యగుణములు గలిగిన యది యవిద్య,
మాయలోఁ బ్రతిబింబించి మాయకల్గు
నతఁడె సర్వజ్ఞుఁడీశ్వరుఁడైన వాఁడు

అద్వితీయ ప్రతిభన మయ్యవిద్య
వశమగుచుఁ బలుతెఱఁగులఁ బరగుచుండు
నట్టి యవిద్యయె కారణ దేహమగును, దాని
యందు నభిమానియె ప్రాజ్ఞుఁడనఁగఁబరగు

మలిన దర్పణమున దీపకళిక వోలె
నయ్యవిద్యలోఁ బ్రతిబింబమందు బ్రహ్మ
మయ్యవిద్యా వశుండయి, యయ్యవిద్య
చిత్రమైన స్వభావంబుచేత సత్త్వ
మధికమైన దేవత్వము నంది, రజము
నధికమై మానవత్వమునంది. తమము
నధికమైనఁ దిర్యగ్జన్మమగుచు నుండు,
నేమయిన నెల్లయది భ్రాంతియని తెలియుము

అమరుఁడగును సత్త్వాంశము నధికమైన.
నరుఁడగును రజమధిక తరము నైన
పశువులగు పక్షులగు తమోబలముచేత,
నెల్లయిది భ్రాంతి యంచులోనెఱుఁగు మెపుడు.

జీవుఁడెల్ల భోగమ్ములఁజెందు కొఱకు
ఈశ్వరాజ్ఞ చేతఁదమంబె యొక్కటైన
మూల ప్రకృతి నుండియు సూక్ష్మములగునట్టి
పంచ భూతంబులును బ్రభవించుచుండు.

అట్టి సూక్ష్మ భూతంబుల యందు నుండు
సత్త్వగుణపు టంశంబుచే సంభవించు
సంతతంబు జ్ఞానేంద్రియ సంచయంబు
ఇట్టి సృష్టియూహా మాత్రమే తలంప

అట్టి సత్త్వాంశముల మొత్తమంత గూడి
యగును నంతఃకరణ, మదియగు ద్వివిధము.
అధికముగ విమర్శన చేయునదియు మనము
అగును. నిశ్చయాత్మక మగు నదియు బుద్ధి.

మూల ప్రకృతి యందున సదా క్రాలుచుండు
ఆ రజోగుణ భాగములైదు సేత
క్రమము తోడుతఁగర్మేంద్రియములు కలుగు
నఖిలమది భ్రాంతియేయని యరయవలయు.

ఆరజో గుణ భాగము లన్నిగూడ
దేహధారణ హేతువై తివురు ప్రాణ
మగును. అది కార్యభేదాన నైదు విధము
లగును ప్రాణమపానాదు లవియ చూవె.

ప్రాణవాయువు హృదయానఁబరగు చుండి
శ్వాసరూపాన బయటికి వచ్చుఁబోవు,
ఆ యపాన వాయువు గుదమందు నుండి
మలము మూత్రాదికమ్మును వెలఁజేయు.

ఆ సమానవాయువు నాభియందు నుండి
తినిన యన్నాదికమును బచనమొనర్చు.
ఆ యుదానవాయువు కంఠమందు నుండి
భోజనమును లోనికిఁ గొనిపోవుచుండు
వ్యానవాయువు దేహమునంత నిండి
అన్నరస మవయవముల కంపుచుండు.

అయిదు ప్రాణముల్, జ్ఞానేంద్రియంబు లైదు
అయిదు కర్మేంద్రియంబులు నందుమీఁద
ఈ మనంబు బుద్ధియుఁ బదునేడు సూక్ష్మ
దేహమగు దీనినే లింగదేహమండ్రు

అట్టి సూక్ష్మదేహాన నాత్మాభిమాన
ముండు జీవుండె యాతైజసుండు ప్రాజ్ఞుఁ
డీశ్వరుఁడు సూక్ష్మదేహములెల్లఁ జొచ్చి
యా హిరణ్య గర్భాఖ్యుఁడౌ నఖిలమందు
నుండు వాఁడీశ్వరుఁడు జీవుఁడొకట నుండు.

అఖిలమును దానెయని యెంచునట్టి కతన
ఈశ్వరుండు సమష్టియంచెంచఁ బడెడు,
తన యుపాధియె తానని తలఁచుకతన
జీవుఁడల వ్యష్టియంచును జెప్పఁబడెడు

అట్లు సూక్ష్మ సృష్టియయిన నంత మీఁద
జీవుఁడఖిలానుభవములఁ జెందుకొఱకు
భోగములు స్థూలదేహముం బొడసు సూక్ష్మ
భూతముల తమోంశములచే వ్యోమము మొద
లైదిటిని నీశ్వరుఁడు సృష్టియాచరించె

అట్టి సూక్ష్మభూతంబుల యందునుండు
అత్తమో గుణాంశముల రెండయిన యట్లు
చేసి, మొదటిభాగము నాల్గుచేసి, మరల
నర్థభాగాలు చేసిన యట్టి నాల్గు

భూతములు నాలుగంశాలఁబొందు పఱుప
నైదు భూతాలఁగలిసిన యట్టి వగును
ఇదియె పంచీకరణ మంచు నెంచఁబడెడు
దానిచేతనె సకల భూతముల గుణము
యనుభవింతు మల్పముగానొ, యధికముగనొ

అట్లు పంచీ కృతమగు భూతాళి నుండి
యయ్యెఁ జాండము, నందుండి యఖిల భువన
ములను నందుండియును భోగ్యములనుజెందు
యోగ్యములు పలుదేహము లుద్భవిల్లె

అన్నిటికిని బంచీకృత మైన భూత
ములె యుపాదాన కారణమ్ములగుఁజూవె
ఇట్టి స్థూలదేహంబు లందీశ్వరుండు
అఖిల జీవులఁ దనదైన యాత్మగాఁగ
భావనము సేయుఁగాన వైశ్వానరుఁడగు

సూక్ష్మ దేహమె తానుగాఁజూచు జీవు
లమర తిర్యఙ్నరాది భేదముల చేత
విశ్వనామంబుచే విఱవీగు చుండ్రు
వారు వెలుపల నుండెడి వానినె కని,
తమదు లోనున్న వానిని దలఁపఁబోరు.

కర్మములఁజేతురు సుఖదుఃఖంబు లొంద
కర్మములఁజేయ సుఖము దుఃఖము వహింతు,
రేటఁబడి కొట్టుకొని పోవు కీటకంబు
ఒక్క సుడినుండి పోవు నట్లొక్క సుడికి,
నొక్కజన్మ మందుండి వేఱొక్క జన్మ
మొందుచు నరుండు మోక్షమ్మునొందఁబోఁడు.

ఏటఁబడి కీటకము పురాకృత సుకృతము
వలన నొకనిచే నుద్ధరింపంగఁబడిన
తీరమునఁదరు చ్ఛాయను జేరి మిగుల
నెట్లు విశ్రాంతిఁజెందునో యట్లుగానె

అవని జీవులు వేత్తయైనట్టి గురుని
వలనఁ దత్త్వోపదేశమ్ము పడసి పంచ
కోశములఁ దాము వేఱను కొనుటచేత
పరమమైన యానందము పడయఁగలరు

అన్నమని, ప్రాణమని, మనంబనియు, బుద్ధి
యనియు నానందమని యయిదావరణము,
లట్టివానిచే జీవుండు నావృతుఁడయి
తనను మఱచుటచే సంసృతినిఁ బడియెడు.

ఐదుగాఁ జేయఁబడిన భూతాళిఁబుట్టు
స్థూలదేహ మన్నమయంబు గ్రాలుచుండు
సూక్ష్మదేహమందుననో రజోగుణమునఁ
బుట్టు కర్మేంద్రియాల్ ప్రాణములును నైదు
కలిసి ప్రాణమయంబనఁగాఁ బరగెడు.

సాత్త్వికములైన ధీంద్రియ సహితమగుచు
నల విమర్శాత్మక మనోమయమ్ము తనరు,
వానితోడనె గూడి విజ్ఞానమయము
నిశ్చయాత్మక బుద్ధియై నెగడు నెపుడు

అల్లకారణ దేహమౌ నయ్యవిద్య
యందు మలినసత్త్వం బేది యనుదు నదియ
తత్త్రియము మోదమును బ్రమోదముఁగూడి
యగును నానందమయకోశ మదియె జీవు,
డగు నటంచును సతతంబు నరయు నతని
నన్నమయుఁడాది నామమ్ము లాతఁడొందు

స్థూలతను వొక కోశమౌ సూక్ష్మదేహ
మందు త్రయముండు గారణమందునొక్కఁ
డుండు, కోశములు విభాగమొందె నిట్లు
అఖిలజగమును నీత్రిదేహాత్మకంబె
ఈశ్వరునకు నీ కోశము లించుకేని
బంధమొనరింప, వైన నావరణములగు.

అన్వయము వ్యతిరేకము ననెడు వాని
చేతఁగోశ వివేకముఁజెంది తాగు
రూప దేశానఁగోశాలనుండి యుద్ధ
రింపఁబడియు బ్రహ్మైక్య మొందింపఁబడును.

స్వప్నమున స్థూల దేహము భాసమొంద
కమల సాక్షి భాసించుటే యన్వయమగు.
స్థూల దేహము లేని స్వప్నాన యందు
నాత్మ భాసించు చుండుటే యన్వయమగు.
స్వప్నమందె యాత్మయుఁబ్రకాశంబు నొంద
నన్యమైనట్టి స్థూల దేహంబు భాస
మంద కుంటయె వ్యతిరేక మనఁగఁబరగు

నిదురలో సూక్ష్మతను వేమి సొదలకుండ
ఆత్మ యొకఁడె భాసించుటే యన్వయమగు,
ఆత్మ భాసింప సూక్ష్మ దేహంబు నిద్ర
యందు లేకుంటె వ్యతిరేక మనఁగఁబరగు.

లింగ దేహము వేఱు సేయంగఁ బ్రాణ
మయ మనోమయ విజ్ఞాన మయము లైన
వాత్మ కన్యమ్ములుగఁ దెలియంగఁబడెడు.
నా రజస్సత్త్వ భేదము నాశ్రయించి
ప్రాణమయము కల్పితమయి పరగుచుండు
ఆ విచార నిశ్చయముల నాశ్రయించి
ఆ మనోజ్ఞాన మయము లైనట్టి కోశ
ములు విభిన్నములనియును దెలియనగును.

ఆ సమాధి యందున జ్ఞాన మంతరించి
ఆత్మ యొక్కఁడె భాసించుటే యన్వయ మగు,
ఆత్మ భాసింప నజ్ఞాన మస్ఫురణము
నగుటయే వ్యతిరేకము ననఁగఁబరగు

ముంజ గడ్డిపైనుండెడు పొరలుదీసి
లోని యీచ వెలికిఁ దీయఁబూనినట్లు
మూఁడుదేహాలు తత్కోశములు తొలంగ
జీవుఁడా పరబ్రహ్మమై చెలఁగుచుండు.

ఇట్టి యుక్తులతోఁ జూచినట్టులైన
జీవబ్రహ్మైక్య మిటుల నిశ్చితమ యగును,
తత్త్వమస్యాది వాక్యముల్ తలచిచూడ
నయ్యుపాధులు వో నుభయమ్మొకండె.

ఏది జగతి కుపాదాన హేతువగునొ,
ఏది శుద్ధసత్త్వంపుఁ బ్రకృతిని గొనియు
దానికి నిమిత్త హేతువైతనరు, నట్టి
బ్రహ్మ మా 'తత్' పదంబునఁ బలుకఁబడెడు
ప్రకృతియందలి తమమునఁ బ్రతిఫలించు
బ్రహ్మమే జగద్రూపమై పరగుచుండు.

బ్రహ్మమెప్పుడు మలిన సత్త్వమును గా మ
కలుషితంబును నై కడుఁగ్రాలుచుండు
నట్టి ప్రకృతిలోఁ బ్రతిబింబమగునొ యపుడె
'త్వం' పదము చేత నతఁడు చెప్పంగఁబడెడు.

ఆ పరస్పరము విరుద్ధమైన మూఁడు
విధములైనఁ దత్ప్రకృతిని విడిచి, యే యు
పాధి లేని సత్యజ్ఞాన బ్రహ్మమొకఁడె
'తత్త్వమసి' యన్న వాక్యానఁదలఁపఁ బడును.

'అసి' యనెడు శబ్దమా 'తత్' 'త్వమ్' అనెడుశబ్ద
ములకు నైక్యము చెప్పునట్టులయి యుండు,

ఆ పరస్పరము విరుద్ధమైన యా యు
పాధులను ద్యజియింప 'తత్త్వమసి' యగును.

అతఁడె వాఁడను నట్టి వాక్యమ్ము నందు
దేశకాల భేదమ్ము సంధిల్లు, నట్టి
దేశమును గాలమును దాన్ఁదీసివేయ
నుభయులొక్కఁడగు పురుషుఁడై యుండునట్లు.

బ్రహ్మమునకు జీవునకు నావరణములగు
మాయను అవిద్యను విదల్చి వేయునెడల
సచ్చిదానందరూపమై సర్వగతుల
నా పరబ్రహ్మమే నిల్చు నఖిల మగుచు

బ్రహకును నామ రూపపకల్పన మొనర్ప
నతఁడు మిథ్యయౌ నామ రూపాదులట్లు.
ఆత్మ నామ రూపాదిశూన్యం బటన్న
నట్టి వస్తువు లోకమందెట్టులుండు'

కల్పితపు నామరూపాదికమ్ము నిర్వి
కల్పనక, సవికల్పున కౌ యటన్న
మార్పులేని వానికి నెట్లు మార్పుకలుగు?
కాన నీ పూర్వ పక్షము కాని వావి,
ఆ వికల్పునకె వికల్ప మనెడు నెడల
నల వికల్పము లనునవి యంతు లేక
వచ్చు ననవస్థదోష మవ్వలన నగును.

గుణము జాతియు సంబంధమును క్రియయును
ద్రవ్య మనియెడు నివి కల్పితంబు లైన
యట్టి రూపాత్మకంబులయందె యుండు
నిర్గుణుని కోన గలుగ వింతేని గాని.

గుణము కల్మియు లేమియుఁగూడ న వ్వి
శేషములె. సత్పదార్థముఁజెంద వివియు,
తద్గుణముగాని నిర్గుణత్వము గాని
బ్రహ్మమందునఁగల్పితంబయి యెలర్చు.

'తత్త్వమసి' యను వాక్య తాత్పర్యమైన
బ్రహ్మజీవైక్య గ్రహణమె శ్రవణమగును.
జీవుఁడే బ్రహ్మమంచు నిశ్చితము సేసి
అనయమట్లు తలంచుటే మననమగును.

శ్రవణ మననమ్ములందు నిస్సంశయముగ
జీవుఁడా బ్రహ్మమనియె నిశ్చితమొనర్చు
నా మనస్సునఁ గల్గునేకాగ్రత యెది
అయ్యదే నిధిధ్యాసము ననఁగఁ బరగు.

ధ్యానమును జేయువానిని, ధ్యానమనెడు
దానినిన్ క్రమముగ వీడి తలఁపఁబడెడు
వానియందె నివాత దీపంబు వోల్కి
మానసము నిల్చియుంట సమాధియగును.

మానసిక వృత్తులెల్ల సమాధియందుఁ
దెలియఁబడకుండినను సమాధిని వినఁగ
నరునకుం గల్గు తత్స్మరణంబు వలన
సాక్షియగు జీవునకవి గోచరములగును

యోగియు సమాధియందున నుండునపుడు
ఆ మనోవృత్తి యుండునా? అట్టులుండ
కుండఁబోవునా? యన్నచో యోగి కా స
మాధి నున్న నువృత్తులు మసలుచుండు

గాలిలేని యయ్యెడ దీపకళిక వోలె
యోగి నిశ్చలబుద్ధియై యున్కియే స
మాధి యని భగవానుఁడు మాధవుండు
అర్జునున కయి గీతలయందుఁ జెప్పె

ఆది లేని యీ సంసారమందు సంచి
తంబులైన యనంత కర్మంబులెల్ల
ఆ సమాధి చేత లయంబు నందు, నిర్మ
లమ్మగు విముక్తి నొసఁగు నుల్లమును గలుగు.

ధర్మమని యెడు నమృతంపు ధారలెపుడు
వేనవేలుగఁ గురియు నద్దానఁ జేసి
తత్సమాధిని ధర్మాంబుదం బటంచు
యోగి విత్తముల్ వచియించుచుందు రెపుడు,

తత్సమాధిచే వాసనాతతు లశేష
ములు నశించెడు నిశ్శేషముగ సతమ్ము
పుణ్య పాపములగు కర్మములు సమూల
ములుగ నున్మూలితమ్ములై తొలఁగిపోవు.

'తత్త్వమసి' యనువాక్య మంతటను మిగుల
నెట్టి ప్రతి బంధకము లేక మొట్టమొదట
ఆ పరోక్షంపు జ్ఞానము నాపయి నప
రోక్షమగు జ్ఞాన మొసఁగుచు మోక్షమొసఁగు.

గురు ముఖమ్మునఁదన కొడఁగూడు నాప
రోక్షమైన బ్రహ్మజ్ఞాన మాక్షణమున
బుద్ధి పూర్వక కృతములౌ పుణ్యపాప
వనములంగాల్చు దావాగ్నివలె చెలంగి.

గురుముఖమ్మునఁదన కొడఁగూడి నట్టి
తదపరోక్షాత్మమగు భోధ తత్క్షణంబ
సంసృతికిఁగారణంబగు నజ్ఞానమనెడు
నంధతమసమ్ముఁ బోకార్చు నర్కునట్లు.

ఇట్లు తత్త్వ వివేకమ్ము నెడఁద నిలిపి
విధిమెయి మన స్సమాధి గావించెనేని
అతఁడు సంసార బంధ వర్జితుఁడ యగును
బ్రహ్మపద మందు నచిరకాలమ్ము నందె.

సంస్కృతబాలశిక్ష

శ్రీ గరికిపాటి సత్యనారాయణ, ఎం. ఎ.

౭

ఇంతవరకును అజన్త విశేషశబ్దము లుదాహరింపబడినవి ఇక హలన్తవిశేష శబ్దములు ప్రారంభమగును

ఈ క్రింది చకారాన్తమగు ప్రాక్ అను పుంలిఙ్గ శబ్దమును పరిశీలించునది. ప్రాక్ఛబ్దమునకు మొదటివాడు అని యర్థము.

ప్రాఙ్ - ప్రాఞ్చౌ - ప్రాఞ్చః
ప్రాఞ్చమ్ - ప్రాఞ్చౌ - ప్రాచః
ప్రాచా - ప్రాగ్భ్యామ్ - ప్రాగ్భిః

మిగిలినదంతయు జలముక్ఛబ్దమును బట్టి యన్వయించుకొన నగును

ప్రాక్ఛబ్దమును బట్టి పరాక్, అపాక్, అవాక్ శబ్దముల యాయా విభక్తి-వచన రూపములను సాధించుకొననగును

ఈ క్రింది చకారాన్తమగు ప్రాక్ అను నపుంసక లిఙ్గశబ్దమును పరిశీలించునది. ప్రాక్ఛబ్దమునకీ లింగమున మొదటిది యని యర్థము.

ప్రాక్ - ప్రాచీ - ప్రాఞ్చి
ప్రాక్ - ప్రాచీ - ప్రాఞ్చి

మిగిలిన శబ్దము నంతయు జలముక్ఛబ్దమును బట్టి యన్వయించుకొన నగును

ఈ క్రింది జకారాన్తమగు రాట్ అను పుంలిఙ్గ శబ్దమును పరిశీలించునది. రాట్ఛబ్దమునకు రాజు అని యర్థము.

రాట్ - రాజౌ - రాజః
రాజమ్ - రాజౌ - రాజః
రాజా - రాడ్భ్యామ్ - రాడ్భిః
రాజే - రాడ్భ్యామ్ - రాడ్భ్యః
రాజః - రాడ్భ్యామ్ - రాడ్భ్యః
రాజః - రాజోః - రాజామ్
రాజి - రాజోః - రాట్సు

ఈ క్రింది థకారాన్తమగు అగ్నిమత్ అను పుంలిఙ్గ శబ్దమును పరిశీలించునది అగ్నిమచ్ఛబ్దమునకు అగ్నిని మథించువాడని యర్థము.

అగ్నిమత్ - అగ్నిమథౌ - అగ్నిమథః
అగ్నిమథమ్ - అగ్నిమథౌ - అగ్నిమథః
అగ్నిమథా - అగ్నిమద్భ్యామ్ - అగ్నిమద్భిః
అగ్నిమథే - అగ్నిమద్భ్యామ్ - అగ్నిమద్భ్యః
అగ్నిమథః - అగ్నిమద్భ్యామ్ - అగ్నిమద్భ్యః
అగ్నిమథః - అగ్నిమథోః - అగ్నిమథామ్
అగ్నిమథి - అగ్నిమథోః - అగ్నిమత్సు

ఈ క్రింది నకారాన్తమగు పూషన్ అను పుంలిఙ్గ శబ్దమును పరిశీలించునది పూషన్ఛబ్దమునకు సూర్యుడు అని యర్థము

పూషా - పూషణౌ - పూషణః
హే పూషన్ - హే పూషణౌ - హే పూషణః
పూషణమ్ - పూషణౌ - పూష్ణః
పూష్ణా - పూషభ్యామ్ - పూషభిః
పూష్ణే - పూషభ్యామ్ - పూషభ్యః
పూష్ణః - పూషభ్యామ్ - పూషభ్యః
పూష్ణః - పూష్ణోః - పూష్ణామ్
పూష్ణి - పూష్ణోః - పూషసు

అట్లే అర్యమన్ఛబ్దమును అన్వయించుకొనునది ఈ క్రింది నకారాన్తమగు వృత్రహన్ అను పుంలిఙ్గశబ్దమును పరిశీలించునది వృత్రహన్ఛబ్దమునకు సూర్యుడు అని యర్థము

వృత్రహా - వృత్రహణౌ - వృత్రహణః
హే వృత్రహన్ - హే వృత్రహణౌ - హే వృత్రహణః

వృత్రహణమ్-వృత్రహణౌ-వృత్రఘ్నః
వృత్రఘ్నా - వృత్రహభ్యామ్-వృత్రహభిః
వృత్రఘ్నే-వృత్రహభ్యామ్-వృత్రహభ్యః
వృత్రఘ్నః-వృత్రహభ్యామ్-వృత్రహభ్యః
వృత్రఘ్నః-వృత్రఘ్నోః-వృత్రఘ్నామ్
వృత్రఘ్ని } వృత్రఘ్నోః-వృత్రహసు
వృత్రహణి }

ఇట్లే బ్రహ్మహన్, భ్రూణహన్ఛబ్దముల నన్వయించు కొనునది.

ఈ క్రింది నకారాంతమగుశ్వన్ అను పుంలిఙ్గశబ్దమును పరిశీలించునది. శ్వన్ఛబ్దమునకు కుక్క యని యర్థము.

శ్వా- శ్వానౌ - శ్వానః
హేశ్వన్ హేశ్వానౌ - హేశ్వానః
శ్వానమ్ - శ్వానౌ - శునః
శునా - శ్వభ్యామ్ - శ్వభిః
శునే - శ్వభ్యామ్ శ్వభ్యః
శునః - శ్వభ్యామ్ - శ్వభ్యః
శునః - శునోః - శునామ్
శుని - శునోః - శ్వసు.

ఈ క్రింది నకారాంతమగు యువన్ అను పుంలిఙ్గ శబ్దమును పరిశీలించునది, యువన్ఛబ్దమునకు యువకుడు అని యర్థము.

యువా - యువానౌ - యువానః
హేయువన్- హేయువానౌ - హేయువానః
యువానమ్ - యువానౌ - యూనః
యూనా - యువభ్యామ్ - యువభిః
యూనే - యువభ్యామ్ - యువభ్యః
యూనః - యువభ్యామ్ - యువభ్యః
యూనః - యూనోః - యూనామ్
యూని - యూనోః - యువసు

ఈ క్రింది నకారాంతమగు పథిన్ అను పుంలిఙ్గశబ్దమును పరిశీలించునది. పథిన్ఛబ్దమునకు మార్గము అని యర్థము.

పన్థాః - పన్థానౌ - పన్థానః
పన్థానమ్ - పన్థానౌ - పథః
పథా - పథిభ్యామ్ - పథిభిః
పథే - పథిభ్యామ్ - పథిభ్యః
పథః - పథిభ్యామ్ - పథిభ్యః
పథః - పథోః - పథామ్
పథి - పథోః - పథిషు

ఇట్లే మన్థిన్ఛబ్దమును సమన్వయించుకొనునది.

ఈ క్రింది నకారాంతమగు పఞ్చన్ అను పుంలిఙ్గశబ్దమును పరిశీలించునది ఇది ఎప్పుడును బహువచనాంతముగనే యుండును. పఞ్చన్ఛబ్దమున కైదుగురు అని యర్థము

పఞ్చ
పఞ్చ
పఞ్చభిః
పఞ్చభ్యః
పఞ్చభ్యః
పఞ్చానామ్
పఞ్చసు

ఇట్లే సప్తన్, నవన్, దశన్ శబ్దములను సమన్వయించు కొనదగును.

ఈ క్రింది నకారాంతమగు అష్టన్ అను పుంలిఙ్గ శబ్దమును పరిశీలించునది. అష్టశబ్దమునకు ఎనిమిదిమంది యని యర్థము. ఇది ఎల్లప్పుడు బహువచనాంతముగనే యుండును.

అష్టౌ, అష్ట
అష్టౌ, అష్ట
అష్టాభిః, అష్టభిః
అష్టాభ్యః, అష్టభ్యః
అష్టాభ్యః, అష్టభ్యః
అష్టానామ్
అష్టాసు, అష్టసు

పై శబ్దములో ఒక్క షష్ఠీ బహువచన రూపము తప్ప, మిగిలిన విభక్తులన్నింటిలోను రెండేసి రూపములు గలవని పాఠకులు తెలిసికొననగును.

ఈ క్రింది రేఫాన్తమగు (రకారాన్తమగు) చతుర్ అను పుంలిఙ్గ శబ్దమును పరిశీలించునది ఇదిగూడ పై శబ్దముల వలె నిత్య బహువచనాన్తమే.

చత్వారః
చతురః
చతుర్భిః
చతుర్భ్యః
చతుర్భ్యః
చతుర్ణామ్
చతుర్షు

ఈ క్రింది రేఫాన్తమగు (రకారాన్తమగు) చతుర్ అను స్త్రీ లిఙ్గ శబ్దమును పరిశీలించునది.

చతస్రః
చతస్రః
చతసృభిః
చతసృభ్యః
చతసృభ్యః
చతసృణామ్
చతసృషు

ఈ క్రింది రేఫాన్తమగు (రకారాన్తమగు) చతుర్ అను నపుంసక లిఙ్గశబ్దమును పరిశీలించునది.

చత్వారి
చత్వారి

*మిగిలినదంతయు పుంలిఙ్గశబ్దమునుబట్టి యన్వయించుకొనునది

ఈ క్రింది షకారాన్తమగు దోస్ అను పుంలిఙ్గశబ్దమును పరిశీలించునది. దోశ్శబ్దమునకు బాహువు అని యర్థము.

దోః - దోషౌ - దోషః
దోషమ్ - దోషౌ - దోషః
దోషా / దోష్ణా - దోర్భ్యామ్ / దోషభ్యామ్ - దోర్భిః / దోషభిః
దోషే / దోష్ణే - దోర్భ్యామ్ / దోషభ్యామ్ - దోర్భ్యః / దోషభ్యః
దోషః / దోష్ణః - దోర్భ్యామ్ / దోషభ్యామ్ - దోర్భ్యః / దోషభ్యః
దోషః / దోష్ణః - దోషోః / దోష్ణోః - దోషోః / దోష్ణోః - దోషామ్ / దోష్ణామ్
దోషి / దోష్ణి / దోషణి - దోషోః / దోష్ణోః - దోషు / దోఃషు / దోషసు

ఈ క్రింది సకారాన్తమగు ఆశిస్ అను స్త్రీ లిఙ్గశబ్దమును పరిశీలించునది ఆశీశ్శబ్దమునకు ఆశీస్సు అని యర్థము

ఆశీః - ఆశిషౌ - ఆశిషః
ఆశిషమ్ - ఆశిషౌ ఆశిషః
ఆశిషా - ఆశీర్భ్యామ్ - ఆశీర్భిః
ఆశిషే - ఆశీర్భ్యామ్ - ఆశీర్భ్యః
ఆశిషః - ఆశీర్భ్యామ్ - ఆశీర్భ్యః
ఆశిషః - ఆశిషోః - ఆశిషామ్
ఆశిషి - ఆశిషోః - ఆశీష్షు

ఈ క్రింది జకారాన్తమగు అసృక్ అను నపుంసక లింగశబ్దమును పరిశీలించునది. అసృక్ఛబ్దమునకు రక్తమని యర్థము.

అసృక్ - అసృజీ - అసృఞ్జి
అసృక్ - అసృజీ - అసాని / అసృఞ్జి
అస్నా / అసృజా - అసభ్యామ్ / అసృగ్భ్యామ్ - అసభిః / అసృగ్భిః
అస్నే / అసృజే - అసభ్యామ్ / అసృగ్భ్యామ్ - అసభ్యః / అసృగ్భ్యః
అస్నః / అసృజః - అసభ్యామ్ / అసృగ్భ్యామ్ - అసభ్యః / అసృగ్భ్యః
అసృజః - అసృజోః - అసృజామ్
అసృజి - అసృజోః - అసృక్షు

ఈ క్రింది నకారాన్తమగు అహాన్ అను నపుంసక లింగశబ్దమును పరిశీలించునది. అహన్శబ్దమునకు దినము అని యర్థము.

అహః - అహ్నీ } అహాని
అహనీ

అహః - అహ్నీ } అహాని
అహనీ

అహ్నా - అహోభ్యామ్ - అహోభిః
అహ్నే - అహోభ్యామ్ - అహోభ్యః
అహ్నః - అహోభ్యామ్ - అహోభ్యః
అహ్నః - అహ్నోః - అహ్నామ్
అహ్ని } అహ్నోః - అహస్సు
అహని

ఈ క్రింది సకారాన్తమగు ధనుస్ అను నపుంసక లింగశబ్దమును పరిశీలించునది. ధనుశ్శబ్దమునకు విల్లు అని యర్థము.

ధనుః - ధనుషీ - ధనూంషి
ధనుః - ధనుషీ - ధనూంషి
ధనుషా - ధనుర్భ్యామ్ - ధనుర్భిః
ధనుషే - ధనుర్భ్యామ్ - ధనుర్భ్యః
ధనుషః - ధనుర్భ్యామ్ - ధనుర్భ్యః
ధనుషః - ధనుషోః - ధనుషామ్
ధనుషి - ధనుషోః - ధనుష్షు

వెనుకటి పాఠమున అదశ్శబ్దమున చతుర్థ్యైక వచనము అముష్మై అనుటకు బదులు అముష్మ్యై అనియు, విశ్వపాశ్శబ్దమున ద్వితీయా బహువచనము విశ్వపాః అనుటకు బదులు విశ్వపః అనియును, నిశాశబ్దమున సప్తమీ విభక్తి యందలి ద్వివచనరూపము నశయోః అనుటకు బదులు నిశయోః అనియును, పాదశబ్దమునకు ద్వితీయా బహువచనమునందలి మొదటిరూపము పాదాన్ అనుటకు బదులు పాదాః అనియును, సఖిశబ్దమున పంచమీ ద్వివచనము సఖిభ్యమ్ అనుటకు సఖిభ్యామ్ అనియును పతిశబ్దమున తృతీయైక వచనరూపము పతా అనుటకు బదులు పత్యా అనియును ప్రధీశబ్దమునకు ద్వితీయా బహువచనము ప్రధేః అనుటకు బదులు ప్రధ్యః అనియును, అకారాన్తమగు హృదయ అను పుంలింగశబ్దమనుటకు బదులు, హృదయ అను నపుంసక లింగశబ్దమనియును, పారాన్తమున తుచ్ఛబ్దమునకు పంచమీ బహువచనము అనుటకు పంచమీ ఏకవచనమనియును సవరించుకొనవలెను.

ఆయుర్వేదము - ఆహారము

వైద్యశ్రీ, ప్రకాశచంద్ర శతపధి

౧

ఆయుర్వేదము శాస్త్రము ననుసరించి ప్రతి ద్రవ్యము-రస, గుణ, వీర్య విపాక, ప్రభావములను కల్గియుండును ద్రవ్యములందలి యీ శక్తులను అవగాహన చేసుకొనిననాడు మానవుల ఆరోగ్య సౌభాగ్యము వర్థిల్లుచుండును. చికిత్సకులకు కౌశల్యము పెంపొందును.

షడ్రసములు · వింశతి గుణములను గూర్చి ముందటి వ్యాసములందు వివరణ జరిగినది. ఇప్పుడు వీర్య, విపాక, ప్రభావములను గూర్చి తెలుసుకొనవలసి యున్నది,

రసమనగా మనము గైకొనిన పదార్థము జిహ్వేంద్రియమునకు మధురముగనో, పులుపుగనో, ఉప్పగనో, కారముగనో, వగరుగనో, చేదుగనో నుండుట

గుణములనగా : విలువలు లేక స్వభావము అని అనవచ్చును. రసమునుబట్టి గుణముండును. ఈ గుణములను నిర్ణయించుట యెట్లన - మదుర రసపధార్థమును గైకొనిన - శ్లేష్మమును వృద్ధి చేయును శ్లేష్మమునకు - మధురత్వము (తియ్యదనము) స్నిగ్ధత్వము (జిడ్డుగా నుండుట) గురుత్వము (బరువుగా నుండుట), శీతత్వము (చల్లదనము),పిచ్ఛిలత్వము (జిగురుగనుండుట), ఈ గుణములు చిహ్నములుగ నుండును. ఈ శ్లేష్మమునకు సమానధర్మములు గలది మధురరసము, కనుక ఈ మధుర రసము నందుకూడ - మధుర. స్నిగ్ధ, గురు, శీత, పిచ్ఛిలత్వ· గుణములుండును. ఇందువలన మధురరసము శ్లేష్మవర్థకమని నిర్ణయమగును.

కారపు పదార్థములను గైకొనిన పిత్తమును వృద్ధిపరచును. పిత్తమునకు-ఉష్ణత్వము (వేడిమి), తీక్ష్ణత్వము (వాడితనము) రూక్షత్వము (ఎండుట) లఘుత్వము (తేలికతనము),విశదత్వము(స్వచ్ఛముగా నుండుట) ఈ గుణములు చిహ్నములుగా నుండును. ఈ పిత్తమునకు సమానమగు నుత్పత్తి కారణముగలది కటురసము, గనుక ఈ కటురసమునందు గూడ ఉష్ణ, తీక్ష్ణ, రూక్ష, లఘు, విశదత్వములను గుణములుండును. ఇందువలన కటురసము పైత్యవర్థకము

కషాయ (వగరు) రసపదార్థములను గైకొనిన వాతము వృద్ధినందును. వాతమునకు - శీతత్వము (చల్లదనము), రూక్షత్వము (పొడిగా నుండుట) లఘుత్వము (తేలికగా నుండుట), విశదత్వము (స్వచ్ఛముగా నుండుట), విష్టంభత్వము (మల-మూత్రబంధకత్వము) గుణములు చిహ్నములుగా నుండును. ఈ వాతముతో సమానమయిన ఉత్పత్తి కారణముగలది కషాయరసము. కనుక ఈకషాయరసము నందునను-శీత, రూక్ష, లఘు, విశద,విష్టంభత్వ గుణములుండును. ఇందువలన కషాయరసము వాతవర్థకము.

ఒక ద్రవ్యమునందలి గల రసములను బట్టి గుణములను నిర్ణయించడం ముందుగా జరుగును. అయితే తియ్యగా నుండు అన్ని ద్రవ్యములందలి మధుర రసము - మధురరసమువంటి గుణములనే

కల్గియుండదు. కొన్ని మధురరసముగల పదార్థములు మధురరసములో లేని ధర్మములు కల్గియుండును. మరికొన్ని మధురరసముగా నుండునవియే మధురరసమునకువ్యతిరిక్తములగుధర్మములుకలిగియుండును ఈవిశిష్టధర్మమునకేవీర్యమనిపేరు. షడ్రసములందుననూ యీరీతియే యుండును. విశ్వమునందలి సమస్త ద్రవ్యములును, పంచభూతములును, త్రిదోషములును, సర్వమూ వింశతి గుణములుకు చెందినవియే ఐ యుండును. ఆ వింశతి గుణము లేవియన - శీతత్వము (చల్లదనము) ఉష్ణత్వము. (వేడిమి), స్నిగ్ధత్వము (జిడ్డుగ నుండుట) రూక్షత్వము (పొడిగా నుండుట) మందత్వము(మొద్దుబారుట), తీక్షత్వము (వాడి కల్గియుండుట), గురుత్వము (బరువుగన్నుండుట) లఘుత్వము (తేలికగా నుండుట), పిచ్ఛిలత్వము (జిగురుగ నుండుట) విశదత్వము (స్వచ్ఛముగా నుండుట) శ్లక్ష్ణత్వము (నునుపుగ నుండుట), పరుషత్వము (గరుకుగ నుండుట), కఠినత్వము (గట్టితనము), మృదుత్వము (మెత్తదనము), ద్రవత్వము (పలచదనము), సాంద్రత్వము (చిక్కదనము) స్థిరత్వము (కదలకుండుట), సరత్వము (కదులుట), స్థూలత్వము(లావుదనము), సూక్ష్మత్వము (పరమాణువలె చిన్నదిగా నుండుట)

సాధారణముగా షడ్రసములందుననూ ఆయా రసగుణము లుండును. కానీ కొన్ని కొన్ని ద్రవ్యములందలి రసమొకటే యైననూ ధర్మమువేరుగా నుండును. ఎటులన- మధురరస పదార్థములు గైకొనిన శ్లేష్మము వృద్ధియగును. కానీ తేనె మధురరసము కలిగినదయిననూ శ్లేష్మ వృద్ధిని చేయక-శ్లేష్మ శమనమును చేయును కారణ మేమన తేనెయందు మధురరసముతోబాటు కషాయరసమును రసముగాగూడా నుండును రూక్షత్వగుణమున్నది.

అటులనే చెరకురసముకూడా రసానుగుణముగామధురము గనుక వాతశాంతిని చేయవలెను కానీ మధురమై యుండియు చెరకురసము వాతశాంతిని చేయక వాత వృద్ధినే చేయును శీతవీర్యము కలదగుటచేతనే వాతవృద్ధిని చేయుచున్నది. అటులనే ఆమ్లరసముగల ఉసిరికయు, లవణరసముగల సైంధవ లవణమున్నూ రసానుగుణముగా పైత్యవృద్ధిని చేయవలసిన వైననూ మృదుశీత వీర్యములు గలవగుటచే పిత్తశాంతిని చేయును. అటులనే కటురసముగల ముల్లంగి రసానుగుణముగా శ్లేష్మ హారమయినదిగాగాక, స్నిగ్ధవీర్యము గల దగుటచే శ్లేష్మ వృద్ధిని చేయును. ద్రవ్యములలోగల రసములందలి విశిష్ట గుణములు వీర్యముగా వ్యవహరించబడును. రసములందు గల ప్రత్యేక గుణములు కల్గియున్న వస్తువులు వీర్యవంతములుగా పేర్కొనబడును వింశతి గుణములును గల ద్రవ్యములను పరిశీలించిన కొన్ని సౌమ్యములుగనూ కొన్ని తీక్షములుగను గోచరించును. అందువలన వీర్యములు రెండని నిర్ణయింపవచ్చును. ఒకటి శీతవీర్యము, రెండవది ఉష్ణవీర్యము ప్రపంచమునందలి ద్రవ్యములన్నియు - సౌమ్యము, ఆగ్నేయము అని ద్వివిధముగనే యుండును.

రసములలో - మధు, తిక్త, కషాయములు-సౌమ్యములు కటు, ఆమ్ల, లవణ రసములు ఆగ్నేయములు.

మాస ఫలములు

10–12–58 నుండి 9–1–59 వరకు

శ్రీ 'బుధ'

గ్రహస్థితి - రవి, బుధులు వృశ్చిక, ధనుస్సులలో శుక్రుడు ధనుర్మకరములలో, కుజుడు మేషము గురుడు తులావృశ్చికములలో, శని ధనుస్సు, రాహువుకన్య, కేతువు మీనము.

మేషము

(అశ్వని, భరణి, కృత్తిక 1 పాదం)

ఈరాశి వారికి గ్రహస్థితి 20 వ. తేదీనుండి అనుకూలం. అవరోధాలన్నీ తొలగి, అవకాశాలేర్పడుతాయి. అమితాలోచనలతో మనస్సు అతిచంచలంగా వుంటుంది సాంఘిక సమస్యలు మీమనస్సును నొప్పించి వ్యాకుల పరుస్తాయి ఓర్పు మిగుల అవసరం నూతనోద్యమములలో పాల్గొందురు. వృత్తివుద్యమముల యందాధిక్యత, గౌరవము, ధన వృద్ధితోబాటు ఉద్యోగాభివృద్ధి భూ-గృహ, విషయాలలో గల చిక్కులు తేలిపోవును. వ్యాపార లాభం వ్యవహారిక విజయం, శుభకార్య నిర్వహణ, బంధు మిత్ర సమాగమము లాభకరమగు ప్రయాణములు. కళత్ర పుత్ర సౌఖ్యములు పితృసమానులతో వైరము.

వృషభము

(కృత్తిక 2,3,4 పా, రోహిణి,
మృగశిర 1 2 పా)

గత కొద్ది మాసములనుండీ, ఈ రాశివారికి గ్రహస్థితి ఏమాత్రం బాగుండలేదు వ్యయమందు కుజవక్రము అష్టమంలో శనితోకలసి రవి సంచారమును బట్టి ఈ నెలలో యింకా, క్లిష్టతర పరిస్థితులు ఏర్పడవచ్చును. ఆత్మ గౌరవం గాపాడుకొనుటకై కొన్ని కష్టాలు భరించవలసి ఉంటుంది. నూతన ప్రయత్నము లేవీ కొనసాగవు. చేసిన కృషిలోనైననూ, తగినంత ఆదాయమురాదు. ఆర్థిక ఇబ్బంది తప్పదు. ప్రజలదృష్టిలో పలుచనౌదురు, ఇట్టి కాలంలో మీ సహజ సద్గుణసంపత్తి. సచ్ఛీలము, మిమ్ముల కాపాడుచూ వుంటుంది. స్నేహితుల సహకారమువలన కొన్ని ఇబ్బందులు తీరును. జనవరి మొదటి వారమునుండి- గురు, బుధ శుక్రుల శుభస్థానములలో సంచరించుదురు కాన అప్పటినుండి క్రమక్రమంగా చిక్కులు విడిపోయి కొన్ని శుభఫలితాలు కలుగును. అంతవరకు నూతన కృషి వ్యాపారాదులు తలపెట్టవద్దు.

మిథునము

మృగశిర 3,4 ఆరుద్ర పునర్వసు 1,2,3 పా

ఈరాశివారికి కేంద్ర స్థానములలో పాప గ్రహములున్నవి 20 వ తేదీ వరకు రాజ్యాధిపతి - శతృస్థానములో ప్రకింపను, వృత్తి వుద్యమములలో చిక్కులు కలుగును స్థిరత్వముండదు అనాలోచితముగ పనులను చేయుచుందురు-విసుగుదల, తీవ్రతతో కార్య భంగము ఆరోగ్యం సరిగావుండదు. నరముల బలహీనత, దగ్గు, ఆయాసము మొదలగు బాధలు. సప్తమరాశిలో రవిశనుల సంబంధము మంచిదికాదు-కళత్రముకు అధిక అనారోగ్యం మిత్రులతో విరోధం జనవరి 23 తేదీలనుండి కృషి వ్యాపారాదులు నిరాటంకంగా సాగును వృత్తిలో అభివృద్ధి, స్వల్పలాభము సౌఖ్యము ఇట్టి యిబ్బందులలో కూడామీవిజ్ఞానాత్మకమైన కృషి-గ్రంథ పఠన, వ్యాసరచన సాగుచునే యుండగలవు.

కర్కాటకము

(పునర్వసు 4, పుష్యమి, ఆశ్రేష)

ఈ నెల 15, నుండి 6 ట,రవి. 25 నుండి 5ట బృహస్పతి బుధాంగారకుల, వక్రత్యాగము చిక్కులు విడిపోయి, పరిస్థితులు పూర్తిగా చక్కబడును కార్యసిద్ధి, శతృజయము. కళత్ర పుత్రసౌఖ్యములు ఉత్సాహము ఉద్యోగులకు ఉన్నతాధికారము వేతనాభివృద్ధి, వ్యాపారలాభము భూగృహ విషయములలో

సామాన్యముగా మధు, తిక్త, కషాయరసములు గలవి శీతవీర్యము గలవిగా నుండును.

కట్వామ్ల లవణరసములు గలవి ఉష్ణవీర్యము గలవిగా నుండును.

శీతవీర్యముగా గలిగిన మధు తిక్త కషాయరసములు-పైత్య హారమయినవి. శ్లేష్మవర్ధక మయినవిగా నుండును,

కట్వామ్ల లవణరసములు ప్రధానముగాగల ఉష్ణవీర్య ద్రవ్యములు శ్లేష్మహారముగానుండును. పిత్తవృద్ధిని చేయును

సాధారణముగా మధు రామ్ల లవణ రసములు - వాతహారమయి నట్టివిగా నుండును కానీ ఆ రసద్రవ్యములందు - రూక్షత్వము, లఘుత్వము, శీతత్వగుణము లున్నచో అవివాతహారములు కాజాలవు

పిత్తశాంతిని మధు, తిక్త, కషాయ రసములు చేయును ఆసములందు తీక్ష్ణత్వము, ఉష్ణత్వము, లఘుత్వ గుణము లున్నచో-అవిపిత్తశాంతిని చేయజాలవు.

శ్లేష్మశాంతిని చేయునట్టి కటు, తిక్త కషాయ రసములందు స్నేహ. శైత్య గుణము లున్నచో అవి శ్లేష్మశాంతిని చేయజాలవు,

విపాకమన-ఆహార పదార్థములు స్వీకరించిన పిదప జరిగిన పరిణామము తినిన ఆహార పదార్థము లన్నియునూ, గైకొనినపుడున్న రస, గుణముల ననుసరించి యుండవు తినిన. యాహార పదార్థములు బాగుగా విపాకమును బొందినచో గుణమును, బాగుగా విపాకము నందకున్నచో దోషములు కలుగజేయును జీర్ణమయిన పిదప-మనము గైకొనినపుడు కారముగా నుండునని కొన్ని మధురముగా మారును. కొన్ని పులుపుగను, చేదుగాను ఉండునవి తీయగా మారను చేదుగా నున్నట్టివి కారముగా మారను కనుక విపాకమునకూడా ఆ ద్రవ్యగుణ మేరీతిననుండునో తెలుసికొనిననాడు తన ఆరోగ్యమున కనుసరణీయమగు ఆహారపదార్థములను స్వీకరించును. శొంఠిని తినిన వెంటనే కారముగా నుండును, కానీ విపాకమునందిన పిదప అది మధురముగా మారును సామాన్యముగా కటురసము పైత్యవర్ధకము శొంఠి కటురసముగలదైననూ విపాకమున మధురముగా మారుచున్నది గాన వాతశాంతిని చేయుచున్నది. ఇది మధుర విపాకగుణము. ఆయుర్వేద శాస్త్రమున విపాకములు రెండుగా పేర్కొనబడినవి ఒకటి మధుర విపాకము. వేరొకటి కటు విపాకము, జారరాగ్నిచే పచింబడు ద్రవ్యములందు ఉదకము, భూమి, యీభూత సంబంధము లగు గుణము లధికముగా ఉత్పన్నమయినచో-ఆ ద్రవ్యము మధుర విపాకము గలదని చెప్పబడును.

జారరాగ్నిచే పచింపబడు ద్రవ్యమునందు తేజస్సు, వాయువు, ఆకాశము యీ భూతసంబంధములగు గుణము లధికముగా ఉత్పన్నమయినచో ఆద్రవ్యము కటు విపాకము గలదని చెప్పబడును.

మీ ప్రయత్నములు సఫలమగును. సాంఘిక, రాజకీయములలో అనుకూలం, దైవచింతన. విద్యాభిలాష. నూతన వస్తువాహన సిద్ధి.

సింహము

[మఖ, పూఫ, ఉఫ 1పా.]

పంచమ, నవమ, కోణములలో, రవి-కుజ శనుల స్థితి మంచిదికాదు ప్రాకృత ఫలితము నివ్వరు. కాని, నూతన ఆశయముల కల్పించి ఉద్రేక పరచుదురు. ఊహా ప్రపంచంలో ప్రయాణం చేస్తారు. మీ మనోప్రవృత్తి, రాజకీయ, సాంఘిక-ఆధ్యాత్మిక విషయములలో నొకదానియందు ఏక్కువగా పనిచేస్తూవుంటుంది. లేదా సాహిత్యము కళ, వీటిద్యుం దైననూ పాల్గొందురు. మీ సున్నిత హృదయమునకు బాధకల్గును, వృత్తి వ్యాపారాదులు యధాక్రమంలో సాగును, గౌరవప్రతిష్టలకు లోపమురాదు ధనస్థానములోనున్న రాహువుకు శని దృష్టిచే ఆదాయముకన్న వ్యయమధికం, సంతానమునకు స్వల్ప అనారోగ్యం ఇష్టులతో యెడబాటు. డిసెం, 28 నుండి, గురుడు సుఖస్థానంలోకి రాగలడు, పరిస్థితులు స్థిమితపడును. మనశ్శాంతి కలుగును.

కన్య

(ఉఫ 2, 3 4 హస్త, చిత్త, 1, 2 పా)

మీకు సహజంగా కలిగియున్న ప్రతిభ-వివేచనాశక్తి- సూక్ష్మబుద్ధి మొదలగునవియు బాగుగా ప్రకాశించగలవు మీ విజ్ఞానముచే నిర్మాణాత్మకమైన సత్ఫలితాన్నివ్వగలప్రయత్నములు చేయుదురు లోగా చేసియున్న పనులను తిరిగి సంస్కరించి సరియగు మార్గములలో నడిపింపజూతురు సాహిత్యము, న్యాయసూత్రములు. రాజకీయముల గూర్చిన మీభాష గూఢమైననూ సర్వజనామోదంగా వుంటుంది, కాని తృతీయాష్టమములలో కుజ బుధుల వక్రగతిచే యత్నకార్యముల యందాటంకములే ఎక్కువ- వృత్తి వ్యాపారములలో ఒడుదుడుకులున్నవి, వ్యాపారస్తులకు లాభకరంగా వుండదు. ధన, భాగ్యాధిపతియైన శుక్రుడు చతుర్థ పంచమ రాసులలో సంచరించును. కావున భూవసతినుంచి మిత్రులవలన స్త్రీలవలన ఆదాయం రాగలదు. నూతన వస్తువాహనసిద్ధి వ్యయాధిపతియైన రవి శనితో జేరి సుఖస్థానములో యున్నందున శరీర సౌఖ్యము తక్కువ. స్థానచలనం- ఇష్టులతో యెడబాటు

తుల

(చిత్త 3, 4, స్వాతి, విశాఖ 1, 2, 3పా)

ఈ నెలలో గ్రహస్థితి అనుకూలం. ఆశాజనకమగు అవకాశములు అభీష్ట కార్యసిద్ధి. సాహిత్య చిత్రకళా, పరిశ్రమ చేయువారికిది మంచికాలం పదవీలాభము గౌరవ సన్మానములు. ఉద్యోగులకు వేతనాభివృద్ధియు విద్యార్థులకు విజయం. వర్తకులకు విశేషలాభము చేకూరును కుటుంబ కళత్ర స్థానములలో వక్రగ్రహము లుండుటచే మధ్యమధ్య ద్రవ్యాభావముచే ఆర్థిక యిబ్బందులును గృహస్థజీవితంలో భార్యాపుత్రులతో మనస్పర్థ లేర్పడగలవు. ప్రముణములచే ధనవ్యయము వ్యవహారిక చిక్కులు

వృశ్చికము

(విశాఖ 4 అనూ, జ్యేష్ట)

స్వేచ్ఛా జీవితమునకై ప్రయత్నాలు జరుగును. సాహసము, పట్టుదలతో ప్రయత్నించి సత్ఫలితాన్ని పొందుదురు. పరిమితి దాటిన, భంగపాటు తప్పదు వృత్తి వ్యాపారములు కలసివచ్చును ధనవృద్ధి ఉద్యోగాభివృద్ధి గౌరవము చేకూరును వ్యవహారిక సమస్యలు అనుకూలంగా సమసిపోగలవు వృత్తి వ్యాపారాదుల ననుసరించి దూరపుప్రయాణములు కుటుంబస్థానములో పాపుల సంచారమువలన, భార్యాపుత్రులకు స్వల్ప అనారోగ్యం. వర్తకులకు వ్యాపారంలో శ్రమఎక్కువ, లాభం తక్కువ.

ధనుస్సు

(మూల, పూషా, ఉషా 1 పా)

మీ పూర్వాచార పరాయణత్వము - సాంప్రదాయములయందు గల పట్టుదల- నిర్లక్ష్యము

మొదలైనవి యత్నకార్యముల భంగపరచునే కాని- సహకరింపజాలవు జన్మరాశిలో పాపులైన శని రవుల వలన శారీరకసౌఖ్యము వుండదు మానసికంగా వేదన వృత్తి ఉద్యములలో మార్పులు ఉద్యోగస్థులకు ప్రమోషన్ మీద ట్రాన్స్‌ఫర్లు అధికార్లతో వైరము కలుగును ఆర్థికముగా మేలు చేకూరదు వ్యాపారస్థులు సాహసించి వ్యాపారమును నడుపుదురే గాని లాభము స్వల్పము డిసెంబరు 28 తేదీ నుండి వ్యయస్థానములో బృహస్పతి సంచారము చేయునుగాన శుభకార్య నిర్వహణకై లేదా పుణ్య తీర్థయాత్రలకై చేయు యత్నములు అనుకూలించును సత్కర్మాసక్తి కలుగును

మకరము

(ఉషా 2, 3 4 శ్రవణం, ధనిష్ట 1 2పా)

గ్రహస్థిని బట్టి నూతన వ్యాపారాది కృషులలో ప్రవేశించుటకు లాభకరమగు సెక్యులేషన్ వంటి వ్యాపారాదుల నడిపించుటకు రాజకీయ రంగములలో ప్రవేశించుటకు మీమనస్సు ప్రోత్సహిస్తూ వుంటుంది కాని కాలము అనుకూలించదు ఆర్థిక పరిస్థితులు తృప్తి రంగాయుండవు వ్యర్థపు పనులలో తగుల్కొని కొంత ధన నష్టమును పొందగలరు-జనవరి మొదటివారం నుండి గ్రహస్థితి అనుకూలం యత్నకార్యములు కొన్ని సఫలమగును డిసెంబరు 20 నుండి ఆర్థిక యిబ్బందులు క్రమంగా తొలగిపోవును ఋణం చేయుట - లేక వస్తువాహనములను అమ్మివేయుటవలన ధనం చేతికివసుంది గృహస్థ జీవితము సుఖమునివ్వదు అంతరంగిక కలహములు ఎక్కువ రహస్య శతృత్వము బాగా పనిజేస్తుంది డిసెంబరు 28 నుండి బృహస్పతి అనుకూలుడు మొత్తము మీద ఈనెల పూర్వార్థము కంటే ఉత్తరార్థంలో కొన్ని శుభములు సమకూరగలవు

కుంభము

(ధనిష్ట 3 4 శతభిషము పూభా 1 2 3పా)

ఈ రాశివారికి గ్రహస్థితి మిగుల అనుకూలము సర్వకార్యముల యందును మిత్రుల తోడ్పాటు యుండును వృత్తి వ్యాపారములలో అభివృద్ధి ఉద్యోగులకు ఉన్నతపదవి లౌకిక వ్యవహారములలో విజయం - ఆర్థికలాభం ఈ రాశిలో జన్మించిన కొంతమంది పబ్లిక్ కంట్రాక్టు పనులగూర్చి ప్రభుత్వామోదము పొందుటకై ప్రయత్నించి సాధింతురు వర్తకులకు శాస్త్ర పరిశోధకులకు మంచికాలము వారికి ప్రభుత్వాదరణ సమకూరును ఆధ్యాత్మిక శక్తి పారమార్థికచింతన కలిగి కొన్ని సత్కర్మలు చేయగలరు దూరదేశ ప్రయాణము భాతృవుల వలన మేలు కళత్ర పుత్ర సౌఖ్యములు

మీనము

(పూభా 4, ఉభా, రేవతి)

ఈ రాశివారికి డిసెంబరు ఆఖరువారము వరకు భవిష్యత్తునుగూర్చిన ఆందోళనఎక్కువ ఏమాత్రము విశ్రాంతి యుండదు తొందరగా పనుల ముగించుకొన ప్రయత్నింతురే కాని జాగు ఆగుచనే యుండును షష్టాధిపతియైన రవి కర్మస్థానములో శనితోకలసి సంచరించుటచే కొన్ని సాహసకార్యముల జేయబూనుదురు భారీ పెట్టుబడులతో నూతన వ్యాపారములలో ప్రవేశింతురు డిసెంబరు 28 నుండి గురుడును జనవరి 1 నుండి శుక్రుడును భాగ్య- లాభస్థానములలో యుందురు కావున స్నేహితులవల్ల భాగసులవల్ల ధనము సమకూరును భూ గృహాభివృద్ధులగూర్చి చేయు ప్రయత్నములు ఫలించును అధికారుల వల్ల మేలు ప్రయాణములు ఆరోగ్యము భంగమగు సూచనలున్నవి బంధుమరణము అశుభ కర్మ మొదలగు స్వల్పచెడు ఫలములు

Edited, Printed & Published by Sri J Radhakrishna Reddy Vijayawada 2
Printed at Andhra Printers, Vijayawada 2